www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

50 శాతం మించొద్దు!

బిహార్ ప్రభుత్వ రిజర్వేషన్ల పెంపు కొట్టివేత

65 శాతం కుదరదన్న పట్నా హైకోర్టు

కులగణన ఆధారంగా రిజర్వేషన్లు పెంచాం

కులాల శాతం ప్రకారం కాదు

హైకోర్టులో రాష్ట్ర సర్కారు వాదన

సుప్రీంను ఆశ్రయిస్తామన్న డిప్యూటీ సీఎం

2

శుక్రవారం | 21-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 66 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మఋతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: చతుర్దశి ఉ. 7.32 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: జ్యేష్ఠ సా. 6.19 తదుపరి మూల; వర్జ్యం: రా.2.10-3.45; దుర్ముహూర్తం: ఉ.8.22-9.14, మ.12.49-1.35; అమృతఘడియలు: ఉ.9.27-11.04; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 5.45; సూర్యాస్తమయం: 6.48 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

చెంచు మహిళను వివస్త్రను చేసి..

కళ్లు, మర్మాంగాల్లో పచ్చి కారం!

కౌలుదార్ల దుర్మార్గం.. భూమిని కౌలుకిచ్చి

వారి దగ్గరే పనికి వెళుతున్న మహిళ

భర్తతో గొడవపడి మరో గ్రామానికి..

అక్కడి నుంచి తెచ్చి నిర్బంధించి చిత్రహింసలు

మర్మాంగాలపై డీజిల్.. అగ్గిపుల్ల గీసి చురకలు..

నాగర్‌కర్నూల్‌లో ఘోరం.. అదుపులో నలుగురు?

14



మనిషిని 'మార్చిన' రాక్షస ప్రేమ!

అనుమతి లేకుండానే లింగమార్పిడి శస్త్రచికిత్స జరిపించిన ప్రియుడు

సహకరించిన వైద్యులు

తనకు తెలియకుండానే అమ్మాయిగా మారిన అబ్బాయి

యూపీలో దారుణం.. మానవ అవయవ విక్రయ ముఠా కారణమన్న ఆరోపణలు



ముజఫర్‌పూర్, జూన్ 20: సున్నితంగా ఉండాల్సిన ప్రేమ.. ప్రాణాంతకంగా మారుతోంది. ఎదుటి వ్యక్తి ఇష్టాయిష్టాలతో పని లేకుండా ప్రేమను రుద్దే సంఘటనలు పెరిగిపోతున్నాయి. ఇదే తరహాలో యూపీలోని ముజఫర్‌పూర్‌లో ఓ విచిత్ర ఘటన జరిగింది. ఓ యువకుడి మీద ప్రేమను పెంచుకున్న మరో యువకుడు.. సదరు యువకుడికి తెలియకుండానే లింగమార్పిడి

మిగతా 2వ పేజీలో...

పురుషాంగ కణజాలంలో

మైక్రోప్లాస్టిక్స్

2

అంగస్తంభన సమస్య తలెత్తే ప్రమాదం

ఆహారం, నీరు, గాలి ద్వారా శరీరంలోకి ప్లాస్టిక్ రేణువులు

ఇప్పటికే గుండె, వీర్యం, వృషణాల్లో గుర్తింపు

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని హితవు



నీట్ పేపర్ లీక్

బిహార్‌లో ఒక రోజు ముందే మునిసిపల్ ఇంజనీర్ చేతికి

నితీశ్, అమిత్ అనే వ్యక్తులతో రూ. 32 లక్షలకు ఒప్పందం



నీట్, యూజీసీ నెట్ పరీక్షల వివాదంపై ఢిల్లీలో విద్యార్థుల నిరసన

తన మేనల్లుడు సహా నలుగురి కోసం పేపర్ కొనుగోలు

మే 4నే ఆ నలుగురినీ పట్నాకు రప్పించి.. బస ఏర్పాట్లు

వారిలో ఇద్దరి నుంచి.. రూ. 40 లక్షల చొప్పున వసూలు

పట్నాకు వచ్చిన అభ్యర్థులకు ప్రభుత్వ అతిథి గృహంలో బస చేయడానికి మాజీ మంత్రి తేజస్వీయాదవ్ పీఏ సహకారం!

పట్నా, జూన్ 20: నీట్ పేపర్ లీక్ అయ్యింది! "అబ్బే.. నీట్‌లో ఎలాంటి అక్రమాలూ జరగలేదు, పేపర్ లీక్ అయ్యిందనడానికి ఎలాంటి ఆధారాలూ లేవు" అంటూ కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని ఎంతగా దాచే ప్రయత్నం చేస్తున్నా నిజాలు దాగట్లేదు. మే 5న నీట్ పరీక్ష జరగ్గా.. దానికి ఒకరోజు ముందే.. అంటే మే 4వ తేదీనే ప్రశ్నపత్రం బిహార్‌లోని సికందర్ ప్రసాద్ యాదవేందు అనే ప్రభుత్వ ఉద్యోగి చేతికి చేరినట్టు రుజువైంది! దానాపూర్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జూనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న యాదవేందు.. నితీశ్ కుమార్, అమిత్ ఆనంద్ అనే

మిగతా 2వ పేజీలో...

నీట్ రద్దుపై కేంద్రం, ఎన్‌టీఏకి

సుప్రీం నోటీసులు

కౌన్సెలింగ్‌పై నిలుపుదల ఉత్తర్వులు ఇవ్వడానికి నో!

2

- విద్యా వ్యవస్థను ధ్వంసం చేసిన మోదీ సర్కారు: ఖర్గే
- బీజేపీ, ఆర్‌ఎస్ఎస్‌లు చెరబట్టాయి: రాహుల్
- నీట్ అక్రమాలపై నేడు టీపీసీసీ ర్యాలీ

డార్క్‌వెబ్‌లో.. యూజీసీ-నెట్

ప్రశ్నపత్రాలు

2

ఒక్కో పేపర్‌కు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల ధర

టెలిగ్రామ్‌లోనూ ప్రశ్నల చక్కర్లు

అందుకే రద్దు: ధర్మేంద్ర ప్రధాన్

సీబీఐతో దర్యాప్తు చేయిస్తున్నాం

కేంద్ర విద్యాశాఖ అధికారి



కేజ్రీవాల్‌కు

బెయిల్

- మద్యం కేసులో ఢిల్లీ కోర్టు మంజూరు
- దర్యాప్తునకు ఆటంకం కలిగించొద్దు
- సాక్షులను ప్రభావితం చేయొద్దు
- పిలిచినపుడు కోర్టుకు రావాలి
- పలు షరతులు పెట్టిన న్యాయస్థానం
- నేడు జైలు నుంచి ఆప్ చీఫ్ విడుదల
- సత్యమేవ జయతే..: ఢిల్లీ మంత్రి అతిశీ

న్యూఢిల్లీ, జూన్ 20(ఆంధ్రజ్యోతి): ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు భారీ ఊరట..! మద్యం కుంభకోణం కేసులో సరిగ్గా 3 నెలల కింద అరెస్టయిన ఆయనకు ఎట్టకేలకు రెగ్యులర్ బెయిల్ లభించింది. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు వెకేషన్ జడ్జి నియాయ్ బిందు గురువారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. రూ.లక్ష వ్యక్తిగత పూచీకత్తును సమర్పించాలని, దర్యాప్తునకు ఆటంకం కలిగించొద్దని, విచారణకు సహకరించాలని, సాక్షులను ప్రభావితం చేయొద్దని, పిలిచినపుడు కోర్టుకు రావాలని పలు షరతులు విధించారు. కేజ్రీ బెయిల్ పిటిషన్‌కు

మిగతా 13వ పేజీలో...

బొగ్గు.. భగ్గు!

గనుల వేలంపై రాజుకున్న రాజకీయం

దేశవ్యాప్తంగా 60 బ్లాకుల వేలంలో మంచిర్యాల జిల్లా శ్రావణపల్లి బ్లాక్ కూడా

హైదరాబాద్ కేంద్రంగా నేడు వేలం.. పోటీ పడొద్దని ప్రభుత్వ నిర్ణయం



ఖమ్మం కలెక్టరేట్‌లో మీడియాతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బొగ్గు గనుల వేలంపై సెంటిమంటలు అంటుకున్నాయి. ఇప్పటికే తెలంగాణలోని రెండు బొగ్గు నిక్షేపాల బ్లాక్‌లను దాదాపు రెండేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం వేలం వేయగా... తాజాగా మరో మూడో బ్లాక్(శ్రావణపల్లి)ని శుక్రవారం వేలం వేస్తున్నారు. కొత్త గనులు లేక సింగరేణి ఇబ్బందులు పడుతున్న వేళ రాష్ట్రంలోని నిక్షేపాలను వేలం వేయడం అధికార, విపక్షాల మధ్య వాడివేడిని పెంచింది. మేలు చేస్తారని చెరి ఎనిమిది సీట్లు కట్టబెడితే కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు రాష్ట్రంలోని బొగ్గు బ్లాక్‌లను వేలంలో ప్రయివేటు సంస్థలకు కట్టబెట్టి సింగరేణిని ప్రయివేటుపరం చేయాలని చూస్తున్నాయంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. తాము వేలానికి అంగీకరించబోమని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేలం వేసిన రెండు బ్లాక్‌లతో సహా రాష్ట్రంలో అన్ని బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని కోరతామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈ రాజకీయ వేడి నేపథ్యంలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని 60 గనుల

మిగతా 13వ పేజీలో...

వేలం వేస్తే ఊరుకోం

అఖిలపక్షంతో ప్రధాని వద్దకు వెళతాం

సింగరేణి గనులు సంస్థకే ఇవ్వాలి

బీజేపీ, బీఆర్ఎస్‌లు చేసిన చట్టమే శాపంగా మారింది: భట్టి, తుమ్మల

13



కాంగ్రెస్, బీజేపీలు

సింగరేణిని ఖతం చేస్తాయా?

13

విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ ఆపారు

తెలంగాణలో మాత్రం వేలమా?

బీజేపీ రిటర్న్ గిఫ్ట్ ఇదేనా?: కేటీఆర్



ఎర్రబెల్లి.. కాంగ్రెస్‌లోకి?

గతాన్ని మరిచి కలిసి పనిచేద్దామని కబురు!

సీఎం సానుకూలంగా స్పందించినట్లు ప్రచారం

ఆయన్ను చేర్చుకోవద్దని పలువురు నేతల ఒత్తిడి

కాంగ్రెస్‌లో చేరే ప్రసక్తే లేదు: ఎర్రబెల్లి

12

ఫోన్ ట్యాపింగ్ కేసు..

దర్యాప్తు అధికారులకు చుక్కెదురు!

కోర్టు చార్జిషీట్ తిరస్కరణ

నిందితుల బెయిల్ పిటిషన్ల డిస్మిస్

14

తెలంగాణలో.. వచ్చే ఎన్నికల్లో

మాదే అధికారం

- రాష్ట్రంలో 88 స్థానాల్లో గెలుపే లక్ష్యం.. కార్యకర్తలందరికీ నా సెల్యూట్
- కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి.. కేంద్ర మంత్రులకు సన్మానం
- భాగ్యలక్ష్మి దేవాలయాన్ని గోల్డెన్ టెంపుల్‌గా మారుస్తాం: బండి సంజయ్



బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి, బండి సంజయ్, డీకే అరుణ, లక్ష్మణ్, ఈటల తదితరులు

హైదరాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): "బీజేపీకి తెలంగాణలో 8 మంది ఎంపీలు.. 8 మంది ఎమ్మెల్యేలున్నారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో 88 స్థానాల్లో విజయం సాధించి, రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరేయడం ఖాయం" అని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఉద్ఘాటించారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం కృషి చేసిన కార్యకర్తలందరికీ సెల్యూట్ అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 8 మంది ఎంపీలను గెలిపించినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలియజేస్తూ 'సెల్యూట్ తెలంగాణ' పేరిట గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రులుగా బాధ్యతలు స్వీకరించాక రాష్ట్రానికి తొలిసారి వచ్చిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ని.. ఎంపీలుగా విజయం సాధించిన ఈటల రాజేందర్, డీకే అరుణ, ఎం.రఘునందన్‌రావు, నగేశ్, ధర్మపురి అర్వింద్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలను ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఘనంగా సన్మానించారు. 8 మంది ఎమ్మెల్యేలను రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి

మిగతా 12వ పేజీలో...



విమానం ఇంజన్‌లో సమస్య..

గాల్లోనే 3 గంటలు

శంషాబాద్-కౌలాలంపూర్ విమానంలో సాంకేతిక సమస్య

టేకాఫ్ అయిన 15 నిమిషాల్లోనే..

3 గంటలకు పైనే గాల్లో చక్కర్లు

శంషాబాద్ విమానాశ్రయంలోనే సురక్షితంగా అత్యవసర ల్యాండింగ్

శంషాబాద్ రూరల్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయం నుంచి కౌలాలంపూర్ బయలుదేరిన మలేషియా ఎయిర్‌లైన్స్ విమానానికి పెను ప్రమాదం తప్పింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తగా శంషాబాద్ విమానాశ్రయంలోనే అత్యవసర ల్యాండింగ్ చేయడంతో ముప్పు తప్పింది. అధికారులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి దాటక 12.45 గంటలకు 138 మంది ప్రయాణికులతో మలేషియా ఎంహెచ్ 199 విమానం శంషాబాద్ విమానాశ్రయం నుంచి

మిగతా 2వ పేజీలో...

టమాట కిలో 100



ఉల్లిగడ్డ రూ. 100కు రెండున్నర కిలోలు

బీరకాయ, క్యాప్సికమ్ రూ.80.. పచ్చిమిర్చి ప్రియమే

అకాల వర్షాలతో పంటలు దెబ్బతినడంతో పడిపోయిన దిగుబడి

కొత్త పంట వచ్చే జూలై చివరిదాకా ధరాఘాతం తప్పదు

టిఫిన్, మీల్స్ రేట్లపై ప్రభావం.. ధరలు పెంచుతున్న హోటళ్లు

హైదరాబాద్ సిటీ/ ఎర్రగడ్డ/చార్మినార్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లికి చెందిన నవనీత్ రావు గురువారం కూరగాయల కోసం సమీపంలోని రైతు బజార్‌కు వెళ్లాడు! టమాటల రేటు తెలుసుకొని షాక్ అయ్యాడు. కిలో రూ.70 అని చెప్పారు! దూరంగా మంచి క్వాలిటీతో కనిపించడంతో అక్కడికి వెళ్లి అడిగితే కిలో రూ.80 అని చెప్పారు! క్యాప్సికమ్, బీరకాయలూ కిలో 80 రూపాయలే! రూ.500 తీసుకొని పది రకాల కూరగాయలు తీసుకుందామని వెళితే చేతి బస్తాలో సగమే వచ్చాయి! అన్నీ అరకిలో, పావుకిలో చొప్పున కొని ఉసూరుమంటూ ఇంటికెళ్లాడు! ఎర్రగడ్డ, మెహదీపట్నం రైతు బజార్లోనూ ఇవే ధరలు! ఉల్లిగడ్డ రూ.100కు

మిగతా 12వ పేజీలో...

చొప్పదండి ఎమ్మెల్యే భార్య ఆత్మహత్య

అల్వాల్‌లోని ఇంట్లో ఉరి వేసుకున్న రూపాదేవి

ఆర్థిక ఇబ్బందులతోనే..?

12



39కి కల్తీసారా మృతులు

తమిళనాడులో పెరిగిన మరణాల సంఖ్య

మృతుల్లో ఐదుగురు మహిళలు

24 మంది పరిస్థితి విషమం.. ఎటుచూసినా వేదనే

33 మంది కంటిచూపు కోల్పోయే ప్రమాదం

2

పార్ట్‌టైమ్ బీటెక్‌కు జేఎన్‌టీయూ పచ్చజెండా

వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రవేశాలు

14

మూడు కోర్సుల్లో 90 సీట్లకు అనుమతి



ఎన్‌హెచ్ 161ఏఏ

ప్రాంతీయ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి నంబరు!

ప్రస్తుతానికి పనులకే..! ఇదే ఖరారు కావొచ్చు కూడా

పాత అలైన్‌మెంట్ ప్రకారమే నిర్మాణం

12

పటాన్‌చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఇంట్లో

ఈడీ సోదాలు

14

మొత్తం 8 చోట్ల ఒకేసారి తనిఖీలు

పలు డాక్యుమెంట్లు, హార్డ్ డిస్కుల స్వాధీనం

క్రషర్లు, మైనింగ్‌లో అక్రమార్జనపై ఫోకస్?

డార్క్‌వెబ్‌లో.. యూజీసీ-నెట్ ప్రశ్నపత్రాలు

ఒక్కో పేపర్‌కు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల ధర

న్యూఢిల్లీ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): యూజీసీ-నెట్ ప్రశ్నపత్రం లీకైనట్లు తేలిపోయింది. దేశవ్యాప్తంగా మంగళవారం రెండు షిఫ్టుల్లో ఈ పరీక్ష జరగ్గా..సోమవారమే ప్రశ్నపత్రాలు డార్క్‌వెబ్‌లో అందుబాటులోకి వచ్చాయి. ఒక్కో ప్రశ్నపత్రానికి రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ధర నిర్ణయించారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేసే సైబర్ క్రైమ్ హెచ్చరికల విశ్లేషణ యూనిట్-ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) ఈ విషయాన్ని గుర్తించింది. మంగళవారం యూజీసీ-నెట్ పరీక్ష ముగిశాక రెండు షిఫ్టుల ప్రశ్నపత్రాలు, డార్క్‌వెబ్‌లో సంపాదించిన క్వశ్చన్ పేపర్లతో పోల్చిచూశాక అవన్నీ సరిపోలడంతో బుధవారం కేంద్ర విద్యాశాఖకు సమాచారం అందజేసింది. గురువారం సాయంత్రం విలేకరుల సమావేశంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ విషయాలను నిర్ధారించారు. "బుధవారం మధ్యాహ్నం 3గంటలకు మాకు ఈ సమాచారం అందింది. వెంటనే యూజీసీ ఛైర్మన్‌తో మాట్లాడాను. డార్క్‌వెబ్‌లో ముందురోజే అందుబాటులోకి వచ్చిన ప్రశ్నపత్రాలు, టెలిగ్రామ్‌లో చక్కర్లు కొట్టిన ప్రశ్నలు యూజీసీ-నెట్ పరీక్ష పేపర్‌తో సరిపోలాయి" అని అన్నారు. అయితే గురువారం మధ్యాహ్నం విలేకరుల సమావేశంలో కేంద్ర విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి గోవింద్ జైస్వాల్ లీకేజీ వ్యవహారమేమీలేదన్నారు. యూజీసీ-నెట్ పరీక్షపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదని స్పష్టం చేశారు. యూజీసీ-నెట్ పరీక్ష విశ్వసనీయతకు భంగం వాటిల్లిందని ఐ4సీ అనుమానాలను వ్యక్తం చేయడంతో ఆ సమాచారాన్ని సుమోటోగా తీసుకుని, పరీక్షను రద్దు చేశామన్నారు. దీనిపై సీబీఐతో దర్యాప్తు చేయిస్తున్నట్లు తెలిపారు. కాగా జూన్ సెషన్ యూజీసీ-నెట్‌కు దేశవ్యాప్తంగా 11లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా మంగళవారం రెండు షిఫ్టుల్లో జరిగిన పరీక్షలకు 9లక్షల మంది హాజరయ్యారు. మరోవైపు నెట్ రద్దు, నీట్ పేపర్ లీకేజీ ఆరోపణలపై విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. గురువారం ఉదయం సెంట్రల్ ఢిల్లీలోని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇంటి ఎదుట ఆందోళన చేపట్టాయి. ఈ ధర్నాలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఏ, డీఎస్ఎఫ్, కేవైఎస్, ఎన్ఎస్‌యూఐ సంఘాలకు చెందిన 50 మంది నేతలు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. నీట్ లీకేజీ, నెట్ రద్దుపై ఆరెస్సెస్ అనుబంధ విద్యార్థి సంస్థ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఢిల్లీ యూనివర్సిటీ (డీయూ),జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం(జేఎన్‌యూ)లో ఏబీవీపీ నేతలు, కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. కాగా నెట్ లీకేజీ ఉదంతంపై గురువారం కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు సీబీఐ ఓ ప్రకటనలో తెలిపింది.

లోకం తీరు



నీట్ పేపర్ లీక్



(మొదటి పేజీ తరువాయి)

ఇద్దరు వ్యక్తుల నుంచి ఆ పేపర్‌ను సంపాదించాడు. తన మేనల్లుడు, నీట్ అభ్యర్థి అయిన అనురాగ్ యాదవ్‌తోపాటు శివనందన్ కుమార్, అభిషేక్ కుమార్, ఆయుష్ రాజ్ అనే మరో ముగ్గురు నీట్ అభ్యర్థుల కోసం యాదవేందు ఆ ప్రశ్నపత్రాన్ని రూ.32 లక్షలు పెట్టి కొన్నాడు. అదే ప్రశ్నపత్రాన్ని అతడు.. అభిషేక్ కుమార్, ఆయుష్‌రాజ్‌కు ఒక్కొక్కరికీ రూ.40 లక్షల చొప్పున విక్రయించాడు. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న ఈ ఏడుగురూ.. తాము చేసిన నేరాన్ని అంగీకరిస్తూ కన్ఫెషన్ స్టేట్‌మెంట్లు ఇచ్చారు. దానాపూర్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి తాను ఒకసారి ఏదో పనిమీద వెళ్లినప్పుడు అక్కడ తనకు సికిందర్ కుమార్ యాదవేందుతో పరిచయం అయిందని.. అమిత్ ఆనంద్ తన కన్ఫెషన్ స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నాడు. తాను ఎలాంటి ప్రవేశ/పోటీ పరీక్ష పేపర్ అయినా లీక్ చేయగలనని మాటల మధ్యలో అతడికి చెప్పగా.. తనకు తెలిసిన నలుగురైదుగురు నీట్‌కు ప్రిపేర్ అవుతున్నారని, వారు ఆ పరీక్షలో ఉత్తీర్ణులయ్యేలా సహకరించాలని యాదవేందు తనను కోరాడని వివరించాడు. అందుకు రూ.30-32 లక్షల దాకా ఖర్చవుతుందని తాను చెప్పగా.. యాదవేందు అందుకు అంగీకరించాడని తెలిపాడు. ఒప్పందం మేరకు తాను పేపర్ తేగా.. మే 4న యాదవేందు తన వద్దకు నలుగురు అభ్యర్థులను తీసుకొచ్చాడని వెల్లడించాడు. బిహార్, యూపీ, ఝార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో ప్రవేశ/పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలను లీక్ చేసే సాల్వర్ గ్యాంగుల్లో నితీశ్, అమిత్ గ్యాంగు కూడా ఒకటి. నీట్‌తోపాటు.. గతంలో బీపీఎస్సీ, యూపీఎస్సీ ప్రశ్నపత్రాలను లీక్ చేసిన చరిత్ర వీరికి ఉంది. ఇలా అమిత్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాకే.. రాజస్థాన్‌లోని కోటాలో నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న తన మేనల్లుణ్ని, మిగతా ముగ్గుర్నీ యాదవేందు మే 4న పట్నాకు రప్పించాడు. అక్కడ నితీశ్, అమిత్ వారికి ప్రశ్నపత్రంతోపాటు జవాబులు అందజేసి.. సమాధానాలు బట్టీకొట్టడంలో సహకరించారు. ఆ మర్నాడు జరిగిన పరీక్షలో.. అవే ప్రశ్నలు వచ్చినట్టు నలుగురు అభ్యర్థులూ తమ నేరాంగీకార పత్రాల్లో పేర్కొన్నారు. నితీశ్, అమిత్ నుంచి నీట్ ప్రశ్నపత్రాన్ని యాదవేందు కొనుగోలు చేసినట్టు వెల్లడైన నేపథ్యంలో.. "వారు ఆ పేపర్‌ను ఇంకెంతమందికి అమ్మి ఉంటారో? ఎన్ని కోట్లు చేతులు మారి ఉంటాయో? చూడబోతే ఇదేదో చాలా పెద్ద కుంభకోణంలా ఉంది" అనే ఆందోళన లక్షలాది మంది అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది.

ఆ నలుగురూ..

తాను కోటాలో నీట్‌కు ప్రిపేర్ అవుతుండగా.. తన మేనమామ ఫోన్ చేసి ప్రశ్నపత్రం అందినట్టు తెలిపాడని యాదవేందు మేనల్లుడు అనురాగ్ యాదవ్ తన కన్ఫెషన్ స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నాడు. పరీక్షకు ముందురోజున ఆయన తనకు అమిత్ ఆనంద్‌ను, నితీశ్‌కుమార్‌ను పరిచయం చేశాడని.. వారు తనకు ప్రశ్నపత్రం, ఆన్సర్ కీ ఇచ్చారని వెల్లడించాడు. మరో విద్యార్థి శివనందన్ కుమార్.. తమకు యాదవేందుతో కుటుంబపరమైన సంబంధాలు ఉన్నాయని తెలిపాడు. ఆయన తనకు ఫోన్ చేసి.. ఒక ఇంటి చిరునామా ఇచ్చి.. మే 4న అక్కడికి రావాల్సిందిగా చెప్పాడని.. అక్కడే తనకు సాల్వర్ గ్యాంగ్ సభ్యులైన నితీశ్ కుమార్, అమిత్ ఆనంద్ పరిచయమయ్యారని వివరించాడు. మిగతా ఇద్దరు అభ్యర్థులైన అభిషేక్ కుమార్, ఆయుష్‌రాజ్ తండ్రులు అవధేశ్‌కుమార్, అఖిలేశ్ కుమార్.. తాము యాదవేందుకు రూ.40 లక్షల చొప్పున ఇచ్చినట్టు పోలీసులకు వెల్లడించారు. 'నీట్ ప్రశ్నపత్రం ఇచ్చినందుకుగాను.. యాదవేందుకు నేను రెండు బ్లాంక్ చెక్కులు ఇచ్చాను. రూ.40 లక్షలకు మాకు ఒప్పందం కుదిరింది' అని అవధేశ్ కుమార్ లిఖితపూర్వకంగా తెలిపారు.

తేజస్వీ యాదవ్ పీఏ ప్రమేయం..

ముందుగానే అందిన ప్రశ్నపత్రం కోసం మే 4వ తేదీన పట్నాకు చేరుకున్న తన మేనల్లుడు, సోదరికి, మిగతా ముగ్గురు అభ్యర్థులకు వసతి కల్పించడంలో తాను సాయం చేశానని సికందర్ ప్రసాద్ యాదవేందు తన కన్ఫెషన్ స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నాడు. "నా మేనల్లుడు అనురాగ్ యాదవ్ తన తల్లి రీనాకుమారితో కలిసి పట్నాకు వచ్చాడు. పట్నా జూ, ఎయిర్‌పోర్టుకు సమీపంలోని ఒక ప్రభుత్వ అతిథిగృహంలో వారు బస చేయడానికి నేను ఏర్పాట్లు చేశాను" అని యాదవేందు పేర్కొన్నాడు. దీన్ని ధ్రువీకరించుకునేందుకు జాతీయ మీడియా ఆ గెస్ట్‌హౌస్ వద్దకు వెళ్లి ఆరా తీయగా.. వారి బసకు బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ పీఏ ప్రీతమ్ కుమార్ సిఫారసు చేసినట్టు బిల్ పుస్తకాల్లో నమోదైన వివరాల ద్వారా వెల్లడైంది.

పేపర్ లీక్ అయినా.. వచ్చింది 185 మార్కులే!

మేనమామ అక్షరాలా రూ.32 లక్షలకు నీట్ ప్రశ్నపత్రాన్ని కొనుగోలు చేశాడు! ఒక రోజు ముందే.. మేనల్లుడికి ఆ ప్రశ్నపత్రాన్ని, దాంతోపాటు జవాబులను ఇచ్చి బట్టీ కూడా కొట్టించాడు!! ఇంతా చేస్తే ఆ అభ్యర్థికి నీట్‌లో వచ్చిన మార్కులెన్నో తెలుసా? 720కిగాను.. 185 మార్కులే! బిహార్ పోలీసుల అదుపులో ఉన్న అనురాగ్ యాదవ్ కథ ఇది. పరీక్షకు ముందురోజు రాత్రంతా కూర్చుని సమాధానాలు బట్టీ పట్టినా.. అతడికి 54.84 పర్సంటైల్ స్కోరు మాత్రమే వచ్చింది. ఫిజిక్స్‌లో 85. పర్సంటైల్, బయాలజీలో 51 పర్సంటైల్ రాగా.. కెమిస్ట్రీలో కేవలం 5 పర్సంటైల్ మాత్రమే రావడం గమనార్హం. అతడికి వచ్చిన ఆలిండియా ర్యాంకు 10,51,525 కాగా.. ఓబీసీ కేటగిరీలో 4,67,824 ర్యాంకు వచ్చింది. మిగతా అభ్యర్థుల్లో ఒకరికి 300 మార్కులు.. మరొకరికి 581 మార్కులు.. ఇంకొకరికి 483 మార్కులు వచ్చాయి.

నీట్ రద్దుపై కేంద్రానికి, ఎన్‌టీఏకి

సుప్రీం కోర్టు నోటీసులు

కౌన్సెలింగ్‌పై నిలుపుదల ఉత్తర్వులు ఇవ్వడానికి నో!



న్యూఢిల్లీ, జూన్ 20(ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షను రద్దు చేసి, మళ్లీ కొత్తగా పరీక్ష నిర్వహించాలని కోరుతూ 20 మంది అభ్యర్థులు దాఖలుచేసిన పిటిషన్లపైన, నీట్ అక్రమాలపై స్వతంత్ర కమిటీతో దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ దాఖలైన మరో పిటిషన్‌పైన.. స్పందన తెలియజేయాలని సుప్రీంకోర్టు గురువారం కేంద్రానికి, ఎన్‌టీఏకి ఆదేశాలు జారీచేసింది. అలాగే.. ఈ వ్యవహారంపై దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లోని హైకోర్టుల్లో నమోదైన కేసులను సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలంటూ ఎన్‌టీఏ పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో అన్ని హైకోర్టుల్లో నీట్‌పై జరుగుతున్న ప్రొసీడింగ్స్‌పై స్టే విధించింది. జూలై 6 నుంచి నిర్వహించతలపెట్టిన నీట్ కౌన్సెలింగ్‌పై నిలుపుదల ఉత్తర్వులు ఇచ్చేందుకు మాత్రం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టితో కూడిన సుప్రీం ద్విసభ్య ధర్మాసనం తిరస్కరించింది. పిటిషనర్లలో పలు కోచింగ్ సంస్థలు ఉన్నట్టు కేంద్రం తరఫు న్యాయవాది విచారణ సందర్భంగా కోర్టు దృష్టికి తేగా.. వారు విద్యార్థులకు కోచింగ్ ఇచ్చే వ్యాపారం చేస్తున్నారని.. వారికి అలా వచ్చే హక్కు ఉన్నదని ధర్మాసనం స్పష్టం చేసింది. 'విద్యార్థుల హక్కులతో మీరు చెలగాటమాడితే కోచింగ్ సంస్థలు కోర్టుకు రాకుండా ఉంటాయా?' అని నిలదీసింది. కాగా.. సుప్రీంకోర్టు ఆదేశిస్తే నీట్‌ను మళ్లీ నిర్వహించేందుకు కేంద్ర విద్యాశాఖ సిద్ధంగా ఉందని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. ఇక.. నీట్ అవకతవకలపై దేశవ్యాప్తంగా దుమారం రేగుతున్న నేపథ్యంలో ఈ అంశం కేంద్ర హోం మంత్రి అమిత్ షా వద్దకు చేరింది. కేంద్ర మంత్రులు ధర్మేంద్రప్రధాన్, జేపీ నడ్డా బుధవారం అమిత్ షాను ఆయన నివాసంలో కలిసి దాదాపు గంటసేపు మాట్లాడి, అన్ని వివరాలూ తెలిపినట్టు సమాచారం. మరోవైపు.. గ్రేస్ మార్కులు ఇచ్చిన 1500 మందికిపైగా అభ్యర్థులకు ఎన్‌టీఏ మరోసారి నిర్వహించనున్న పరీక్ష రాసే అవకాశం తమకు కూడా కల్పించాలని కోరుతూ ముగ్గురు అభ్యర్థులు దాఖలుచేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టేసింది.

ఎవరు తప్పు చేసినా వదిలేది లేదు: ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ, జూన్ 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తే తమకు అత్యంత ప్రాధాన్య అంశమని.. వారి ప్రయోజనాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్మాణం, పనితీరు, పారదర్శకత, డేటా సెక్యూరిటీ ప్రొటోకాల్ తదితర అంశాలపై క్షుణంగా విచారణ జరిపి ప్రభుత్వానికి సిఫారసులు చేసేందుకు ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమిస్తామని ఆయన తెలిపారు. బిహార్‌లో నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై పోలీసు దర్యాప్తు జరుగుతోందని.. దానిపై త్వరలో తమకు నివేదిక అందుతుందని వెల్లడించారు. కొన్ని చోట్ల తప్పులు జరిగాయని అంగీకరించిన ఆయన.. తప్పు చేసిన వారు ఎన్‌టీఏకు చెందినవారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఎంత పెద్దవారైనా క్షమించబోమని హెచ్చరించారు.

విద్యావ్యవస్థను బీజేపీ, ఆర్ఎస్ఎస్ చెరబట్టాయి

» యుద్ధాలను ఆపినోళ్లు.. పేపర్ లీక్‌ను అడ్డుకోలేకపోయారా?: రాహుల్



న్యూఢిల్లీ, జూన్ 20: ఉక్రెయిన్-రష్యా, ఇజ్రాయెల్-గాజా యుద్ధాలను ఆపినట్లుగా చెప్పుకొనే మోదీ.. పేపర్ లీక్‌ను అడ్డుకోలేకపోయారా? అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. విద్యావ్యవస్థను బీజేపీ, ఆర్ఎస్ఎస్ చెరబట్టాయని, అందుకు మోదీ అవకాశం కల్పించారని ఆరోపించారు. గురువారం ఢిల్లీలో రాహుల్ విలేకరులతో మాట్లాడారు. మోదీ దృష్టంతా లోక్‌సభ స్పీకర్ పదవి తమవారికి దక్కేలా చూడడంపైనే ఉందని, లక్షలాది మంది విద్యార్థులకు సంబంధించిన నీట్ పేపర్ లీకేజీ అంశం ఆయనకు ప్రాధాన్యంగా కనిపించడం లేదని ధ్వజమెత్తారు. మోదీ సైద్ధాంతికంగా పతనం అయ్యారని, ప్రభుత్వాన్ని నడపడంలో ఆయనకు ఇబ్బందులు తప్పవని పేర్కొన్నారు. మరోవైపు నీట్ లీకేజీలో అరెస్టయిన సికిందర్ ప్రసాద్ యదువేందుకు ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని బిహార్ డిప్యూటీ సీఎం విజయ్‌కుమార్ సిన్హా ఆరోపించారు.

విద్యావ్యవస్థను ధ్వంసం చేశారు: ఖర్గే

విద్యావ్యవస్థను మోదీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. నీట్, యూజీసీ-నెట్, సీయూఈటీల్లో ప్రశ్నపత్రాల లీకులు, అక్రమాలు-అవకతవకలు, మోసాలు బహిర్గతమయ్యాయని పేర్కొన్నారు. గురువారం ఆయన 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు చేశారు. రోజుకో ప్రశ్నపత్రం లీక్ అవుతోందని, ఇదేం 'పరీక్షా పే చర్చ' అని ఎద్దేవా చేశారు.



లైక్‌లు, కామెంట్ల కోసం దుస్సాహసం!

» అబ్బాయి చెయ్యే ఆధారంగా కోట అంచున గాల్లో ప్రమాదకరస్థితిలో వేలాడిన అమ్మాయి

పుణె, జూన్ 20: ఇన్‌స్టాలో లైకులు, కామెంట్లు వెల్లువలా వచ్చి పాపులర్ అవుతామనే ఉద్దేశంతో పుణెలో ఆ ఇద్దరు మైనర్లు చేసిన సాహసం, నెటిజన్లను గగుర్పాటుకు గురిచేసింది. లైకులు, కామెంట్ల మాటేమో గానీ చాలామంది 'ఆ ఇద్దరినీ పోలీసులు వెంటనే అరెస్టు చేయాలి' అంటూ కన్నెర్ర చేశారు! ఆ రీల్ చూస్తే.. 'ఏమిటీ మూర్ఖపు పని' అంటూ మీరూ నోరెళ్లబెడతారు. ఆ దుస్సాహం వర్ణించడానికి మాటలు రావు. ఏడెనిమిది అంతస్తులంత ఎత్తయిన కోట అంచున ఓ అబ్బాయి బోర్లా పడుకున్నాడు! అతడి చేతిని పట్టుకొని ఓ అమ్మాయి అత్యంత ప్రమాదకర స్థాయిలో కిందకు వేలాడుతోంది! అబ్బాయి చేయి జారవిడిచినా.. తాను పట్టు కోల్పోయినా పరిస్థితేమిటి? అనే స్పృహ కూడా లేకుండా అంత ప్రమాదకర స్థితిలోనూ ఆ పిల్ల నవ్వులు చిందించడం గమనార్హం. ఈ దృశ్యాన్ని పక్క నుంచి మరో అబ్బాయి వీడియో తీశాడు. ఇప్పుడీ వీడియో ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో వైరల్‌గా మారింది. 'దయచేసి ఈ వీడియో చూడండి.. ఎంత ప్రమాదకర స్థాయిలో తీశారో? కాలం కాటేసేందుకు పొంచివుంది' అంటూ ఓ నెటిజన్ ఆందోళన వ్యక్తం చేశారు. 'ఈ ఇద్దర్నీ జైల్లో పెట్టాలి. అప్పుడే ఇలాంటి వీడియోలు ఇంకెవరూ చేసేందుకు సాహసించరు' అంటూ మరో నెటిజన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

'వందేభారత్' భోజనంలో బొద్దింక

న్యూఢిల్లీ, జూన్ 20: వందేభారత్ రైల్లో సరఫరా చేస్తున్న భోజనంలో బొద్దింక రావడంతో సదరు ప్రయాణికులు షాకైయ్యారు. మంగళవారం భోపాల్ నుంచి ఆగ్రాకు వెళ్తున్న ఓ దంపతులకు ఐఆర్‌సీటీసీ అందించిన భోజనంలో చనిపోయిన బొద్దింక వచ్చింది. దీంతో ఆశ్చర్యపోయిన ప్రయాణికులు ఆ విషయాన్ని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆ పోస్టు వైరల్‌గా మారడంతో ఐఆర్‌సీటీసీ గురువారం స్పందించింది. "మీకు కలిగిన అసౌకర్యానికి క్షమించండి. భోజనం సరఫరా చేసిన సంబంధిత సర్వీస్ ప్రొవైడర్‌పై తగిన చర్యలు తీసుకుంటాం" అని పేర్కొంది. ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన వందేభారత్ రైళ్లలో అపరిశుభ్ర వాతావరణం ఉండడం, ప్రయాణికులకు అందించే భోజనంలో బొద్దింక రావడం వంటి ఘటనలపై ప్రయాణికులు, నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పురుషాంగ కణజాలంలో

మైక్రోప్లాస్టిక్స్

అంగస్తంభన సమస్యకు దారి తీసే ప్రమాదం

వాషింగ్టన్, జూన్ 20: ప్లాస్టిక్ భూతం సర్వవ్యాప్తమైపోయింది. చివరికి మన శరీరంలోకీ వ్యాపించింది. సూక్ష్మ ప్లాస్టిక్ రేణువులు (మైక్రో ప్లాస్టిక్స్) మనిషి దేహంలోని అన్ని అవయవాలను ఆక్రమించేస్తున్నాయి. తాజాగా, పురుషాంగం కణజాలంలోనూ వీటి ఉనికిని శాస్త్రవేత్తలు గుర్తించారు. దీనివల్ల అంగస్తంభన సమస్య తలెత్తే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. అమెరికాలోని మియామీ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ రంజిత్ రామసామి నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం ఈ పరిశోధన జరిపింది. దీంట్లో భాగంగా, అంగస్తంభన సమస్య పరిష్కారం కోసం శస్త్రచికిత్స చేయించుకున్న ఆరుగురు వ్యక్తుల పురుషాంగ కణజాలం నమూనాలను సేకరించారు. వాటిపై కెమికల్ ఇమేజింగ్ నిర్వహించి ఫలితాలను విశ్లేషించారు. ఆ వివరాలను రంజిత్ రామసామి వెల్లడించారు. 'ఐదుగురి నమూనాల్లో ఏడు రకాల మైక్రోప్లాస్టిక్స్ కనిపించాయి. ముఖ్యంగా పాలీఎథిలీన్ టెరెఫ్తలేట్ (పీఈటీ), పాలీప్రొపిలీన్ గణనీయంగా ఉన్నాయి. ప్లాస్టిక్ బాటిళ్లు, డబ్బాల్లో పీఈటీ ఉంటుంది. పాలీప్రొపిలీన్ వాటి మూతలలో ఉంటుంది. ఈ మైక్రోప్లాస్టిక్స్ 2 మైక్రోమీటర్ల సైజులో (ఒక మిల్లీమీటరులో 2 వేలవంతు) కూడా ఉన్నాయి.

ఆహారం, నీరు ద్వారా ప్లాస్టిక్ ప్రవేశం

ఆహారం, నీరు, గాలి, స్పర్శ ద్వారా ఐదు మిల్లీమీటర్ల కన్నా తక్కువ సైజు ఉన్న ప్లాస్టిక్ రేణువులు మన దేహంలోకి చేరుతున్నాయి. మనిషి గుండెలో మైక్రోప్లాస్టిక్స్ ఉన్నట్లు గతంలో ఒక పరిశోధన వెల్లడించింది. పురుషులలోనైతే వృషణాలు, వీర్యం లోనూ వీటి జాడ ఉందని మరో అధ్యయనం తెలిపింది. మియామీ వర్సిటీ శాస్త్రవేత్తల తాజా పరిశోధన.. అంగం కణజాలంలోనూ మైక్రోప్లాస్టిక్స్ చేరిపోయాయని తెలియజేస్తోంది. అంగం స్తంభించినప్పుడు రక్తనాళాల్లో ప్రవాహం పెరిగిపోయి మైక్రోప్లాస్టిక్స్ అంగం కణజాలంలోకి చేరుతుండొచ్చని రంజిత్ రామసామి పేర్కొన్నారు. ఇది దీర్ఘకాలంలో అంగస్తంభన సమస్యకు కారణమవుతుందా అన్నదానిపై మరింత పరిశోధన చేపట్టాల్సి ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలని, ముఖ్యంగా ఆహారం, నీరు వంటి వాటిని ప్లాస్టిక్ డబ్బాలు, బాటిళ్లలో తీసుకోవటం మానేయాలని ఆయన సూచించారు.

50 శాతం మించొద్దు!



బిహార్ రిజర్వేషన్ల పెంపు కొట్టివేత.. 65% కుదరదన్న పట్నా హైకోర్టు

పట్నా, జూన్ 20: ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లను 65 శాతానికి పెంచుతూ ఇటీవల నితీశ్ కుమార్ నేతృత్వంలోని బిహార్ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని పాట్నా హైకోర్టు కొట్టేసింది. రిజర్వేషన్లు 50% దాటరాదని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పునకు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం భిన్నంగా ఉండటంతో జస్టిస్ కె.వినోద్ చంద్రన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. గత ఏడాది నితీశ్ సర్కారు రాష్ట్రవ్యాప్తంగా కుల గణన చేపట్టి, వాటి ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈబీసీల రిజర్వేషన్లను పెంచాలని నిర్ణయించింది. ఈ మేరకు గత ఏడాది నవంబరు 21న రిజర్వేషన్లను 50% నుంచి 65 శాతానికి పెంచుతూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పదిశాతంతో కలిపితే రిజర్వేషన్లు 75 శాతానికి చేరాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16లను రిజర్వేషన్‌ల పెంపు నిర్ణయం ఉల్లంఘిస్తోందంటూ పలువురు హైకోర్టులో పిటిషన్లు వేశారు. హైకోర్టు గత మార్చిలో ఇరు వర్గాల వాదనలు విని తీర్పును వాయిదా వేసింది. గురువారం పిటిషనర్ల వాదనను హైకోర్టు సమర్థిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన రిజర్వేషన్లను కొట్టేసింది. చట్టం ముందు అందరూ సమానులే(ఆర్టికల్14), సమాన అవకాశాలు(ఆర్టికల్ 16) అనే రాజ్యాంగ నిబంధనలు ఉల్లంఘనకు గురైనట్లు హైకోర్టు అంగీకరించింది. కులగణన ఆధారంగా రిజర్వేషన్లను పెంచామన్న వాదనను హైకోర్టు అంగీకరించలేదు. తాము జనాభాలో కులాల శాతాన్ని బట్టి రిజర్వేషన్ పెంచలేదని, తగిన ప్రాతినిధ్యం లభించని కులాలకు ప్రాతినిధ్యం కల్పించేందుకే రిజర్వేషన్లను పెంచామని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. ఈ వాదనను పిటిషనర్లు తోసిపుచ్చారు. కులాల శాతాన్ని బట్టే పెంచారని పిటిషనర్లు అన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు 10% కల్పించినపుడే 50% దాటినందున తాము కొత్తగా ఏమీ సుప్రీంతీర్పును ఉల్లంఘించలేదన్న ప్రభుత్వ వాదనను హైకోర్టు తోసిపుచ్చింది.

తమిళనాడులో 50 శాతానికి మించి

రిజర్వేషన్లు 50 శాతానికి మించి ఉండరాదని 1992లో ఇంద్రా సానే కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఇందుకు భిన్నంగా తమిళనాడులో ఎప్పటి నుంచో 69% రిజర్వేషన్లు అమలవుతున్నాయి. తమిళనాట దశాబ్దాలుగా అమలవుతున్న రిజర్వేషన్లను కాపాడేందుకు అప్పట్లో కేంద్రం తమిళనాడు రిజర్వేషన్లను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చింది. తొమ్మిదో షెడ్యూల్‌లోని అంశాలపై న్యాయ సమీక్షకు అవకాశం లేదు. దాంతో కొన్నాళ్లపాటు సుప్రీంకోర్టు తమిళనాడు రిజర్వేషన్ల జోలికి పోలేదు. తర్వాత కాలంలో సుప్రీంకోర్టు తొమ్మిదో షెడ్యూల్‌లోని అంశాలనూ అవసరమైతే సమీక్షిస్తామని స్పష్టం చేసింది. దాంతో తమిళనాడు రిజర్వేషన్లపై అనేక పిటిషన్లు దాఖలై సుప్రీంకోర్టులో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయి. 50% నిబంధన వచ్చిన తర్వాత మహారాష్ట్రలో మరాఠాల కోసం, రాజస్థాన్, హరియాణాల్లో జాట్‌ల కోసం రిజర్వేషన్లను 50 శాతానికి మించి పెంచే ప్రయత్నం చేయగా సుప్రీంకోర్టు కొట్టేసింది. ఇప్పుడు తాజాగా కుల గణన ప్రాతిపదికన రిజర్వేషన్లను పెంచేందుకు బిహార్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని అక్కడి హైకోర్టు కొట్టేసింది. తాము అధికారానికి వస్తే దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టి, వాటి ఆధారంగా రిజర్వేషన్లు పెంచుతామని ఇండీ కూటమి హామీ ఇచ్చిన నేపథ్యంలో బిహార్ హైకోర్టు తీర్పు ప్రాధాన్యం సంతరించుకుంది.

సుప్రీంకోర్టుకు వెళతాం: డిప్యూటీ సీఎం

హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి అన్నారు. బీజేపీ బిహార్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కూడా అయిన సామ్రాట్ చౌదరి తమ పార్టీ రిజర్వేషన్ల పెంపును పూర్తిగా సమర్థిస్తోందని చెప్పారు. తమ మద్దతుతోనే నితీశ్ ప్రభుత్వం కుల గణన చేపట్టి, ఆయా కులాలకు రిజర్వేషన్లు పెంచాలని నిర్ణయం తీసుకుందని తెలిపారు. తమిళనాడుకు 69% రిజర్వేషన్ ఉన్నపుడు బిహార్‌కు ఎందుకు ఉండరాదని ప్రశ్నించారు. హైకోర్టు తీర్పు తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని ఆర్జేడీ అధినేత తేజస్వి యాదవ్ అన్నారు. హైకోర్టు తీర్పుపై సీఎం నితీశ్ మౌనం వీడాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా తాము ఈ రిజర్వేషన్లను కాపాడుకొనేందుకు సుప్రీంకోర్టుకు వెళ్తామన్నారు. బిహార్ సర్కారు వెంటనే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తుందా? అని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జయరాం రమేశ్ ప్రశ్నించారు.

విమానం ఇంజన్‌లో సమస్య..

గాల్లోనే 3 గంటలు

(మొదటి పేజీ తరువాయి)

టేకాఫ్ అయ్యింది. ఆ తర్వాత 15 నిమిషాల్లోనే విమానం ఇంజనులో సాంకేతిక సమస్య తలెత్తింది. గమనించిన పైలెట్లు వెంటనే అప్రమత్తమై ఏటీసీ అధికారులకు సమాచారమిచ్చారు. విమానం 3 గంటల పైనే గాల్లోనే చక్కర్లు కొట్టింది. ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. ఏటీసీ అధికారుల నుంచి అనుమతి వచ్చాక 3.19 గంటలకు శంషాబాద్ విమానాశ్రయంలో విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. సాంకేతిక సమస్యకు గల కారణాలు తెలుసుకుంటున్నట్లు మలేషియా ఎయిర్‌లైన్స్ వర్గాలు తెలిపాయి. శంషాబాద్ విమానాశ్రయంలోనే సదరు విమానానికి మరమ్మతులు చేయిస్తున్నట్లు అధికారులు చెప్పారు. కాగా, ప్రయాణికులను గురువారం అర్ధరాత్రి దాటక 12.45 నిమిషాలకు మరో విమానంలో కౌలాలంపూర్ పంపుతామని ఎయిర్‌లైన్స్ తెలిపింది. కొందరు ప్రయాణికులు టికెట్లు రద్దు చేసుకుని వారి వారి ఇళ్లకు వెళ్లిపోగా, మరికొందరు విమానాశ్రయం నోవాటెల్ హోటల్‌లో బస చేశారు.

మనిషిని 'మార్చిన' రాక్షస ప్రేమ!

(మొదటి పేజీ తరువాయి)

శస్త్రచికిత్స జరిపించి అమ్మాయిగా మార్పించాడు. తన అనుమతి లేకుండా జరిగిన ఈ దారుణంపై బాధిత యువకుడు లబోదిబోమంటున్నాడు. యూపీలోని సంజక్ అనే గ్రామానికి చెందిన 20 ఏళ్ల యువకుడు ముజాహిద్‌తో ఓంప్రకాశ్ అనే యువకుడు సన్నిహితంగా ఉండేవాడు. ఈ క్రమంలో ముజాహిద్‌కు ఆరోగ్య సమస్య ఉందని నమ్మించి అతడిని చికిత్స కోసం ముజఫ్ఫర్‌పూర్‌లోని బేగ్రాజ్‌పూర్ మెడికల్ కాలేజీకి ఈ నెల 20న తీసుకెళ్లాడు. వైద్యులు ముజాహిద్‌ను పరీక్షించి, చిన్న శస్త్రచికిత్స చేస్తామని చెప్పి అనస్తీషియా(మత్తుమందు) ఇచ్చారు. ముజాహిద్ మత్తులో ఉండగానే అతడికి లింగమార్పిడి ఆపరేషన్ చేసి పురుషాంగం, వృషణాలు తొలగించారు. స్పృహలోకి వచ్చిన తర్వాత ముజాహిద్ జరిగిన దారుణాన్ని గ్రహించాడు. ఓంప్రకాశ్ అతడి వద్దకు వచ్చి.. 'నేనే ఇదంతా చేయించా. ఇకపై నిన్ను నీ కుటుంబంగానీ, మీ వర్గం వాళ్లుగానీ దగ్గరికి రానివ్వరు. నాతో కలిసి ఉండాల్సిందే. నీ తండ్రిని తుపాకితో కాల్చి చంపుతా. నీ వాటా భూమి తీసుకొని దాన్ని నా పేరు మీద రాయాలి. అది అమ్మి లక్నోకు వెళ్లిపోదాం' అని బెదిరించాడు. దీనిపై ముజాహిద్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఓంప్రకాశ్‌ను పోలీసులు అరెస్టు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. అయితే, ఈ ఘటన వెనుక మానవ అవయవాలను విక్రయించే నేరముఠా ఉందని స్థానిక రైతు నేత శ్యాంలాల్ ఆరోపించారు. మనుషుల నుంచి అవయవాలను తొలగించి వాటిని విక్రయించటం, అనుమతి లేకుండా లింగమార్పిడి శస్త్రచికిత్సలు జరపటం వంటి దారుణాలు బేగ్రాజ్‌పూర్ మెడికల్ కాలేజీలో గతంలోనూ జరిగాయన్నారు. ఈ అనైతిక వ్యాపారంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేశారు. బాధితుడికి రూ.2 కోట్ల పరిహారం ఇవ్వాలన్నారు.

తమిళనాడులో 39కి పెరిగిన

కల్తీసారా మృతులు

చెన్నై, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కళ్లకుర్చి జిల్లా కరుణాపురంలో కల్తీసారా తాగి చనిపోయిన వారి సంఖ్య గురువారానికి 39కి చేరింది. వీరిలో ఐదుగురు మహిళలున్నారు. ఎటు చూసినా ఆ ప్రాంతం రోదనలు, వేదనలతో కన్నీటిసంద్రంలా మారిపోయింది. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులు, భర్తను కోల్పోయిన భార్య, భార్యను కోల్పోయిన భర్త, తమ ఇంటి పెద్దలను కోల్పోయిన కుటుంబీకుల రోదనలతో ఏ ఇల్లు చూసినా విషాదంలో మునిగిపోయింది. కాగా గురువారం సాయంత్రానికి 30 మందికి పైగా అంత్యక్రియలు పూర్తి చేశారు. కల్తీ సారా తాగడం వల్ల తీవ్ర అస్వస్థతకు గురైన వారిలో మరో వంద మందికి పైగా కళ్లకుర్చి, పుదుచ్చేరి, విల్లుపురం, సేలం తదితర ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో మరో 24 మంది పరిస్థితి విషమంగా వున్నట్లు వైద్యులు ప్రకటించారు. అస్వస్థతకు గురైనవారిలో 33 మందికి పైగా బాధితులు కంటి చూపును శాశ్వతంగా కోల్పోయే అవకాశముందని వైద్యులు పేర్కొన్నారు.

దక్షిణ చైనా సముద్రంలో మరో 'గల్వాన్'

ఫిలిప్పీన్స్ బోట్లపై విరుచుకుపడ్డ చైనా కోస్టు గార్డు

కత్తులు, గొడ్డళ్లతో దాడి.. తిప్పికొట్టిన ఫిలిప్పీన్స్ సిబ్బంది

న్యూఢిల్లీ, జూన్ 20: వివాదాస్పదమైన దక్షిణ చైనా సముద్రంలో చైనా సైనికులు పొరుగుదేశమైన ఫిలిప్పీన్స్ నౌకాదళ సిబ్బందిపై గొడ్డళ్లు, కత్తులతో దాడి చేశారు. ఆయుధాలు లేనప్పటికీ ఫిలిప్పీన్స్ సైనికులు వారిని చేతులతోనే సమర్థంగా ఎదుర్కొన్నారు. ఇది నాలుగేళ్ల క్రితం లద్దాఖ్‌లోని గల్వాన్ వ్యాలీలో భారత దేశ సైనికులపై దాడి చేసి 20 మంది ప్రాణాలు తీసిన సంఘటనను గుర్తు చేసింది. నిత్యం నీటిలో మునిగి ఉండే పగడాల దిబ్బ అయిన సెకండ్ థామస్ షోల్ విషయమై ఇరు దేశాల మధ్య వివాదం ఉంది. ఇక్కడ ఫిలిప్పీన్స్ దేశం రెండో ప్రపంచ యుద్ధ కాలం నాటి బార్జ్‌లాంటి ఓ నౌకను నిలిపి ఉంచింది. 100 మీటర్ల పొడవు ఉన్న ఈ నౌకను అత్యవసర సమయాల్లో వాహనాల రవాణా కోసం ఉపయోగిస్తుంటారు. ఈ నౌక వద్ద సుమారు డజను మంది ఫిలిప్పీన్స్ నౌకా దళ సిబ్బంది విధులు నిర్వర్తిస్తుంటారు. వీరికోసం బుధవారం రెండు రబ్బరు బోట్ల (రిజిడ్ హల్ ఇన్‌ఫ్లేటబుల్ బోట్)లో ఆహారం, కొన్ని ఆయుధాలు, ఇతర పదార్థాలను తీసుకెళ్తుండగా ఎనిమిది బోట్లలో వచ్చిన చైనా కోస్టు గార్డు సిబ్బంది వారిపై దాడి చేశారు. తొలుత వారితో వాదనకు దిగి అనంతరం ఆ బోట్లపై దూకారు. వాటిని పెద్ద ఖడ్గాలు, కత్తులు, సుత్తులతో ధ్వంసం చేశారు. ఆ పగడాల దిబ్బ చైనాదని, తమ పరిధిలోకి అక్రమంగా వచ్చారని పేర్కొంటూ దాడి చేశారు. ఫిలిప్పీన్స్ సైనికుల కోసం పెట్టెల్లో తీసుకొచ్చిన ఎనిమిది ఎం4 రైఫిల్స్, నావిగేషన్ పరికరాలు, ఇతర వస్తువులను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అడ్డుకున్న సైనికులను గాయపరిచారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఫిలిప్పీన్స్ మిలటరీ విడుదల చేసింది. దీనిపై ఫిలిప్పీన్ సైనికాధికారి జనరల్ రోమియో బ్రావనర్ జూనియర్ విలేకరులతో మాట్లాడుతూ చైనా సైనికులు 'సముద్ర దొంగలు' అని అభివర్ణించారు. ధైర్యంతో పోరాడారని అభినందిస్తూ గాయపడ్డ సైనికునికి మెడల్‌ను బహూకరించారు.

అమరావతిని ధ్వంసం చేశారు

పైపులు, ఇసుక, కంకర దొంగలించారు.. ఒక దుర్మార్గుడి వల్ల రాజధాని బలైంది

▸ ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఐదు కోట్ల మంది రాష్ట్ర ప్రజల కలల రాజధాని అమరావతి విధ్వంసానికి గురైందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తంచేశారు. అమరావతిని అన్ని రకాలుగా దెబ్బతీసే ప్రయత్నం చేశారన్నారు. చివరికి రాజధానిలోని భవనాల్లో తలుపులు పగలగొట్టించి అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మార్చారని మండిపడ్డారు. గురువారం రాజధాని ప్రాంతంలో చంద్రబాబు 4 గంటలపాటు విస్తృతంగా పర్యటించారు. నాటి సీఎం జగన్ తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజావేదికను కూల్చివేసి తన విధ్వంసక పాలనను ప్రారంభించారు. చంద్రబాబు కూలిన ప్రజావేదిక ప్రాంతంలో మొదలుపెట్టి రాజధాని ప్రాంతంలోని అన్ని భవన నిర్మాణ సముదాయాలను పరిశీలించారు. అనంతరం సీడ్ యాక్సెస్ రోడ్డులో రైతుల సమక్షంలో మీడియాతో మాట్లాడారు. "అమరావతి మనకు చిరునామా లాంటిది. ఐదు కోట్ల మంది దిశ దశను నిర్ధారించే రాజధాని. మూడు రాజధానులు అంటూ మూడు ముక్కలాట ఆడారు. ఏ ముఖ్యమంత్రి అయినా మంచి పనితో పాలన ప్రారంభిస్తారు. కానీ జగన్ ప్రజావేదిక కూల్చివేతతో పరిపాలన మొదలుపెట్టారు." అని ఆవేదన చెందారు. ఐదేళ్ల కిందట వేసిన



అమరావతికి శంకుస్థాపన చేసిన ప్రాంతంలో చంద్రబాబు సాష్టాంగ నమస్కారం

మట్టి ఎక్కడిది అక్కడే ఉందని, చివరికి రాజధాని నిర్మాణానికి తీసుకొచ్చిన పైపులు, ఇసుక, రోడ్డు కంకర కూడా దొంగలించుకుపోయారని చెప్పారు. అంతా చూశాక ఏం చేయాలో కూడా అర్థంకావడంలేదన్నారు. శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని చూస్తే బాధ కలిగిందని. రాష్ట్రం, దేశం, ప్రపంచంలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రార్థనాలయాలు, పవిత్ర నదుల నుంచి పవిత్ర మట్టి, జలాలు తీసుకొచ్చి శంకుస్థాపన చేశామని వివరించారు. ప్రధాని మోదీ పార్లమెంటులోని మట్టితో పాటు యమునా నదీ జలాలు తీసుకొచ్చారని, ఎంత విధ్వంసం చేయాలనియత్నించినా ఆ మహిమే ఈరోజు రాజధానిని కాపాడిందని తెలిపారు. "గతంలో ముఖ్యమంత్రులు మంచి చేయలేకపోతే వదిలేసేవారు. అంతేగానీ ఉన్నవాటిని చెడగొట్టే ప్రయత్నం చేయలేదు. కానీ జగన్ అందుకు భిన్నంగా మొత్తం నాశనం చేశారు" అని చంద్రబాబు ఆగ్రహించారు. అమరావతి రైతులు 1631 రోజులు ఉద్యమం చేశారని చంద్రబాబు పేర్కొన్నారు. వాటిలో ఒక్కో సంఖ్య కూడితే 11 వస్తుందని, చివరికి జగన్‌కు 11 సీట్లే వచ్చాయని చెప్పారు. దేవుడి స్క్రిప్ట్ అంటే ఇదేనన్నారు. మరోపక్క ప్రజావేదిక కూల్చిన ప్రాంతాన్నీ చంద్రబాబు పరిశీలించారు. ఏ రూల్ ప్రకారం దీనిని కూల్చివేశారని సీఆర్‌డీఏ అధికారులను ప్రశ్నించారు. దానికి అధికారులు సమాధానం చెప్పలేకపోయారు.

శంకుస్థాపన స్థలిలో సాష్టాంగ నమస్కారం

అమరావతి ప్రాంతంలో పరిస్థితిని చూసి చంద్రబాబు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఉద్దండరాయునిపాలెంలో ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. దేశంలోని అన్ని దేవాలయాలు, మసీదులు, చర్చిల నుంచి తెచ్చి పవిత్రమైన మట్టి, నదుల నుంచి తెప్పించిన పుణ్య జలాలలో ఏర్పాటు చేసిన మట్టి దిమ్మెను దర్శించుకుని సాష్టాంగ నమస్కారం చేశారు.

నీట్ అక్రమాలపై నేడు కాంగ్రెస్ ర్యాలీ

హైదరాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపడుతున్నట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. నీట్ లీకేజీకి బాధ్యులైన వారిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గురువారం ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే లీకేజీ జరిగిందని.. ఒకే పరీక్షా కేంద్రంలో 8 మందికి టాప్ ర్యాంకు ఎలా వచ్చిందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి లింగం యాదవ్ ప్రశ్నించారు. నిరుద్యోగుల గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదని.. హరీశ్‌రావు అసలు విజ్ఞతే లేకుండా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ నేతలు రియాజ్, దయాకర్, రవళిరెడ్డి, సత్యం శ్రీరంగం మండిపడ్డారు.

నీట్ అకమ్రాలపై సుప్రీం జడ్జీతో విచారణ జరపాలి

▸ కిషన్‌రెడ్డికి విద్యార్థి, యువజన సంఘాల బహిరంగ లేఖ

'నీట్' అక్రమాలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని, కేంద్రం స్పందించేలా ఒత్తిడి చేయాలని కోరుతూ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ బహిరంగ లేఖ రాసింది. నీట్ పరీక్ష నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వ్యవరించిన తీరు కూడా పలు అనుమానాలకు తావిస్తోందని, సార్వత్రిక ఎన్నికల ఫలితాల రోజున నీట్ ఫలితాలు విడుదల చేయడం, ఒకే సెంటర్‌లో 8 మందికి టాప్ ర్యాంకులు వచ్చాయని లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏడు లక్షలకు పైగా విద్యార్థులు పరీక్ష రాశారని, వారికి నష్టం జరుగుతుందన్నారు. లేఖ రాసిన వారిలో ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, వీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.అరుణ్ కుమార్, పలు సంఘాల నేతలున్నారు.

హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి సర్కిల్-20, SLP జోన్, GHMC
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
NIT నం.06/EE/CIR-20/SLPZ/GHMC/1-2/2024-25, తేది:20.06.2024
పని కేటగిరి: సివిల్ పనులు. అంచనా మొత్తం (రూ.లక్షలలో): రూ.81.00 లక్షలు. బిడ్‌ల స్వీకరణకు ప్రారంభ తేది/ఆఖరి తేది మరియు సమయం: 21.06.2024న మ.01.30 గం.లకు/28.06.2024న మ.01.30 గం.లకు అధికారి పేరు మరియు చిరునామా, సెల్ నం: EE, CIR-20, SLPZ, GHMC, 9849906745.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-20, GHMC
DIPR RO No. 933-PP/CL/ADVT/1/2024-25 తేది:20.06.2024

రీజినల్ కో ఆర్డినేటర్, తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలు, సంగారెడ్డి జిల్లా
ఆర్.సి.నెంబర్ RC/157/Tender/2024 **టెండరు ప్రకటన** తేది:20.06.2024
2024-25 విద్యా సంవత్సరమునకు సంగారెడ్డి జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయములలో ఈ దిగువ తెలిపిన వాటికి గాను ఆసక్తి గల టెండరుదారుల నుండి టెండర్లు కోరడమైనది.
1) కూరగాయలు మరియు పండ్లు, 2) స్కిన్ లెస్ చికెన్, మేక మాంసం (మటన్) మరియు కోడి గుడ్లు,3) కేటరింగ్ సర్వీస్,4) స్వీపింగ్ మరియు శానిటేషన్.
ఒక టెండరు ఫారం ధర **రూ.1000/-** సంబంధిత విద్యాలయం నందు డిడి రూపంలో చెల్లించి తేది:**22.06.2024** నుండి **01.07.2024** వరకు పొందగలరు. పూర్తిచేసిన దరఖాస్తులు సమర్పించుటకు చివరి తేది: **01.07.2024 సా.4.00 గం.** వరకు. టెండర్లు తెరుచుటకు తేది: **03.07.2024, ఉ.11.00** గం.లకు.టెండర్లు తెరుచు స్థలం: అదనపు కలెక్టరు, సంగారెడ్డి జిల్లా వారి కార్యాలయం నందు జరుగును. ఇట్టి టెండర్లు ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా వాయిదా వేయుట మరియు రద్దు చేయుటకు అదనపు కలెక్టరు, సంగారెడ్డి జిల్లా గారికి పూర్తి అధికారం కలదు.
గిరిజన గురుకుల విద్యాలయములు
1.TGTWR Degree College (Men), Sanga Reddy, 9912934830, 2.TGTWR Law College, Sangareddy, 8074582331, 3.TGTWURJC (B), Jinnaram 9490957326, 4.TGTWURJC (B), Narayankhed 9014846651, 5.TGTWURJC (B), Kangti 9849328298, 6. TGTWURJC (G).Zaheerabad at Mogudampally 9550910244, 7. TGTWURJC (G), Manur at Karasgutti 6309556852, 8.TGTWURJC (G), Kalher at Sirgapur 9492214470. 9. Mini Gurukulam Kalher 9492214470.
సం/- రీజినల్ కోఆర్డినేటర్, సంగారెడ్డి జిల్లా సం/- అదనపు కలెక్టర్ సంగారెడ్డి జిల్లా
DIPR RO No.901-PP/CL/ADVT/1/2024-25, తేది. 20.06.2024

జిల్లా సమన్వయ అధికారి కార్యాలయము
తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ, హైదరాబాద్ జిల్లా
Rc.No.A/019/DCO/RR/2024, **టెండరు ప్రకటన** తేది: 19.06.2024
హైదరాబాద్ జిల్లాలో తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో / కళాశాలల్లో మరియు మహిళల డిగ్రీ కళాశాల (1) యందు 2024-25 సంవత్సరము కొరకు ఆహార దినుసులు, కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు, గుడ్లు & చికెన్ మటన్, క్యాటరింగ్, ల్యాబ్ మెటీరియల్స్ మరియు స్టేషనరీ వస్తువులు సరఫరా చేయుటకు నమ్మకమయిన అనుభవం కలిగిన కాంట్రాక్టరుల నుండి టెండర్లు ఆహ్వానించబడ్డాయి.

Sl.No.	Name of the Items	EMD rates 2024-25	Name of the Institution	Remarks
1	Catering and Concentrate	1,00,000/-	1.TGSWR School & Jr.College, Mahendra Hills, 2. TGSWR School & Jr College, Shaikpet 3.TGSWR School & College RK Puram 4. TGSWR Degree College, Mahendra Hills	షెడ్యూల్డ్ కులముల మరియు తెగల వారికి ధరావతులో 40% ఇవ్వబడును
2	Food Provisions	1,50,000/-		
3	Vegetables and Fruits	50,000/-		
4	Mutton and Chicken	50,000/-		
5	Stationary Items	1,00,000/-		
6	Lab Material	50,000/-		

టెండరు ఫారములు తేది 20-06-2024 నుండి 28-06-2024 తేదీలలో ఉదయము 10:00 గంటల నుండి 5:00 గంటల వరకు సంబంధిత ప్రధాన చార్యులు పొందవచ్చును. టెండర్ ఫారములకు ప్రతి వస్తువునకు రూ.2000/- డి.డి. రూపాయలు PRINCIPAL పేరు పై కేవలం SBI లో చెల్లుబాటు అయ్యే విధంగా తీసి సీల్డ్ టెండరును తేది 28-06-2024 సాయంత్రం 4:00 PM గంటలలోపు టెండర్ బాక్సులలో వేయవలసి ఉంటుంది. షెడ్యూల్డ్ కులముల మరియు తెగల వారికి ధరావతులో 40 శాతం ఇవ్వబడును. జిల్లా కలెక్టర్ / చైర్మన్ కార్యాలయము హైదరాబాద్-జిల్లా. నందు తేది 29-06-2024 నాడు ఉదయం 11:30 AM గంటలకు జిల్లా కమిటీ సభ్యుల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరువబడును. ఇతర వివరములకు జిల్లా సమన్వయ అధికారి కార్యాలయము తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ, హైదరాబాద్ జిల్లా యందు సంప్రదించగలరు.
సం/- జిల్లా సమన్వయ అధికారి, హైదరాబాద్-జిల్లా సం/- అదనపు కలెక్టర్ / చైర్మన్ (DPC) కొనుగోలు కమిటీ కోసం హైదరాబాద్ - జిల్లా
DIPR R.O.No.916-PP/CL/ADVT/1/2024-25, Dt: 20-06-2024

జవహర్ నవోదయ విద్యాలయ
సిర్పూర్ కాగజ్‌నగర్, జిల్లా : కుమురంభీం ఆసిఫాబాద్, (తెలంగాణ)
నం.4-39/జ.న.వి/యస్.కే.జడ్.ఆర్/2024-25 తేది : 20-06-2024
స్వల్పకాలిక టెండరు ప్రకటన
జవహర్ నవోదయ విద్యాలయ, సిర్పూర్ కాగజ్‌నగర్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కు 2024-25 సంవత్సరానికిగాను ఈ క్రింద తెలుపబడిన వస్తువుల సరఫరా కొరకు ఆసక్తి గల అభ్యర్థుల / సంస్థల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.
1) నిత్యావసర వస్తువులు, 2) టాయలెట్ వస్తువులు,
టెండరు ఫారములను జవహర్ నవోదయ విద్యాలయ, సిర్పూర్ కాగజ్‌నగర్ కార్యాలయం నుండి రూ. 200/- నగదు/డి.డి రూపంలో చెల్లించి తేది : 21-06-2024 నుండి 26-06-2024 వరకు కార్యాలయ పనివేళల యందు పొందవచ్చును. మరియు టెండరు ఫారములు దాఖలు చేయుటకు ఆఖరు తేది : 27-06-2024 ఉదయం 10-00 గంటల వరకు సీల్డ్ టెండర్లు, తేది : 27-06-2024 ఉదయం 11-30 గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షంలో, జవహర్ నవోదయ విద్యాలయం, సిర్పూర్ కాగజ్‌నగర్ నందు తెరువబడును. నియమనిబంధనలు, ధరావత్తు సొమ్ము వివరములు టెండరు ఫారములో పొందుపరచబడినవి.
సం/- (బి. చక్రపాణి), ప్రధానోపాధ్యాయులు
సెల్ :94412 64035

పురపాలక సంఘం గజ్వేల్-ప్రజ్ఞాపూర్, సిద్దిపేట జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
ఫైల్ నెం. E1/276/M.C.G.P/2024-25 తేది: 19.06.2024
మున్సిపల్ సాధారణ నిధులతో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పురపాలక సంఘం యందు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి. 1. పనుల సంఖ్య : 13; 2. పనుల విలువ రూ. : 131.84 లక్షలు; 3. బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది:22.06.2024 ఉ. 11.00 గం.లకు; 4.బిడ్స్ డౌన్‌లోడింగ్ ఆఖరు తేది:28.06.2024 సా. 03.00 గం.లకు; 5. బిడ్స్ సమర్పించు ఆఖరు తేది:28.06.2024 సా. 04.00 గం.లకు; 6. ప్రైస్ బిడ్స్ తెరచు తేది:29.06.2024 ఉ. 11.00 గం.లకు; మిగతా వివరములకు http://tender.eprocurement.gov.in చూడగలరు మరియు మిగతా వివరములకు కార్యాలయ పని వేళల యందు ఫోన్ నెంబర్ 8008104099, 9494462121నకు సంప్రదించగలరు.
సం/- కమిషనర్, పురపాలక సంఘం, గజ్వేల్-ప్రజ్ఞాపూర్
DIPR R.O No. 928-PP/CL/ADVT/1/2024-25 తేది: 20.06.2024

MUFFAKHAM JAH
COLLEGE OF ENGINEERING & TECHNOLOGY
Road No.3, Banjara Hills, Hyderabad.
Telephone: 040-23280305 | 23280306
RECRUITMENT OF TEACHING STAFF
Applications are invited for the following posts:

Professor	**CSE / IT / AIML**
Associate Professor	**CSE / IT / AIDS / AIML**
Assistant Professor	**CSE / AIDS / AIML**

Qualifications: For Post 1&2 : B.E./B.Tech.CSE), M.E./M.Tech.(CSE) and Ph.D (CSE).
For post 3 : B.E./B.Tech.(CSE), M.E./M.Tech.(CSE)
Salary: As per norms.
Note: (1) Details pertaining to eligibility criteria, qualification and experience, etc. are posted on the College website link https://www.mjcollege.ac.in.
(2) Candidates applying for post of Professor and Associate Professor have to submit API Form which can be downloaded from the College website link.
Apply with photograph before **29.06.2023** by email: **principaloffice@mjcollege.ac.in**. No T.A. will be paid for attending interview.
Date: 19.06.2024 Hony. Secretary

డా.మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ, తెలంగాణ
నం. S3/Vehicles/541/2023 **టెండర్ ప్రకటన** తేది. 20.06.2024
డా.మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ, తెలంగాణ, రోడ్ నం.25, జూబ్లీహిల్స్, హైదరాబాద్ వారు సంస్థలో అద్దె ప్రాతిపదికన బస్ సర్వీసుల ఏర్పాటు కొరకు టెండర్లను కోరుచున్నారు. **టెండర్ ఫారమ్‌ల విక్రయం ప్రారంభం:** 21.06.2024న ఉ.11.00 గం.లకు, **టెండర్ ఫారమ్‌ల విక్రయానికి చివరి తేది & సమయం:** 04.07.2024న మ.03.00 గం.లకు, **టెండర్ ఫారమ్ ధర:** "Accounts Officer, Dr MCR HRD Institute of Telangana, Hyderabad" పేరున డీ.డి ద్వారా **రూ.500/-** చెల్లించవలెను. టెండర్ డాక్యుమెంట్‌ని సంస్థ వెబ్‌సైట్ **www.mcrhrdi.gov.in** నుండి డౌన్‌లోడ్ చేసుకోనగలరు.మరియు టెండర్ డాక్యుమెంట్‌తో పాటు రూ.500/- డీడీని జత చేయవలెను. ఏదైనా విచారణల కొరకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (8977784568)ని సంప్రదించగలరు.
సం/- అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్
DIPR RO No.941-PP/CL/ADVT/1/2024-25, తేది. 20.06.2024

తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ లిమిటెడ్
ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ, మల్లాపూర్
చిరునామా: ప్లాట్ నం. 136/డి, ఇండస్ట్రియల్ పార్క్, మల్లాపూర్, హైదరాబాద్ - 500076
ఫోన్ నం. 040-27155630
(ఆర్టికల్ 243-Q కానిస్టిట్యూషన్ ఆఫ్ ఇండియా (తెలంగాణ ప్రభుత్వం, MA & UD (12) శాఖ, GO Ms No. 196, తేది: 21.07.2017 తో చదువబడే (74వ సవరణ చట్టం 1992) క్రింద నియోగించబడినది.)
TGIIC-IALA, మల్లాపూర్, హైదరాబాద్ వారు "అన్ని రోడ్లను ఊడవడం, డ్రైన్లను శుభ్రం చేయడం, చెత్తను ఎత్తివేయడం మరియు సెక్యూరిటీ సర్వీస్‌ల యొక్క ఏర్పాటు" యొక్క పని కొరకు ఆసక్తి వ్యక్తీకరణ/ప్రతిపాదన కొరకు అభ్యర్థన (RFP) కోరుచున్నారు.
దిగువ పని కొరకు ఏకమొత్త కాంట్రాక్టు ప్రాతిపదికన దిగువ సంతకందారు ద్వారా ప్రతిపాదన కొరకు అభ్యర్థన కోరబడినది మరియు అవి దిగువ తెలిపిన విధంగా ఇదే తరహా పనులలో అనుభవం కలిగిన మేడ్చల్ సర్కిల్‌లోని ESI & EPF మరియు లేబర్ రిజిస్ట్రేషన్ కలిగిన అన్ని అర్హత గల సంస్థల స్థానిక కాంట్రాక్టర్ నుండి దిగువ సూచించబడిన అధికారుల ద్వారా స్వీకరించబడతాయి. దరఖాస్తుదారులు తప్పనిసరిగా చెల్లుబాటులో గల EPF, ESI మరియు సాల్వెన్సీ సర్టిఫికెట్, PAN, GST రిజిస్ట్రేషన్. అనుభవ సర్టిఫికెట్ మరియు లేబర్ రిజిస్ట్రేషన్ కలిగి ఉండవలెను వీటిని RFP (ప్రతిపాదన కొరకు అభ్యర్థన)కు జతపరచవలెను.

క్రమ.	వివరాలు	పని పరిధి
1	పని పేరు	పన్నెండు (12) నెలల కాలానికి మేడ్చల్ జిల్లా ఇండస్ట్రియల్ పార్క్- మల్లాపూర్‌లో సెక్యూరిటీ సేవల ఏర్పాటు మరియు ఏదైనా ఇతర సంబంధిత పని మరియు గుర్తించిన మున్సిపల్ డంప్ యార్డుకు చెత్తను ఊడ్చుట మరియు ఎత్తివేయుట మరియు చెత్త (లోడింగ్ మరియు అన్‌లోడింగ్ కలుపుకొని) ఎత్తుట మరియు రవాణా చేయుట, చెత్త సెగ్రిగేషన్, అన్ని పారిశ్రామిక యూనిట్ల నుండి చెత్త (మున్సిపల్ సాలిడ్ వ్యర్థాలు మాత్రమే) యొక్క ఇంటింటి సేకరణ, నిలిచిన వరద నీటి డ్రైన్లు శుభ్రపరచడం మరియు పాడైన వరద నీటి డ్రైన్‌లను శుభ్రపరచడం మరియు వర్షపునీటి హార్వెస్టింగ్ నిర్మాణాలు శుభ్రపరచడం గుర్తించిన రోడ్లు/ప్రదేశాలతో పాటు 50 మీటర్ల విరామంతో శిథిలాలు & చెత్త ఊడ్చడం కలుపుకొని అన్ని రోడ్లు, రోడ్ జంక్షన్లు, రోడ్ మీడియన్‌లు, రోడ్ల వెనుక బహిరంగ ప్రదేశాలు, ఫుట్ పాత్‌లు, ఖాళీ ప్రదేశాలు మరియు ఇతర సాధారణ ప్రాంతాలు మరియు ఇతర నిర్దేశిత ప్రాంతాలు ఏవైనా ఉంటే వాటిని ఊడవడం, శుభ్రపరచడం, తొలగించడం యొక్క వార్షిక నిర్వహణ పని.
2.	కాంట్రాక్ట్ విలువ అంచనా	నెలకు రూ. 4,32,570.74/- (జీఎస్‌టీ మినహాయించి)
3.	RFP డాక్యుమెంట్ల జారీ తేదీ	24.06.2024న ఉ. 11.00గం.ల నుండి సా.05.00 గం.ల వరకు
4.	ప్రీ-బిడ్ సమావేశం	27.06.2024న మ. 02.00గం.ల నుండి మ.03.00 గం.ల వరకు
5.	RFP ధర	రూ.10,000/- (రూపాయలు పది వేలు మాత్రమే) TSIIC-IALA (రెవెన్యూ) మల్లాపూర్ పేరున డిడి
6.	RFP స్వీకరణకు చివరి తేదీ&సమయం	IALA కార్యాలయం మల్లాపూర్‌లో 29.06.2024న మ. 12.00 గం.లకు.
7.	RFP తెరచు తేది& సమయం	IALA కార్యాలయం మల్లాపూర్‌లో 29.06.2024న మ. 02.00 గం.లకు.
8.	రిమార్కులు	RFPలో పేర్కొన్న విధంగా అవసరమైన అనుభవం మరియు ఇతర సంబంధిత డాక్యుమెంట్లు తప్పనిసరి.

ప్రదేశము : IP-మల్లాపూర్
తేది : 19.06.2024
సం/- కమిషనర్, TGIIC-IALA- మల్లాపూర్
DIPR R.O. No: 894-PP/CL/ADVT/1/2024-25 తేది:20.06.2024

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మణిపూర్ హింస

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధినేత మోహన్ భాగవత్ చేసిన ఒక హెచ్చరికలాంటి సూచనవల్లనో, ఏకంగా మణిపూర్ ముఖ్యమంత్రి భద్రతాబలగంలోని పోలీసు వాహనాలమీద మిలిటెంట్లు కాల్పులు జరిపినందువల్లనో తెలియదుకానీ, కేంద్రహోంమంత్రి అమిత్‌షా మణిపూర్‌మీద ఇప్పుడు పూర్తిశ్రద్ధపెట్టారు. సోమవారం ఢిల్లీలో ఆయన మణిపూర్‌శాంతిభద్రతల పరిస్థితిని లోతుగా సమీక్షిస్తున్నప్పుడు ఆ సమావేశంలో ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ లేరు. ఆర్మీచీఫ్, కేంద్ర హోం సెక్రటరీ, ఇంటలిజెన్స్ బ్యూరో (ఐబీ) డైరెక్టర్ ఇత్యాది పెద్దలతో కూడిన ఈ సమావేశానికి మణిపూర్ డీజీపీ, ఆ రాష్ట్ర భద్రతాసలహాదారు, చీఫ్ సెక్రటరీ హాజరైనారు. ఇదేమన్నా రాజకీయ సమవేశమా, ముఖ్యమంత్రిని పిలవడానికి అని బీజేపీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నప్పటికీ, కాంగ్రెస్ మాత్రం ఈ పరిణామాన్ని తనకు నచ్చినరీతిలో విశ్లేషిస్తోంది. బీరేన్ లేరంటే అవిశ్వాసతీర్మానం నెగ్గినట్టే అంటూ ఏవో వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీ సమావేశం వివరాలను ఆ తరువాత ముఖ్యమంత్రి సదరు అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారట. మణిపూర్ ఎంతో కాలంగా రగులుతున్నా ఎవరికీ కనబడని, వినబడని గవర్నర్ సైతం ఇప్పుడు తెరమీదకు వచ్చి ఉన్నతాధికారులతో ఓ సమీక్ష నిర్వహించారు. ఆరునూరైనా హింసను అనుమతించవద్దనీ, కఠినమైన చర్యలతో శాంతిభద్రతలు కాపాడాలని గవర్నర్ అనసూయ డీజీపీకి హితవుచెప్పారు. ముఖ్యమంత్రిని పక్కన బెట్టి ఆమె స్వయంగా రంగంలోకి దిగడం ఢిల్లీ ఆదేశాలు లేనిదే జరగకపోవచ్చు. ఇండియా కూటమికి చెందిన ఓ ఇరవైమంది నాయకులు మణిపూర్ సందర్శించి, గవర్నర్‌తోనూ, ముఖ్యమంత్రితోనూ భేటీ కావడం కూడా వాతావరణంలో వస్తున్న మార్పుకు నిదర్శనం.

మణిపూర్‌లో హింస ఇటీవల మళ్ళీ తీవ్రస్థాయికి చేరడం, మీతీ, కుకీజో తెగల మధ్య ఘర్షణలు తిరిగి రేగడం, అవి కొత్త ప్రాంతాలకు విస్తరించడం కేంద్రప్రభుత్వానికి సరికొత్త పరీక్ష. అసోంకు ఆనుకొని ఉన్న జిరిబమ్ జిల్లా మణిపూర్‌కు ఆర్థికశక్తిని సమకూర్చే మంచి వ్యాపారకేంద్రం. ఏడాదికాలంగా తాకని హింస ఇప్పుడు ఆ జిల్లాకు విస్తరించడంతో కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. రెండుతెగలకూ చెందిన వందకు పైగా ఇళ్ళు తగలబడిపోయి, వందలాదిమంది అసోంకు పారిపోయారు. తెగిపడిన తల ఒకటి దొరకడంతో ఈ అగ్గిరాజుకుంది. పోలీసువాహనాలు, చెక్‌పోస్టులు, అటవీకార్యాలయాలు కూడా ధ్వంసమైనాయి. ముఖ్యమంత్రి అక్కడకు వెళ్ళడానికి సిద్ధమవుతూంటే, అడ్వాన్స్ సెక్యూరిటీ టీమ్ మీద మిలిటెంట్లు దాడి చేశారు. బుధ, గురువారాల్లో కూడా ఇక్కడ హింసాత్మక ఘటనలు జరిగాయి.

మణిపూర్‌లో శాంతిభద్రతలను సమీక్షించిన తరువాత హోంమంత్రి అమిత్ షా ఎవరూ ఊహించని మాటన్నారు. మీతీ, కుకీజో తెగలమధ్య వైషమ్యాలను తుంచి, సయోధ్యను పెంచేందుకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. పరిస్థితిని చేజారనివ్వబోమని, నియంత్రణకు కట్టుబడి ఉన్నామన్నారు. తెగలమధ్య పరస్పర విశ్వాసాన్ని పెంపొందించేందుకు ఒక నిర్దిష్టమైన ప్రయత్నం జరగడం కచ్చితంగా అవసరం. ఇప్పటికైనా అటువంటి ఆలోచన కలిగినందుకు సంతోషించాల్సిందే. కేంద్రహోంమంత్రి శాంతిభద్రతలను సమీక్షించడం, గవర్నర్ ఢిల్లీ వెళ్ళి రావడం, సిఎంతో చర్చలు జరపడం, ఇతర పార్టీల నాయకుల రాకను అడ్డుకోకుండా రాష్ట్రంలో పర్యటించనివ్వడం వంటివి సైతం ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతాయి. ఈ నేపథ్యంలో, ఆయా తెగల ప్రతినిధులతో ఢిల్లీ పెద్దలు నేరుగా కూచొని మాట్లాడితే కచ్చితంగా మరింత ప్రయోజనం ఉంటుంది. హిందువులు అధికంగా ఉన్న తన మీతీజాతి పక్షాన బీరేన్‌సింగ్ నిలబడి, క్రైస్తవులైన కుకీజోలను ఊచకోతకోయిస్తున్నాడన్నది ఆరోపణ. మీతీలకు ఆదివాసీ హోదా కట్టబెట్టాలన్న బీరేన్ కుట్రతో ఈ అగ్గిరాజుకున్న విషయం తెలిసిందే. ఆ హోదాతో వారు తమ ఉద్యోగాలు, భూములను హస్తగతం చేసుకుంటారన్నది ఆదివాసుల భయం. వందలమంది మరణించినా, వేలమంది వలసపోయినా, హత్యలు, అత్యాచారాలు, గృహదహనాలు యథేచ్ఛగా సాగినా కేంద్ర ప్రభుత్వం బీరేన్‌ను అక్కడనుంచి కదల్చలేదు. డబుల్ ఇంజన్ ప్రభుత్వం మణిపూర్‌కు ఎనలేని నష్టాన్ని, ద్రోహాన్ని చేయడంతో పాటు, అంతర్జాతీయంగా భారతదేశం పరువు తీసింది. జాతుల మధ్య సయోధ్య ఏర్పడితే తప్ప, శాంతిభద్రతలు సాధ్యపడవని గుర్తించిన కేంద్రం, ఇప్పటికైనా బీరేన్‌సింగ్‌ను తప్పించి సానుకూల వాతావరణాన్ని ఏర్పరుచుకోవాలి.

ఆ నేర చట్టాల అమలును ఆపండి!

ప్రస్తుతం అమలులో ఉన్న భారతీయ శిక్షా స్మృతి, 1860; భారతీయ సాక్ష్యాధారాల చట్టం, 1872; భారతీయ నేర విధాన స్మృతి/సంహిత, 1973 రద్దవనున్నాయి. వాటి స్థానంలో 'భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, 2023', 'భారతీయ న్యాయ సంహిత, 2023', భారతీయ సాక్ష్యా అధినియం, 2023' అనే మూడు కొత్త నేర చట్టాలు జులై 1 నుంచి అమలులోకి రానున్నాయి. ఈ కొత్త చట్టాలలోని పలు నిబంధనల రాజ్యాంగబద్ధతపై సంశయాలు వ్యక్తమవుతున్న దృష్ట్యా వాటిపై న్యాయమూర్తులు, న్యాయవాదులు, నేర దర్యాప్తు సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, దేశ పౌరులు సమగ్రంగా చర్చించవలసిన అవసరం ఉంది. ఈ విస్తృత, ఆవశ్యక చర్చకు వీలుగా ఈ కొత్త చట్టాల అమలును వాయిదా వేయాలని కోరుతూ కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్‌కు సుప్రీంకోర్టు న్యాయవాది ఇందిరా జైసింగ్ రాసిన లేఖ స్వేచ్ఛానువాదం ఇది.



మాన్య మేఘ్వాల్ గారూ,

కేంద్ర న్యాయశాఖ మంత్రిగా నియమితులయినందుకు తొలుత మిమ్ములను అభినందిస్తున్నాను. ఈ లేఖలో లేవనెత్తిన అంశాలపై ఏకాభిప్రాయ సాధన స్ఫూర్తితో, పౌరుల జీవితం, వ్యక్తిగత స్వేచ్ఛను పరిరక్షించే విషయంలో ప్రజలకు శీఘ్రగతిన న్యాయం సమకూర్చడమనే ఉత్కృష్ట ఆదర్శం ప్రేరణతో మీతో ఉపయోగకరమైన, నిర్మాణాత్మక రీతిలో పరస్పర ప్రభావశీలంగా కలసికట్టు కృషి చేసేందుకు భారత ప్రజలమైన మేము ఆసక్తితో ఎదురుచూస్తున్నాము.

'భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, 2023', 'భారతీయ న్యాయ సంహిత, 2023', భారతీయ సాక్ష్యా అధినియం, 2023' అనే మూడు కొత్త నేర చట్టాలను అమలుపరచనుండడంపై తీవ్ర ఆందోళనతో మీకు నేను ఈ లేఖ రాస్తున్నాను. ఈ మూడు చట్టాలు జూలై 1, 2024 నుంచి అమలులోకి రానున్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న భారతీయ శిక్షా స్మృతి (ఇండియన్ పీనల్ కోడ్), 1860; భారతీయ సాక్ష్యాధారాల చట్టం, 1872; భారతీయ నేర విధాన స్మృతి/సంహిత, 1973ను రద్దు చేసి వాటి స్థానంలో ఇంతకు ముందు ప్రస్తావితమైన మూడు కొత్త నేర చట్టాలను ప్రవేశపెట్టనున్నారు. మూడు మూల చట్టాలలోని పదావళికి ఉన్న అర్థానికి భిన్నమైన భావాన్ని, ఉద్దేశాన్ని తెలియజేసేందుకు అమలులో ఉన్న అనేక చట్ట నిబంధనలకు నూతన స్వరూపాన్ని కల్పించి, కొత్త మాటలు చేర్చారు. అమలులో ఉన్న చట్టాలు వంద సంవత్సరాలకు పైగా భారత న్యాయ పాలనలో కీలక పాత్ర వహిస్తున్నాయి. ఆ చట్టాలలోని ప్రతి విభాగానికీ దేశంలోని వివిధ ఉన్నత న్యాయస్థానాలు (హై కోర్టులు) భారత సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) కేసుల విచారణ క్రమంలో న్యాయ నిర్వహణ సంబంధమైన భాష్యాలు చెప్పాయి. న్యాయపరమైన వ్యాఖ్యానాలు చేశాయి. సుప్రీంకోర్టులోని వివిధ ధర్మాసనాలు ఒక నిర్దిష్ట నిబంధనకు భాష్యం చెప్పడంలో ఒకదానికొకటి విభేదించాయి. ఏకాభిప్రాయం కొరవడినప్పుడు సంబంధిత అంశాలపై విచారణను విస్తృత ధర్మాసనానికి నివేదించేవి.

సరే, మూడు కొత్త నేర చట్టాలు యథాతథంగా అమలులోకి వచ్చినప్పుడు, అమలులో ఉన్న చట్టాల అనువర్తింపు కూడా కొనసాగుతుంది. బహుశా, మరో ఇరవై సంవత్సరాల పాటు లేదా అంతకంటే ఎక్కువ కాలం– ఆ పాత చట్టాల కింద దాఖలైన కేసుల విచారణ– మెజిస్ట్రేట్ కోర్టుతో ప్రారంభమై సుప్రీంకోర్టులో అంతిమంగా ఒక కొలిక్కి వచ్చేదాకా– ఆ ఆ పాత చట్టాల వినియోగం కొనసాగవచ్చు. అత్యంత దిగువ కోర్టు నుంచి అత్యున్నత స్థాయి కోర్టు దాకా సాగే విచారణ కాలాన్ని మన దేశంలో ఒక కేసు జీవన కాల వ్యవధిగా వ్యవహరించడం పరిపాటి.



న్యాయనిపుణుల, న్యాయకోవిదుల, వివేకశీలుర విజ్ఞతాయుత భావాలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా కొత్త నేర చట్టాలను అమలుపరచడం ఉపద్రవానికి దారితీస్తుంది. భారత న్యాయపాలనకు జులై 1న ఎటువంటి విపత్తు దాపురించకుండా నివారించేందుకు మీరు వెంటనే సముచిత నిర్ణయం తీసుకోవాలి.

ఒక పౌరుని జీవితం, స్వేచ్ఛకు; అతనికి వివిధ రూపాలలో, మార్గాలలో నేరపూరితమైన హాని చేసే చర్యలు, విషయాలతో అమలులోకి రానున్న కొత్త చట్టాలు వ్యవహరించనున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు. దేశ ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, ముఖ్యంగా వాక్ స్వాతంత్ర్యం, సమావేశమయ్యే హక్కు, సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కు, నిరసన ప్రదర్శనలు చేసే హక్కు, ఇంకా ఇతర పౌర స్వేచ్ఛలతో కూడా ఆ కొత్త చట్టాలు వ్యవహరిస్తాయి. అమల్లోకి రానున్న మూడు కొత్త చట్టాల్లోని శాంతి భద్రతల నిబంధనలలో భాగంగా ఆ హక్కులను నేరపూరితమైనవిగా పరిగణించడం జరుగుతుంది! వాస్తవానికి మనం చాలా కాలం వరకు (ఇరవై నుంచి ముప్పై సంవత్సరాల పాటు) రెండు సమాంతర నేర విచారణా విధానాలను కలిగి ఉంటామనడంలో సందేహం లేదు. ఇప్పటికే పని భారంతో సతమతమవుతున్న న్యాయవ్యవస్థపై ఈ కొత్త చట్టాలు తప్పక మోపే అదనపు భారాన్ని సమగ్రంగా పరిగణనలోకి తీసుకున్నట్టు కనిపించడం లేదు. వివిధ న్యాయస్థానాల్లో లక్షలాది కేసులు అపరిష్కృతంగా ఉన్నట్టు నేషనల్ జుడీషియల్ గ్రిడ్ గణాంకాలు విశదం చేస్తున్నాయి. కొత్త చట్టాలతో పెండింగ్ కేసులు అంతకంతకూ పెరిగిపోతాయే కానీ తగ్గిపోయే ప్రసక్తే లేదు. ఉదాహరణకు ఒక కేసులో అంతిమ విచారణ జరిగే సుప్రీంకోర్టులోని పెండింగ్ కేసుల వివరాలను చూద్దాం : పెండింగ్‌లో ఉన్న మొత్తం సివిల్ కేసులు : 65,264 కాగా వీటిలో ఒక సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్నవి 20,130 (30.84 శాతం); పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులు 17,804 కాగా ఒక ఏడాదిగా పెండింగ్‌లో ఉన్నవి: 7,829 (43.97 శాతం); మొత్తం పెండింగ్ కేసులు 83,068 కాగా ఒక సంవత్సర కాలంగా ఉన్న కేసులు 27,959 (33.66 శాతం). దేశవ్యాప్తంగా అన్ని న్యాయస్థానాలలోనూ పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల సంఖ్య శీఘ్రగతిన పెరుగుతోందని నేషనల్ జుడీషియల్ డేటా గ్రిడ్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మరి కొత్త నేరచట్టాల ప్రభావం అపరిష్కృతంగా ఉన్న కేసులపై ఎలా ఉంటుందన్న విషయమై ప్రభుత్వం ఏమైనా అధ్యయనం నిర్వహించిందో లేదో నాకు తెలియదు. ఒకవేళ ఏదైనా అధ్యయనం నిర్వహించి ఉన్నట్టయితే దాని వివరాలు ఏవీ ప్రజలకు అందుబాటులో లేవు. దయచేసి ఆ వివరాలను నాకు అందుబాటులో ఉంచాలని అభ్యర్థిస్తున్నాను.

కొత్త నేర చట్టాలను పూర్వానువర్తనం చేసి (రెట్రొస్పెక్టివ్ అప్లికేషన్– ఇది నిస్సందేహంగా చిరాకు కలిగించే రాజ్యాంగ సమస్య) న్యాయాన్ని సత్వరమే సమకూర్చేందుకు వీలుగా న్యాయ వ్యవస్థలోని సదుపాయాల స్థాయిని మెరుగుపరచడంగానీ, మెజిస్ట్రేట్ కోర్టు, సెషన్స్ కోర్టు, హైకోర్టులకే కాకుండా సుప్రీంకోర్టుకు సైతం తగిన విధంగా శిక్షణ ఇచ్చేందుకు ఎటువంటి ప్రయత్నాలు, నాకు తెలిసినంతవరకు జరగనే లేదు. సైద్ధాంతిక నేర న్యాయ చట్టాల (సబ్‌స్టేంటివ్ క్రిమినల్ లా)ను పూర్వానువర్తనం చేయలేమని, అయితే ప్రొసీజర్ లా (ప్రక్రియా శాసనం)ను ఒక పెండింగ్ కేసుకు అనువర్తింపచేయవచ్చన్న విషయం న్యాయవాదులుగా మాకు తెలుసు. ప్రతి ఒక్క పెండింగ్ కేసు విషయంలోను ఏ చట్టాన్ని ఒక ప్రత్యేక కేసులో అనువర్తింపచేయాలనే ప్రశ్న తలెత్తుతుంది. అసలు ఇప్పటికే మూడు కొత్త నేర చట్టాలలోని పలు నిబంధనల రాజ్యాంగ బద్ధతపై ప్రజలు అనేక సంశయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై నేను ఎటువంటి వ్యాఖ్యలు చేయదలుచుకోలేదు. ఎందుకంటే అవి సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయించాల్సిన ప్రశ్నలు.

కొత్త నేర చట్టాల అమలుకు ఇవి సరైన పరిస్థితులేనా? కావని నేను అభిప్రాయపడుతున్నాను. ఈ కారణంగానే సదరు కొత్త చట్టాల అమలును జాప్యం చేయాలని హృదయపూర్వకంగా కోరుతున్నాను. ఆ కొత్త చట్టాలను అమలుపరచడం గురించి, న్యాయాన్ని అందుబాటులో ఉంచడంలో వాటి అమలు నెరపే ప్రభావంపై అన్ని స్థాయిలలోని న్యాయమూర్తులు, న్యాయవాదులు; దర్యాప్తు సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం, మరీ ముఖ్యంగా దేశ పౌరులు సమగ్రంగా చర్చించేందుకు ఒక అవకాశం కల్పించాలి. ఆ చర్చలు నిర్ధారించిన కొత్త చట్టాల మంచి చెడులను, ఆ శాసనాల అమలులో తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. మా ఆందోళనను మీరు అర్థం చేసుకుంటారనే నమ్మకం ఈ దేశ ప్రజలుగా మాకు ఉన్నది. న్యాయనిపుణుల, న్యాయకోవిదుల, వివేకశీలుర విజ్ఞతాయుత భావాలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా కొత్త నేర చట్టాలను అమలుపరచడం ఉపద్రవానికి దారితీస్తుంది జులై 1న భారత న్యాయపాలనకు ఎటువంటి విపత్తు దాపురించకుండా నివారించేందుకు వెన్వెంటనే మీరు సముచిత నిర్ణయం తీసుకోగలరనే నిండు నమ్మకంతో ఈ లేఖను ముగిస్తున్నాను.

■ **ఇందిరా జై సింగ్**
సుప్రీంకోర్టు న్యాయవాది

కొత్త భావాలతో పాత ఎజెండా

కొత్త ప్రభుత్వానికి సూచిస్తున్న ఎజెండా పాత ఎజెండానే, అయితే ఒక ప్రాథమిక తేడాతో. వాస్తవమేమిటంటే కార్యాచరణకు ప్రాధాన్యత నివ్వాల్సిన అంశాల జాబితా మునుపటిదే. అందులో మార్పులు ఏమీ లేవు. ఉండబోవు. ఇంధనం నుంచి నీటి సరఫరా వరకు, పారిశుద్ధ్యం నుంచి ఆహారం, పోషకాహారం దాకా మన కర్తవ్యాల నిర్వహణ, మనం చేయాల్సిన కృషి అసంపూర్ణంగా ఉన్నాయి. సరే, ఆరోగ్యం, విద్య గురించి చెప్పనే అవసరం లేదు. ప్రభుత్వం కొన్ని పథకాలను రూపొందించి అమలుపరుస్తుందని మనకు తెలుసు. ప్రస్తావిత రంగాలకు బడ్జెట్ కేటాయింపులు కూడా చేసింది. ప్రజలకు సంక్షేమం, శ్రేయస్సు సమకూర్చే కృషి కొనసాగుతోంది. ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో పాత్రికేయులు దేశంలో నలు మూలలా పర్యటించారు. వివిధ సమస్యలపై ప్రజల అభిప్రాయాలను విన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే కదా ప్రజల అభిప్రాయాలు పరిగణన పొందేది! పెచ్చరిల్లుతోన్న నిరుద్యోగమే అసంఖ్యాక ప్రజలకు అమిత ఆందోళన కరంగా ఉన్నది. స్వచ్ఛమైన తాగు నీటి కొరత, పారిశుద్ధ్యం లోటు ప్రజలను బాగా కలత పెడుతున్న సమస్యలలో ప్రముఖంగా ఉన్నాయి. ఇంధన సంక్షోభం ఇప్పటికీ తీవ్రంగా ఉన్నది. ఎల్‌పిజి సిలెండర్ ధర భరించలేనిదిగా ఉన్నది, విద్యుత్ సరఫరాపై నిశ్చింతకు ఆస్కారం లేదు. రైతులు ఇప్పటికీ నానా దురవస్థల్లో కునారిల్లుతున్నారు. వ్యవసాయ రంగంలో పరిస్థితులను మెరుగుపరిచేందుకు ఇంకా ఎంతో పనిచేయాల్సి వున్నది.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

అభివృద్ధికై సంకల్పించిన అనేకానేక పనులు అసంపూర్ణంగా ఉండిపోవడంపై ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు. ఇండియా ఒక సువిశాల దేశం. పాలనలో ఎన్నో లొసుగులు, లోపాలు ఉన్నాయి. ఏ ప్రభుత్వ పథకమైనా సమాజంలో అట్టడుగు స్థానంలో ఉన్న సామాజిక వర్గం వారికి చేరాలి – ఏదో ఒక సారికాదు, ప్రతిసారీ, అనునిత్యమూ సుమా! ఇదే సమయంలో వాతావరణ మార్పు విషమ ప్రభావం మనకు స్పష్టంగా కనపడుతోంది. ప్రతి రోజూ దేశంలో ఏ దో ఒక ప్రాంతం కనీసం ఒక వాతావరణ వైపరీత్య ఘటనతో అల్లాడిపోతోంది. ఇది అభివృద్ధి కార్యక్రమాల పురోగతికి అవరోధమవుతోంది. అకాల వర్షాలు, తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితులు మరిన్ని కరువుకాటకాలు, వరదలు, తీవ్ర దుర్భిక్షాలకు దారి తీస్తున్నాయి. జీవనాధారాలను తీవ్రంగా దెబ్బ కొడుతున్నాయి. ప్రభుత్వ వనరులపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. ఈ పరిస్థితి సూచిస్తున్నదేమిటి? అభివృద్ధి సాధన మరింత సమర్థంగా జరగాలి. వృద్ధి ఫలాలు సత్వరమే మరింత అధిక స్థాయిలో ప్రజలకు చేరేలా చూడడమూ చాలా ముఖ్యం. ఈ దుర్భర పరిస్థితులు మారిపోయేందుకు, మరింత శుభస్కర పరిస్థితులు నెలకొనేందుకు తదుపరి ప్రభుత్వ కొత్త ఎజెండా– కొత్త ప్రభుత్వం వాస్తవానికి పాత సర్కారే అయినప్పటికీ– ఈ క్రింద సూచించిన విధంగా భిన్నంగా ఉండి తీరాలి.

తొట్ట తొలుత మరింత జవాబుదారీతనంతో వ్యవహరించేలా సంస్థలను పునర్నిర్మించడంపై కొత్త సర్కార్ ప్రథమ ప్రాధాన్యమివ్వాలి. భిన్న దృక్పథంతో ఆలోచించే వారిని, భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేసిన వారిని ప్రభుత్వ శత్రువుగా భావించకూడదు. ప్రత్యామ్నాయ సమాచారం అసమ్మతి కాదు, ప్రభుత్వంపై గురిపెట్టిన విమర్శా కాదు. ప్రత్యామ్నాయ వార్తలు, విశ్లేషణలను అభివృద్ధి సాధనకు జరిగే దోహదంలో భాగంగా చూడాలి. ఏది ప్రయోజనకరంగా పని చేస్తుంది, ఏది లక్ష్య పరిపూర్తికి తోడ్పడం లేదు అన్న విషయమై మనం ఎంత ఎక్కువగా తెలుసుకుంటామో పాలన అంతగా మెరుగుపడుతుంది. ప్రస్తుతం భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నవారిని బలవంతంగా మౌనం వహించేలా చేస్తున్నారు. ఇది ఉద్దేశపూర్వకంగా జరగకపోవచ్చు కానీ పాలకులకు ఇష్టమైనవే ఆమోదయోగ్యమయ్యేట్టు చేస్తుంది. ప్రభుత్వ వంది మాగధులకే ప్రాధాన్యం లభించేట్టు చేస్తుంది. ఇదెంత మాత్రం క్షేమకరం, శ్రేయస్కరం కాదు. ఇటువంటి పాలనా ధోరణులు ఒక ప్రభుత్వాన్ని ప్రజల నిరాదరణకు గురి చేస్తాయి. ప్రజావాణిని వినని, గౌరవించని పాలకులు ఆదరణ ఎలా పొందుతారు? కనుక నిష్పాక్షికంగా ఉండడమనేది ప్రభుత్వ ఎజెండా కావాలి. విశాల దృక్పథంతో ఉండాలి. ఎటువంటి దాపరికం లేనిదిగా, అందరూ పాల్గొన దగినదిగా ఉండాలి. దీనర్థం ప్రభుత్వ కమిటీలలో అందరికీ చోటు కల్పించడం కాదు. సమాచారాన్ని గుర్తించడం, భావాలు, అభిప్రాయాలను గౌరవించడం నమ్మకాన్ని పునరుద్ధరించుకోవడం చాలా కీలకం. పథకాలు సఫలమయ్యేందుకు మాత్రమేకాదు, సమాజాలు శీఘ్రగతిన పురోగమించేందుకు కూడా.

నవ భారతదేశ నిర్మాణానికి కొత్త ఆలోచనలు, కార్యాచరణలకు దోహదం చేసే సంస్థలు అవసరం. గత కొద్ది సంవత్సరాలుగా సంప్రదాయ సంస్థలను ఉద్దేశ పూర్వకంగాను, నిరక్ష్యపరచడం ద్వారా క్షీణించి పోయేలా చేస్తున్నారు. కారణమేమిటి? ఈ సంస్థలు తమ విధులను సరిగ్గా నిర్వర్తించడం లేదని ప్రభుత్వం చెప్పుతున్నది. అవి కాలంలోకి జారిపోవల్సిన అవసరం ఉందని కూడా స్పష్టం చేస్తోంది నిజమేమింటంటే అవి నిర్వర్తిస్తున్న కీలక విధులను మరింత చురుగ్గా, మరింత మెరుగ్గా నిర్వర్తించేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం చేపట్టడం లేదు. కాలుష్య నియంత్రణకు ఏర్పాటు చేసిన ఏజెన్సీలనే తీసుకోండి అవి అర్థరహితంగా పరిణమించాయి. వాటిలో కొన్ని కాలుష్యంపై పోరుకు సంబంధించిన వాణిజ్యం నుంచి లబ్ధి పొందేందుకు ప్రయత్నించాయి. యథార్థమేమిటంటే కాలుష్యాన్ని నియంత్రించేందుకు జవాబుదారీతనంతో నిరోధాలను పటిష్ఠంగా అనువర్తింప చేసే సంస్థలు అవసరం. ఇబ్బందికరమైన, కఠోర నిర్ణయాలు తీసుకుని వాటిని కచ్చితంగా అమలుపరిచే సామర్థ్యమూ వాటికి ఉండాలి. మరి ఈ సామర్థ్యమే ఇప్పుడు పూర్తిగా కొరవడింది. కాలుష్యం పెరిగిపోతుందంటే ఆశ్చర్యమెందుకు? కాలుష్యం తగ్గిపోదు. మన నదులలోను, వాయుతలంలోను అది సర్వత్రా ఆవరించి ఉన్నది, ఉంటుంది.

ఈ పరిస్థితి లేకుండా పోవాలంటే మనకు రెండు కొత్త తరం సంస్కరణలు అవసరం. ఒకటి– స్థానిక ప్రజలు పాల్గొనే కింది స్థాయి సంస్థలను పటిష్ఠపరచాలి. అభివృద్ధి కార్యక్రమాలు ప్రయోజనకరంగా అమలయ్యేందుకు ప్రజలు క్రియాశీలంగా పాల్గొనే ప్రజాస్వామ్యం మనకు ఎంతైనా అవసరం. స్థానిక స్వపరిపాలన సంస్థల సాధికారతకు ఉద్దేశించిన 74, 75 రాజ్యాంగ సంస్కరణలను ఆమోదించి 30 సంవత్సరాలు గడిచిపోయాయి మరి గ్రామీణ ప్రాంతాలలో పంచాయతీరాజ్, పట్టణ ప్రాంతాలలో మునిసిపల్ వ్యవస్థ మెరుగుపడ్డాయా? గ్రామ సభలను పటిష్ఠపరచడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత ప్రగాఢం చేసే ప్రయోగాలు చేశాము. అయితే ఈ కృషి అంతా అసంపూర్ణంగా మిగిలిపోయింది. సహజ వనరులపై గ్రామీణ, పట్టణ ప్రభుత్వాలకు మరింత నియంత్రణాధికారాలను కల్పించేందుకు చేయవలిసింది ఎంతో ఉన్నది. నిధులు సమకూర్చుకునేందుకు, పథకాల నిర్వహణకు సహజ వనరులను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. కొత్త ఉద్యోగాలను సృష్టించేందుకు, జీవనాధారాలను పెంపొందించుకునేందుకు సహజ వనరుల అభివృద్ధికి మరింతగా మదుపులు చేయవలసి ఉన్నది.



భావాలు, అభిప్రాయాలు, భిన్న సమాచారం పట్ల సహన వైఖరితో వ్యవహరించాలి. ప్రాథమిక స్థాయి సంస్థలను పటిష్ఠపరచి ప్రజలు క్రియాశీలంగా పాల్గొనే ప్రజాస్వామ్యాన్ని పెంపొందించాలి. ఈ వాతావరణ మార్పు యుగంలో అభివృద్ధిని సమ్మిళితం, నిలకడగలదిగా చేసేందుకు వివిధ పథకాలు, కార్యక్రమాలను పునర్వ్యవస్థీకరించాలి.

చివరగా మన అభివృద్ధి పథకాలను కొత్త భావాలతో రూపొందించలవలసిన అవసరమున్నది. చాలా కాలంగా ప్రభుత్వాలు సంక్షేమ దృక్పథం– దీనిని తరచు బిచ్చం వేయడంగా కొట్టివేస్తున్నారు– పెట్టుబడిదారీ దృక్పథం మధ్య చిక్కుకున్నాయి. నా అభిప్రాయంలో వాతావరణ మార్పుతో కొట్టుమిట్టాడుతున్న ఈ కాలానికి ఒక కొత్త దృక్పథం అవసరం. ఆలోచనలు మారాలి. ఆచరణలు విధిగా ప్రయోజనకరం కావాలి. మనం ప్రతి రంగంలోనూ వినూత్న భావాలతో, నవ కార్యాచరణ ప్రణాళికలతో పనిచేయవలసి ఉంది. అభివృద్ధి సమ్మిళితంగాను, సాధించదగినదిగాను, నిలకడగా ఉండి తీరాలి. ఇందుకు పథకాల రూపకల్పనలోనే కాదు వాటి అమలు తీరుతెన్నులలో కూడా మార్పులు అవసరం. ధరిత్రిని కాపాడే కొత్త అభివృద్ధి నమూనా అవసరం ఎంతైనా ఉన్నది. ఆ నమూనా చిట్ట చివరి వ్యక్తికి సైతం సంక్షేమాన్ని సమకూర్చేదిగా ఉండాలి. అవును, ఈ అంశంపైనే కొత్త –పాత ప్రభుత్వం తన దృష్టిని కేంద్రీకరించాలి.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

ఈ మార్పు మన మంచికే...!

ఇటీవలి ఎన్నికల ఫలితాలు నాయకుల స్థితిని, గతిని మార్చాయి. తిరుగేలేదనుకున్న నాయకులు నేల చూపులు చూడాల్సి వచ్చింది. అబద్ధం ప్రచారంలో ఉండి, వాస్తవం జనం చర్చల్లో లేనంత మాత్రాన ఫలితాలు తారుమారు కావు. భారత భాగ్యవిధాతలు, ఆత్మగౌరవ ప్రతీకలు అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ సగటు మనుషులే. జగన్ పార్టీకి మరీ ఇంత తక్కువ సీట్లు ఎట్లా వచ్చాయి? ఆయన ఏటా ఇంటికి రూ. లక్ష వరకు నగదు బదిలీ చేశారు, ప్రభుత్వ సేవలను జనం గుమ్మాల ముందు తెచ్చిపెట్టారు. అయినప్పటికీ జనం కనికరం చూపెట్టలేదు. ప్రతిరోజూ ప్రజల చుట్టూ తిరిగే ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి ఓడిపోయారు. కొద్ది నెలల ముందు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలూ ఇదే తరహా ఆశ్చర్యాన్ని కలిగించాయి. కేసీఆర్ కొత్త కొత్త స్కీములు ప్రవేశపెట్టారు, చెరువులకు అలల నురగలు అద్ది మొక్కజొన్న స్థానంలో వరి వెన్నులను మెరిపించారు. అయినా కారుకు బ్రేకులు పడ్డాయి. అంతెందుకు, ఇండియాను విశ్వగురు చేస్తానని వాగ్దానం చేసిన మోడీ మూడోసారి ఇతరుల దయతో అధికార పీఠం ఎక్కాల్సిన అనివార్యత వచ్చింది. దేశ రాజధాని ఢిల్లీలో మునుపెన్నడూ లేనంతగా ఉచిత కరెంటు, నీళ్లు జనాలకు అందుబాటులోకి వచ్చాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం దొరికింది. అయినా, ఆమ్ ఆద్మీ పార్టీ అడ్రస్ గల్లంతయ్యింది ఢిల్లీలో.

పట్టణ, గ్రామీణ ప్రాంతాల ఓట్ల శాతాన్ని పరిశీలన చేస్తే గ్రామీణ ఓటర్లే అద్భుతమైన చైతన్యాన్ని ప్రదర్శిస్తున్నారు. డిజిటల్ ప్రపంచంలో అవతలివైపు ఉన్నవాళ్లే రాజకీయ నాయకుల స్థితిగతులను నిర్ణయిస్తున్నారు. ఎమర్జెన్సీ సందర్భంలో భారత ప్రజాస్వామ్యం ఇంకా పరిణతి చెందలేని ఇందిరాగాంధీ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భానికి నాలుగు దశాబ్దాల అవతల రాజ్యాంగ పరిషత్ సభ్యులు కూడా నిరక్షరాస్యత ఎక్కువగా ఉన్న మన దేశంలోని పౌరులందరికీ ఓటు హక్కు వద్దు అన్నారు. భారతీయులకు పరిపాలన చేత కాదని బ్రిటిష్ వారూ అన్నారు. భారతీయ ఓటర్లు తమ అనుభవం ద్వారా, తమ ఓటు ద్వారా ఈ వాదాలన్నింటినీ పూర్వపక్షం చేశారు. ఓటు, ఉచిత పథకాలు, తాయిలాలు ఓటర్లను ప్రలోభపరుస్తున్నాయనే మాటను తరుచూ వింటున్నాం. ఓట్ల కోసమే చాలా స్కీములు వస్తున్నమాట నిజం. ప్రజలు వాటిని తీసుకుంటున్న మాటా నిజం. కానీ, వివేచన గల ఓటరుకు ఎవరికి ఓటు వేయాలో తెలుసు. అతడి అభిప్రాయాన్ని ఏ పథకమూ మార్చలేదని, ఏ నాయకుడి మాటలు ప్రభావితం చేయలేదని రుజువవుతున్నది. ఓటర్ల ఆత్మగౌరవం దెబ్బతిన్నప్పుడు తాము భావించిన విధంగా నాయకుడు వ్యవహరించనప్పుడు తప్పును సరిదిద్దుకోవాలని తమ ఓటుతో పాఠం బోధిస్తున్నారు. నాయకుల పట్ల అభిమానం ఉండొచ్చు. పార్టీ సిద్ధాంతాల పట్ల ఆకర్షణ ఉండవచ్చు. ఆచరణలో ఏమిటనేదే అత్యంత కీలకాంశం. తమకు ఏం కావాలో.. తాము ఓటు వేసిన నాయకులు ఎలా ఉండాలో ప్రజల మనసుల్లో ఒక ఇమేజ్ ఉంటుంది. దాన్ని పసిగట్టనప్పుడు, దాన్ని గుర్తించ నిరాకరించినప్పుడు ఫలితాలు ఇలాగే ఉంటాయి. ఒక సామూహిక చైతన్యాన్ని తమను తాము రక్షించుకునే, పరిపాలనను చక్కదిద్దుకునే శక్తి సామర్థ్యాలను సగటు భారతీయ ఓటరు కలిగి ఉన్నాడనడంలో సందేహం లేదు. మొన్నటి లోక్‌సభ ఎన్నికలు మారుతున్న భారతీయుల ఆలోచనా సరళికి అద్దం పట్టేలా ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ఫైజాబాద్ జనరల్ నియోజకవర్గంలో సమాజ్‌వాదీ పార్టీ అవధేశ్ ప్రసాద్ అనే 77 సంవత్సరాల దళితుడిని బరిలోకి దింపింది. బీజేపీ అభ్యర్థిని ఓడించి రికార్డు మెజారిటీతో అతడు లోక్‌సభలో అడుగుపెట్టాడు. మార్పు మంచికే. అంబేడ్కర్ చెప్పిన ఒక మనిషి, ఒక ఓటు, ఒక విలువ ప్రజాస్వామ్యాన్ని ముమ్మాటికి బలపరిచేదిగా, నిలబెట్టేదిగా ఉన్నది.

– **గోర్ల బుచ్చన్న,** జర్నలిస్టు

ఆశయాల సాధనే ఆయనకు నిజమైన నివాళి

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ప్రత్యేక అవసరాల కోసం సాగింది. గత వందేళ్ల తెలంగాణ చరిత్రలో ఇక్కడి ప్రజలు తాము ఎదుర్కొన్న సమస్యలకు పరిష్కారం కోసం ఎన్నో ప్రయత్నాలు చేశారు, ఉద్యమాలు సాగించారు. మరెన్నో త్యాగాలు చేశారు. ఎందరో మేధావులు, విద్యావేత్తలు, విద్యావంతులు, వివిధ వర్గాల, రంగాల నిపుణులు ఎన్నో సూచనలు, సలహాలు ఇచ్చారు. అయితే అందులో ఒకే ఒక్క వ్యక్తి తన జీవితం మొత్తం తెలంగాణ శ్వాసగా బతికారు. ఆయన మరెవరో కాదు ప్రొఫెసర్ జయశంకర్ సార్.

ఆయన ఉమ్మడి వరంగల్ జిల్లా ఆత్మకూర్ మండలం అక్కంపేట గ్రామంలో 1934లో జన్మించారు. అత్యున్నత పదవులను అధిష్ఠించారు. అయితే అవేవీ తనకు అంతగా సంతృప్తినివ్వలేదని ఆయన చాలాసార్లు చెప్పారు. జయశంకర్ సార్ తెలంగాణ ఉద్యమంలో తొలి నుంచి అనుబంధాన్ని కలిగివున్నారు. 1952లో జరిగిన ముల్కీ ఉద్యమంలో ఒక విద్యార్థిగా పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని సిటీ కళాశాల విద్యార్థులు సాగించిన ఉద్యమంలో పాల్గొనటానికి వరంగల్ నుంచి విద్యార్థులతో కలిసి బయలుదేరారు. వాళ్ల వస్తున్న బస్సు భువనగిరిలో పాడైపోయి ఆగిపోయింది. ఆ సమయంలో హైదరాబాద్‌లో జరిగిన పోలీస్ కాల్పుల్లో కొంతమంది విద్యార్థులు మరణించారు. ఈ సంఘటనను గుర్తు చేస్తూ ఎన్నోసార్లు ఆయన బాధపడ్డారు. తాను కూడా ఉద్యమంలో పాల్గొని ప్రాణాలు కోల్పోతే బాగుండేదని బాధపడ్డారు. అది మొదలు తన తుదిశ్వాస వరకు తెలంగాణే జీవితంగా గడిపారు. 77 సంవత్సరాల వయస్సులో క్యాన్సర్‌తో మరణించారు. ఎంతో విలువైన అనుభవాన్ని ఉద్యమానికి అందించారు. ఆయన అందించిన రాజకీయ కార్యక్రమం తెలంగాణ ఉద్యమానికి ఎంతో సహకరించింది.

తెలంగాణ ఉద్యమానికి ఒక అధ్యయన విధానాన్ని అందించారు. తెలంగాణ సమస్యలను అధ్యయనం చేసి, నీళ్లు, నిధులు, నియామకాలు ప్రధానమైనవిగా గుర్తించారు. వాటి మీద ప్రతీ సంవత్సరం నివేదికలను రూపొందించేవారు. ఆ విషయాలను నిరంతరం ప్రజల్లో ప్రచారం చేశారు. దీనితోపాటు ఉద్యమాన్ని నిర్మించడానికి, సజీవంగా ఉంచడానికి కూడా ఒక విధానాన్ని రూపొందించారు. అందులో కూడా మూడు అంశాలను జోడించారు. మొదటిది భావజాల ప్రచారం. రెండవది ఉద్యమ నిర్మాణం. మూడవది రాజకీయ ప్రక్రియ. 1969 నుంచి 1972 వరకు సాగిన ఉద్యమం విజయవంతం కాకపోవడానికి ప్రధాన కారణం రాజకీయ ప్రక్రియను సరైన పద్ధతిలో నడపకపోవడం లేదా నాయకత్వం విఫలం కావడం కారణంగా భావించారు. మలిదశ ఉద్యమంలో రాజకీయ ప్రక్రియ మీద ఎక్కువగా దృష్టి కేంద్రీకరించారు. రాజకీయ పార్టీలను ఉద్యమానికి మద్దతుగా తీసుకురావడం లేదా వాటిని చురుకుగా ఉద్యమంలో పాల్గొనేలా చేయడం కర్తవ్యంగా భావించారు. అందుకే రాజకీయ నాయకుల సంసిద్ధతపై ఆయన తన శక్తిని వినియోగించారు.

తెలంగాణ రాష్ట్రం అభివృద్ధికి ఆయన సూచనలు, సలహాలిచ్చారు. తన ప్రసంగాలు, రచనల ద్వారా విపులంగా వివరించారు. తెలంగాణ అభివృద్ధికి ప్రధానమైన అంశం నీటిపారుదల రంగం అని గుర్తించి, ఎంతో పరిశోధించారు. రెండవది విద్య దాని ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. మూడవ అంశం నిధులు. రాష్ట్రానికి చెందిన ఆర్థిక వనరులను మన అభివృద్ధికే వినియోగించాలని జయశంకర్ సూచించారు.

గత ప్రభుత్వం జయశంకర్ సార్ ఆశయాలను పట్టించుకోలేదు. ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధి కల్పనను గాలికి వదిలేసింది. నిధులను దుర్వినియోగం చేసింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆ ఆశయాల అమలుకు కృషి చేస్తోంది. జయశంకర్ సార్ ఆలోచనలను, ఆశయాలను అమలు చేస్తేనే తెలంగాణ అభివృద్ధి చెందుతుంది.



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్ర పాలనను గాడిలో పెట్టడానికి అహర్నిశలు ప్రయత్నం చేస్తున్నారు. ఈ పదేళ్లలో జరిగిన ఆర్థిక, సాంస్కృతిక విధ్వంసాన్ని సరిచేయడానికి ఆయన నడుము బిగించారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టింది. తెలంగాణ ఉద్యమంలో ప్రజాగళమై ఉద్యమానికి ఊపిరులూదిన, తెలంగాణ ఖ్యాతిని చాటిన 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని భవిష్యత్ తరాలు పాడుకునేలా, తెలంగాణ కవి, రచయిత అందెశ్రీ 20 ఏళ్ల క్రితం రాసిన గీతాన్ని యథాతథంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆమోదించింది. అలాగే రాష్ట్రానికి సంబంధించిన సంక్షిప్తరూపం టీఎస్‌ను టీజీగా మార్చారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్పునకు సంబంధించిన విషయాలను అసెంబ్లీలో చర్చించి అందరికీ ఆమోదయోగ్యంగా, తెలంగాణ ప్రతిష్ఠను ఇనుమడించేలా, భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేలా కార్యాచరణ అమలుకు కృషి చేస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండవ రోజు నుంచే హామీల అమలుకు శ్రీకారం చుట్టింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించి వారిలో ఆనందాన్ని నింపింది. వైద్య ఆరోగ్య చికిత్సల పరిమితిని రూ.10 లక్షలకు పెంచే హామీని అమలు చేసింది. మిగిలిన గ్యారంటీల అమలుకు ప్రజల నుంచి గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించింది. రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలు, 3,626 మున్సిపల్ వార్డులలో కలిపి 16,395 ప్రదేశాల్లో ప్రజా పాలన సదస్సులు నిర్వహించింది. వీటి ద్వారా ప్రజల నుంచి హామీల అమలుకు దరఖాస్తులు స్వీకరించింది. రూ.500లకే సిలిండర్ గ్యాస్ ఇచ్చే కార్యక్రమం, 200 యూనిట్లలోపు వినియోగిస్తున్న లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ కార్యక్రమాలను ప్రభుత్వం ప్రారంభించింది. అదేవిధంగా నియోజకవర్గానికి 3500 చొప్పున 119 నియోజకవర్గాలకు నాలుగున్నర లక్షల ఇళ్లను కేటాయించింది. ఈ కార్యక్రమం కింద సొంత ఇంటి స్థలం కలిగిన పేదలకు ఇంటికి రూ.5లక్షల చొప్పున ప్రభుత్వం ఇల్లు కట్టుకోవటానికి సహాయం చేస్తుంది. గత ప్రభుత్వం 2018 ఎన్నికల సమయంలో ఇళ్లు కట్టుకోవటానికి రూ.5లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి ఒక్కరికి కూడా ఇవ్వకుండా ప్రజలను మోసం చేసింది. దానికి భిన్నంగా 100రోజుల్లోపే పేదల గృహాలకు రూ.5లక్షలు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందంటే కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధి ఏమిటో ప్రతిపక్షాలు గ్రహించాలి. మహాలక్ష్మి స్వశక్తి కార్యక్రమంలో డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలను అందించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. అలాగే 30వేల ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగుల ఆశలను ఈ ప్రభుత్వం నిలబెట్టింది.

గత ప్రభుత్వం జయశంకర్ సార్ ఆశయాలను అంతగా పట్టించుకోలేదు. ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధి కల్పనను గాలికి వదిలేసింది. నిధులు దుర్వినియోగం చేసింది. అందువల్ల రాష్ట్రం అనుకున్న స్థాయిలో అభివృద్ధి చెందలేదు. జయశంకర్ సార్ ఆలోచనలను, ఆశయాలను అమలు చేస్తేనే తెలంగాణ అభివృద్ధి చెందుతుంది. అదే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి.

• **బోరెడ్డి అయోధ్యరెడ్డి**
తెలంగాణ ముఖ్యమంత్రి సీపీఆర్ఓ

(నేడు ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి)



గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.4 కనిష్ఠం 25.3



సమావేశంలో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

గతం కంటే ఘనంగా బోనాలు

- అధికారులకు మంత్రి పొన్నం ఆదేశాలు

హైదరాబాద్ సిటీ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా బోనాల ఉత్సవాలు నిర్వహించాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో గురువారం ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలపై ఆయన జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా జరుపుకుంటున్న బోనాల ఉత్సవాలను గతంలో కంటే ఘనంగా జరిగేలా చూడాలన్నారు. భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. జిల్లా పరిధిలోని 2,400 ఆలయాలకు ఇచ్చే చెక్కుల పంపిణీని త్వరగా పూర్తయ్యేలా చూడాలని, ఈసారి డబ్బులు పెంచే విధంగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని వెల్లడించారు. నగరంలోని 28 ముఖ్యమైన దేవాలయాలకు ప్రజాప్రతినిధులు పట్టువస్త్రాలు సమర్పిస్తారని, మహాలక్ష్మీ ద్వారా ఉచిత బస్సు సౌకర్యం ఉండడంతో గతంలో కంటే ఎక్కువ మంది భక్తులు బోనాలకు వచ్చే అవకాశం ఉందని అన్నారు. ప్రధాన దేవాలయాల్లో

మిగతా 8వ పేజీలో..

ఇదేం పోలీసింగ్?

పో కిరీలతో లీసుల దోస్తీ



ఫిర్యాదు చేసినవారి వివరాలు, నంబర్లు రౌడీలకు..

- డయల్ 100కు ఫోన్ చేయాలంటేనే భయపడుతున్న జనం
- కొత్త సమస్యలు సృష్టిస్తున్న కొందరు పోలీసులు

పోకిరీలు, రౌడీగ్యాంగ్‌లు, అల్లరిమూకలతో కొందరు పోలీసులు చీకట్లో దోస్తీ కడుతున్నారు. డయల్ 100కు ఎవరైనా బాధితులు ఫోన్ చేస్తే ఘటనా స్థలికి వెళ్తున్న పోలీసులు బాధితుల వివరాలను, నంబర్లను రౌడీమూకలకు ఇస్తున్నారు. 'మీరు న్యూసెన్స్ చేస్తున్నారని ఫలానా వారు కంప్లైంట్ చేశారు. అందుకే మేం రావాల్సి వచ్చింది. మీరు ఒకసారి వారితో మాట్లాడి, భయపడొద్దని చెప్తే మేం వెళ్లిపోతాం.' అని వారితో బేరసారాలకు దిగుతున్నారు. ఇలాంటి ఘటనలు ఇటీవల వెలుగుచూస్తుండడంతో డయల్ 100కు ఫోన్ చేయాలంటేనే కొందరు భయపడుతున్నారు.

హైదరాబాద్ సిటీ, జూన్ 20(ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్‌లోని ఓ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన కాలనీలో అల్లరిమూకలు రాత్రిపూట న్యూసెన్స్ చేస్తున్నారు. వారి వల్ల ఇబ్బందులు పడుతున్న ఓ వ్యక్తి డయల్-100కు ఫోన్ చేశారు. పెట్రోలింగ్ పోలీసులు 15 నిమిషాల్లో ఘటనాస్థలానికి చేరుకున్నారు. న్యూసెన్స్ చేస్తున్నవారిని అక్కడి నుంచి పంపించి సమస్యను పరిష్కరించాల్సింది పోయి.. 'మీ మీద ఫలానా వారు కంప్లైంట్ చేశారు. మీరు వారితో మాట్లాడండి. ఇబ్బంది కలగకుండా చూసుకుంటామని వినయంగా చెప్పండి. మరోసారి మాకు ఫోన్ చేయకుండా చూసుకోండి' అని చెప్పి వారితో ఫిర్యాదు చేసిన వ్యక్తితో ఫోన్ మాట్లాడించారు. వారు ఇచ్చిన మామూళ్లను తీసుకొని వెళ్లిపోయారు. తన వివరాలు అల్లరిమూకలకు తెలియడంతో తర్వాత వారు తనను ఏమైనా చేస్తారేమో అని డయల్ 100కు ఫోన్ చేసిన వ్యక్తి ఆందోళన చెందుతున్నాడు.



దొంగను అదుపులోకి తీసుకోకుండా..

సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఒక గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం అర్ధరాత్రి 1.30కు ఓ ఇంట్లోకి ప్రవేశించాడు. ఇంట్లో ఉన్నవారు అతడిని పట్టుకున్నారు. డయల్-100కు ఫోన్ చేశారు. కొద్దిసేపటికి అక్కడకు వచ్చిన పెట్రోలింగ్ పోలీసులు విషయం తెలుసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు. 'ఇదేంటి సార్.. ఈ దొంగను అదుపులోకి తీసుకోరా' అని బాధితులు అడిగితే సమాధానం చెప్పలేదు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించండని చెప్పి నిర్లక్ష్యంగా వెళ్లిపోయారు. దాంతో బాధితుడు అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి దొంగను అప్పగించాడు.

బాధితులకే ఇబ్బందులు

పోకిరీలు, రౌడీలు, అల్లరిమూకలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నా, న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్నా స్థానికులు డయల్-100కు ఫోన్ చేస్తారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు న్యూసెన్స్ చేస్తున్నవారిని అదుపులోకి తీసుకోవాలి. ప్రజలకు రక్షణ కల్పించాలి. కానీ కొందరు పోలీసులు పోకిరీలతో, రౌడీగ్యాంగ్‌లతో దోస్తీ కడుతున్నారు. వారు ఇచ్చిన మామూళ్లు తీసుకుని ఉల్టా బాధితులకే ఇబ్బందులు తలెత్తేలా వ్యవహరిస్తున్నారు. 'మిమ్మల్ని ఇబ్బంది పెట్టం. భయపడొద్దు' అని బాధితులకు రౌడీలతో ఫోన్ చేయిస్తున్నారు. పోలీసుల ముందు బాధితులతో ఫోన్‌లో అతివినయంగా మాట్లాడుతున్న రౌడీలు, కేడీలు.. ఆ తర్వాత తమను ఏమైనా చేస్తారేమో అని బాధితులు బెంబేలెత్తుతున్నారు. పోలీసులు ఉన్నది ప్రజల రక్షణ కోసమా, బాధితులను భయపెట్టడానికా..? అని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త సమస్యలను తెచ్చిపెడుతున్నారని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో డయల్-100కు ఫోన్ చేసి ప్రజలు స్థానిక సమస్యలు ఎలా చెబుతారని ప్రశ్నిస్తున్నారు.

సమస్యను పరిష్కరించకపోగా..

వెల్‌కమ్ టు పీపుల్ ఫ్రెండ్లీ పోలీస్. తెలంగాణ పోలీస్.. రాత్రనిలేదు.. పగలనిలేదు.. ఉంటాం మీకై కడ వరకు..' తెలంగాణ ప్రజలు ఎవరైనా పోలీస్‌శాఖకు చెందిన ఆపత్కాల నంబర్ డయల్-100కు ఫోన్ చేయగానే మొట్టమొదట వినిపించే వాయిస్ ఇది. ప్రజా రక్షణ.. శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా తెలంగాణ పోలీసులు పనిచేస్తున్నారని చెప్పడానికి ఉన్నతాధికారులు ఈ పాటను ప్రత్యేక డయల్ టోన్‌గా పెట్టారు. ఆపదలో ఉన్నా.. ప్రాణాపాయ స్థితిలో ఉన్నా.. ఆపత్కాలంలో డయల్-100 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే 5 నుంచి 7 నిమిషాల లోపు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, బాధితులకు రక్షణ కల్పించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఇది పక్కాగా అమల్లోకి వచ్చిన తర్వాత స్థానిక ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్ దగ్గరయింది. ఇలాంటి తరుణంలో కొంతమంది పోలీసులు డయల్-100కు ఫిర్యాదు చేస్తున్న బాధితులను అపహాస్యం చేస్తున్నారు. ప్రజల సమస్యను పరిష్కరించకపోగా, నేరస్థులతో కుమ్మక్కవుతున్నారు. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు పోకిరీలు, అల్లరిమూకలు, రౌడీ గ్యాంగ్‌లతో చేతులు కలిపి వారు ఇచ్చిన మామూళ్లు తీసుకొని వెళ్లిపోతున్నారు. అంతటితో ఆగకుండా ఉన్నతాధికారులకు సమాధానం చెప్పడం కోసం, బాధితులు సంతృప్తి చెందారని నిరూపించుకోవడం కోసం.. కంప్లైంట్ ఇచ్చిన బాధితులకు రౌడీమూకలతో ఫోన్ చేయించి సారీ చెప్పిస్తున్నారు. దానివల్ల ఎవరు కంప్లైంట్ ఇచ్చారు..? ఎవరు డయల్ 100కు ఫోన్ చేశారు..? అనే విషయాలు తెలుసుకున్న రౌడీగ్యాంగ్‌లు మరుసటి రోజు నుంచి వారిని శత్రువుల్లా చూస్తున్నారు. రౌడీమూకలతో లేని శత్రుత్వం తెచ్చుకున్నట్లు అవుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

విధుల్లో నిర్లక్ష్యం మారేడుపల్లి తహసీల్దార్ సస్పెన్షన్ 8 నెలకు 2.5 కోట్లు ఆదా ఫేస్ రికగ్నైజేషన్ హాజరుతో..

ఎస్‌బీఐ రివార్డు పాయింట్లంటూ..
హైదరాబాద్‌లో ప్రభుత్వ ఉద్యోగినికి టోకరా

- ఆమె ఖాతా నుంచి రూ. 2.30 లక్షలు మాయం
- పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని భయపెట్టి మరో వ్యక్తి నుంచి రూ. 15.36 లక్షల దోపిడీ
- సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించిన బాధితులు



హైదరాబాద్ సిటీ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ రివార్డు పాయింట్ల పేరుతో ఓ ప్రభుత్వ ఉద్యోగినిని, పార్శిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని భయపెట్టి మరో వ్యక్తిని సైబర్ కేటుగాళ్లు మోసం చేశారు. పార్శిల్ బాధితుడి ఖాతా నుంచి రూ. 15.36 లక్షలు, ప్రభుత్వ ఉద్యోగిని ఖాతా నుంచి రూ.2.30 లక్షలు దోచేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగిని (60) ఫోన్‌కు ఎస్‌బీఐ పేరుతో ఓ సందేశం వచ్చింది. ఎస్‌బీఐ యోనో రివార్డు పాయింట్లు వచ్చాయని, ఈ రోజే క్లెయిమ్ చేసుకోమని అందులో ఉంది. ఆమెకు ఎస్‌బీఐలో ఎంతోకాలంగా ఖాతా ఉండటం, జీతం ఖాతా కూడా అదే బ్యాంకులో ఉండటంతో ఆ సందేశాన్ని నమ్మి ఆమె లింక్ ఓపెన్ చేశారు. అందులో ఉన్న సూచనల మేరకు తన ఖాతా వివరాలు, ఇతర వివరాలు నమోదు చేశారు. కొంత సేపటికి ఆమె ఖాతా నుంచి రూ. 2.43 లక్షలు వేరే ఖాతాలకు బదిలీ అయినట్లు సందేశాలు వచ్చాయి. దాంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో ఉదంతంలో మీ పేరున వచ్చిన పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయని, మీపై కేసు నమోదైందని బెదిరించిన సైబర్ నేరగాళ్లు హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఖాతా నుంచి రూ. 15.36 లక్షలు కాజేశారు. హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న ఓ యువకుడికి డీహెచ్ఎల్ పేరుతో

మిగతా 8వ పేజీలో..

'రివార్డ్'లతో వల..
కూపన్లతో ఖాతాలు ఖల్లాస్

ఎస్‌బీఐ రివార్డులు, మీషో కూపన్లతో సైబర్ నేరగాళ్లు వల విసురుతున్నారు. వలలో పడ్డవారి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. ఓటీపీ, ఓఎల్ఎక్స్ మోసాలపై అవగాహన పెరడగంతో సైబర్ నేరగాళ్లు కొత్త తరహాలో ముందుకు వెళ్తున్నారు. ప్రముఖ బ్యాంకులు, సంస్థలు, ఈ కామర్స్ సైట్ల పేర్లను ఇందుకోసం వాడుతున్నారు. సిమ్‌లను సేకరించి, వాటికి ప్రముఖ సంస్థల, బ్యాంకుల లోగోలు, పేర్లు తగిలిస్తున్నారు. రివార్డులు, ఆఫర్ల కూపన్‌ల పేరుతో లింక్‌లను పంపుతున్నారు. లింక్ ఓపెన్ చేసిన వారి ఫోన్‌ను హ్యాక్ చేయడంతోపాటు సమాచారాన్ని కూడా తస్కరిస్తున్నారు. ఖాతాలోని డబ్బు కాజేయడంతోపాటు, సమాచారం, వీడియోలు, ఫొటోలు సేకరించి వేధింపులకు పాల్పడుతున్నారు. దసరా, దీపావళి వంటి పండగలు, స్వాతంత్ర దినోత్సవం, రిపబ్లిక్ డేలాంటి సమయాల్లో ఈ తరహా సందేశాలను సైబర్ నేరగాళ్లు ఎక్కువగా పంపుతారు. వాటిని వెంటనే డిలీట్ చేయాలని సైబర్‌క్రైం అధికారులు, సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

దశలవారీగా ఎమర్జెన్సీ పంపింగ్

- ఎల్లంపల్లిలో పనులను పరిశీలించిన బోర్డు ఎండీ

హైదరాబాద్ సిటీ, జూన్20 (ఆంధ్రజ్యోతి): ఎల్లంపల్లి జలాశయంలో నీటిలభ్యత ఆధారంగా మిగిలిన పంపులను కూడా దశల వారీగా ప్రారంభిస్తామని వాటర్‌బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. మొత్తం 20 పంపులు ఏర్పాటు చేసి వాటిలో ప్రస్తుతం ఏడు పంపుల ద్వారా నీరు ఎత్తిపోస్తున్నట్లు తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో ముర్మూర్ వద్ద ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ పంపింగ్ పనులను అధికారులతో కలిసి ఎండీ సుదర్శన్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ వర్షపాతం తక్కువ నమోదు కావడంతో ఎగువనున్న కడెం ప్రాజెక్టు నుంచి వరద లేదని, దీంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి మట్టం క్రమంగా తగ్గడం ప్రారంభమైందని తెలిపారు. ఇబ్బందులు రాకముందే.. ముందు జాగ్రత్త చర్యగా ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నామని వివరించారు. పంపింగ్ పనులు పరిశీలించిన తర్వాత ఎండీ సుదర్శన్‌రెడ్డి ముర్మూర్‌లోని గోదావరి డ్రింకింగ్‌వాటర్ ప్రాజెక్టు పంప్‌హౌజ్‌ను సందర్శించి, స్కాడా రూం రికార్డులను పరిశీలించారు. ఆ తర్వాత మల్లారంలోని నీటిశుద్ధి కేంద్రాన్ని సందర్శించారు. వర్షాకాలంలో కొత్తనీరు చేరే అవకాశం ఉన్నందున, గంటకు ఒకసారి శాంపిల్ తీసి టెస్ట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీజీఎం దశరథ్ రెడ్డి, జీఎం బ్రిజేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా శ్రీగణేశ్ ప్రమాణ స్వీకారం

కంటోన్మెంట్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ నుంచి గెలిచిన శ్రీ గణేశ్ గురువారం స్పీకర్ చాంబర్‌లో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీలో రాజకీయ జోక్యం!



- చర్చనీయాంశంగా జగన్ నివాసం వద్ద ఆక్రమణల కూల్చివేత
- జోనల్ కమిషనర్‌పై బదిలీ వేటు
- కాంట్రాక్టుల పొడిగింపునకు ప్రజాప్రతినిధుల సిఫారసులు
- ప్రత్యర్థుల అక్రమ నిర్మాణాల కూల్చివేతకు ఒత్తిడి

జీహెచ్ఎంసీలో రాజకీయ జోక్యం పెరుగుతోంది. కొందరు మంత్రులు, పలువురు నగర ప్రజాప్రతినిధులు వివిధ పనుల నిమిత్తం అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. గ్రేటర్ పాలక మండలి సభ్యులూ తామేం తక్కువ కాదన్నట్టు వ్యవహరిస్తున్నారు. చెప్పింది చేయాల్సిందే అని అధికారులపై పలువురు జబర్దస్తీ చేస్తున్నారు. దీంతో బల్దియాలోని కొందరు అధికారులు ఇబ్బంది పడుతుండగా.. ఇదే అదనుగా ఇంకొందరు స్వామి కార్యం స్వకార్యం పూర్తి చేసుకుంటున్నారు.

బదిలీలు, కూల్చివేతలకు అధికారులపై ఒత్తిళ్లు

హైదరాబాద్ సిటీ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): నగర పాలనలో ప్రజాప్రతినిధుల మితిమీరిన జోక్యం చర్చనీయాంశంగా మారింది. వారి సిఫారసులు ఒక్కోసారి అధికారులకూ ఇబ్బందికరంగా మారుతున్నాయి. ముఖ్యంగా సంస్థలోని పట్టణ ప్రణాళికా, ఇంజనీరింగ్, పారిశుధ్య నిర్వహణ, ఆస్తుల సేకరణ విభాగాల్లో సిఫారసులు ఎక్కువగా ఉన్నాయి. లోటస్‌పాండ్‌లోని మాజీ సీఎం జగన్ నివాసం వద్ద ఫుట్‌పాత్‌పై అక్రమ నిర్మాణాల కూల్చివేత వివాదాస్పదంగా మారింది. ఓ మంత్రి ఆదేశాల మేరకు కూల్చివేతలు జరిగాయని ప్రచారం జరగగా, దీనిని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించడంతో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడేపై బదిలీ వేటు పడింది.

బదిలీలకు ఒత్తిళ్లు

- జీహెచ్ఎంసీ తూర్పు జోన్‌కు చెందిన ఓ ఎమ్మెల్యే పట్టణ ప్రణాళికా విభాగం అధికారుల బదిలీకి ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ప్రత్యర్థి పార్టీలకు చెందిన, వారికి అనుకూలంగా ఉన్న వారి అక్రమ నిర్మాణాలు/ఉల్లంఘనలపై చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.
- సెంట్రల్ సిటీకి చెందిన ఓ ఎమ్మెల్యే పాత కమ్యూనిటీ హాల్ స్థానంలో సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా ప్రైవేట్ వ్యక్తితో భవన నిర్మాణం చేపడుతున్నాడు. వాస్తవంగా సీఎస్ఆర్‌లో డబ్బులు ఇచ్చేందుకు ఎవరైనా ముందుకు వస్తే.. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పనులు చేపట్టాలి. కానీ ఇక్కడ అందుకు భిన్నంగా పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వస్థలంలో ప్రైవేట్ వ్యక్తులు పనులు చేయవద్దన్నందుకు.. అక్కడి ఏసీపీని బదిలీ చేయాలని ఉన్నతాధికారులకు పలుమార్లు సదరు ఎమ్మెల్యే ఫోన్ చేసినట్టు తెలిసింది. తాను సిఫారసు చేసినా.. అధికారులను బదిలీ చేయకుండా జాప్యం చేయడంపైనా ఆయన అసహనం వ్యక్తం చేసినట్టు సమాచారం.
- పాతబస్తీకి చెందిన ఓ ఎమ్మెల్యే ఇంజనీరింగ్ అధికారుల బదిలీ కోసం కొంత కాలంగా కేంద్ర కార్యాలయంలోని ఉన్నతాధికారులను కలుస్తున్నారు. పనులకు సంబంధించి ప్రతిపాదనల రూపకల్పనలో చెప్పినట్టు వినకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.
- సెంట్రల్ సిటీకి చెందిన మరో

మిగతా 8వ పేజీలో..

మరో మంత్రి.. పాలకమండలి సభ్యులు..

పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ కాంట్రాక్టు పొడిగింపునకు మరో మంత్రి అధికారులకు సిఫారసు చేశారని సమాచారం. జీహెచ్ఎంసీ పాలకమండలిలోని కీలక వ్యక్తులూ ఈ విషయంలో జోక్యం చేసుకున్నట్టు చెబుతున్నారు. మరుగుదొడ్ల వసతి కల్పనకు నామమాత్రపు అద్దెతో ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన లూ కెఫేలు పక్కా వ్యాపార కేంద్రాలుగా మారాయి. టాయిలెట్లను మూసి ఉంచుతోన్న నిర్వాహకులు స్నాక్స్, టీ, కాఫీ, ఇతర తినుబండారాలు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. పలు ప్రాంతాల్లో ఈ కెఫేల జోలికి వెళ్లకుండా అధికారులపై ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఫుట్‌పాత్ ఆధునీకీకరణలో భాగంగా ఓ ఏరియాలో ఆక్రమణలు అన్నీ తొలగించగా.. లూ- కెఫేలు మాత్రం అలానే ఉన్నాయి.

ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

అల్ఫా హోటల్‌పై కేసు

రెజిమెంటల్‌బజార్,జూన్ 20 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ రోడ్డులోని హోటళ్లలో ఆహార భద్రత టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అల్ఫా హోటల్‌లో పదార్థాలు నిల్వ ఉంచడంలో నిబంధనలు పాటించడం లేదని గుర్తించారు. బ్రెడ్, ఐస్‌క్రీమ్, టీపొడి ప్యాకెట్లపై తయారు తేదీ, బ్యాచ్ నంబర్ లేకుండా విక్రయిస్తున్నట్లు గుర్తించి నోటీసులు ఇచ్చారు. తనిఖీ అధికారులకు సహకరించని కారణంగా హోటల్

మిగతా8వ పేజీలో..

ఐఎన్ఐఎస్ఎస్ పరీక్షలో.. సత్తాచాటిన కండక్టర్ కూతురు

● జాతీయ స్థాయిలో రెండో ర్యాంక్ సాధించిన మౌనిక



షాద్‌నగర్ అర్బన్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఉన్నత ఆశయం ఉంటే ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని నిరూపించారు పల్లాటి మౌనిక. ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) నిర్వహించిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్ సూపర్ స్పెషాలిటీ(ఐఎన్ఐఎస్ఎస్) అర్హత పరీక్షలో సత్తాచాటారు. ఆలిండియా స్థాయిలో రెండో ర్యాంక్ సాధించి, అంకాలజీ స్పెషలిస్టు కాబోతున్న ఆమె.. టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అభినందనలు అందుకున్నారు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన పల్లాటి మహాలింగం షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో కండక్టర్. షాద్‌నగర్‌లోనే నివాసముంటూ ముగ్గురు కూతుళ్లను చదివిస్తున్నారు. పెద్దకూతురు మౌనిక ఢిల్లీలోని ఎయిమ్స్‌లో గత డిసెంబర్‌లో జనరల్ మెడిసిన్ పూర్తిచేసి, అదే ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. వారం క్రితమే ఐఎన్ఐఎస్ఎస్ అర్హత పరీక్ష ఫలితాలు రాగా.. రెండో ర్యాంక్ సాధించారు. మౌనిక ప్రతిభను గుర్తించిన సజ్జనార్ గురువారం ట్విట్టర్‌లో ఆమెను అభినందిస్తూ పోస్టుచేశారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్

గోల్కొండ చోటా బజార్‌లో ఎమ్మెల్యే పర్యటన

కార్వాన్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ చోటా బజార్ ప్రాంతంలో ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ గురువారం పర్యటించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీవరేజీ పైపులైన్ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు, కార్పొరేటర్లు, మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలి : ఏబీవీపీ

చార్మినార్ జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఏబీవీపీ కోఠి జిల్లా కన్వీనర్ ఎస్. కల్యాణ్ నాయక్ అన్నారు. గురువారం సిటీ కాలేజీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని, నిబంధనలు పాటించని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని, విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు సజన్, నగర కార్యదర్శి రాహుల్, రేఖ, భవ్యశ్రీ పాల్గొన్నారు.

'లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలి'

నార్సింగ్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): డబ్ల్యూడీసీ, ఎంజీఐటీ, వై కనెక్ట్, బ్రాండ్ టచ్, అనలిటిక్స్ విభాగం సహకారంతో పరిశుభ్రత, వ్యక్తిగత వికాసం పేరుతో గురువారం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న లైఫ్ స్కిల్స్ కోచ్ జేసీఐ గీతారాణి కల్లెం మాట్లాడుతూ.. విద్యార్థినులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగుతూ, సమాజంలో తమకంటూ బ్రాండ్ ఇమేజ్‌ని సృష్టించుకోవాలన్నారు.



సాలార్‌జంగ్ మ్యూజియంలో ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న నాగేశ్వర్‌రావు

యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలి

చార్మినార్ జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం కోసం యోగాను దినచర్యలో భాగం తీసుకోవాలని సాలర్‌జంగ్ మ్యూజియం అకౌంట్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు అన్నారు. యోగాడే సందర్భంగా గురువారం మ్యూజియంలో ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభించారు. నిత్యం యోగా చేస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మ్యూజియం అధికారుల ఘనశ్యామ్ కుసుమ్, ఆర్‌బీ నాయక్, బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరసత్ అలీ బక్రీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సయ్యద్ హజ్రత్ అలీ ఉర్సు ఉత్సవాలు

అఫ్జల్‌గంజ్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఫీల్‌ఖానాలో సయ్యద్ హజ్రత్ అలీ ఉర్సు ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్‌ఎస్ గోషామహల్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆశీష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీజీయూఈఈయూ కార్యవర్గం

అఫ్జల్‌గంజ్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) జనరల్ బాడీ సమావేశం బేగంబజార్ డివిజన్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా కె. మహేందర్‌కుమార్, కార్యదర్శిగా ఎంవీ కృష్ణారెడ్డిని, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టీజీయూఈఈయూ-సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.గోవర్ధన్ మాట్లాడుతూ.. ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన కార్మికులకు ప్రమోషన్ ఇవ్వాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్ ఉన్న డీఏ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రీజనల్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, సీఐటీయూ సౌత్ జోన్ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ఎం.మనీలాల్ నాయక్, ఇ.రాజయ్య, బి.కనకయ్య, ఎ.లక్ష్మీనారాయణ, పి.శ్రీనివాస్, ఎం.రాము తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు

గంటలోపే తల్లిదండ్రులకు అప్పగింత

రాజేంద్రనగర్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదు చేసిన గంటలోపే తప్పిపోయిన బాలుడిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. అత్తాపూర్ పాండురంగానగర్‌కు చెందిన అరుణేశ్ శర్మ(10) చెల్లెలితో కలిసి గురువారం స్కూల్‌కు బయలుదేరాడు. మార్గమధ్యంలో ఇద్దరూ కొట్టుకున్నారు. కొట్టావని అమ్మకు చెబుతానని చెల్లెలు అనడంతో అరుణేశ్ పాఠశాలకు వెళ్లకుండా స్థానికంగాగల దేవాలయంలో దాక్కున్నాడు. అన్నయ్య స్కూల్‌కు రాలేదని అతడి చెల్లెలు తల్లిదండ్రులకు చెప్పింది. బాలుడి ఆచూకీ లభించకపోవడంతో అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గంటలోపే దేవాలయంలో ఆడుకుంటున్న ఆలుడిని తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీస్

ఆలయ భూములను అక్రమించిన వారికి నోటీసులు

నార్సింగ్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): గండిపేట మండలం నెక్నాంపూర్ గ్రామంలో శ్రీగణేష్ దేవాలయ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నించిన కొంతమందికి దేవాదాయ శాఖ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. ఈఓ అరుణకుమారి ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ అధికారుల బృందం భూమి హద్దులు చూసుకుని, కొలతలు తీసుకొని దేవాదాయ భూమి ఆక్రమణకు గురైందని గుర్తించారు. పదిమందికి పైగా నోటీసులు ఇచ్చామని, త్వరలో శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని తెలిపారు.

విద్యార్థుల బస్ రూట్లలో ఆర్టీసీ స్పెషల్ డ్రైవ్

- రద్దీ సమయంలో అధికారుల తనిఖీలు

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పెద్ద సంఖ్యలో ప్రయాణాలు చేసే బస్ రూట్లలో ఆర్టీసీ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. విద్యాసంస్థల ప్రారంభం నేపథ్యంలో పీక్ సమయాల్లో ఉదయం, సాయంత్రం మహిళా ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో ఫుట్‌బోర్డు ప్రయాణాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు బస్సు రన్నింగ్‌లో ఉన్నప్పుడు ఎవరూ ఎక్కకుండా చర్యలు చేపడుతున్నారు. బోయిన్‌పల్లి-బాలానగర్- గండి మైసమ్మ, సికింద్రాబాద్-ఉప్పల్ - ఘట్‌కేసర్ రూట్లలో ఆర్టీసీ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. బస్సుల్లో రోజువారీ ప్రయాణాలు సాగించే విద్యార్థులు అధికారుల సూచనలు పాటించడంతో పాటు జాగ్రత్తగా ప్రయాణించాలని సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ ఖుస్రో షా ఖాన్ తెలిపారు.

చింతలపల్లి నిర్మలాదేవి-నారాయణరావు పురస్కారానికి

బలరాం వందశాతం అర్హులు

అఫ్జల్‌గంజ్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): చింతలపల్లి నిర్మలాదేవి-నారాయణరావు జీవిత సాఫల్య పురస్కారానికి ప్రముఖ సాహితీవేత్త నాగవరం బలరాం వందశాతం అర్హులని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో ప్రముఖ సాహితీవేత్త నాగవరం బలరాంకు చింతలపల్లి నిర్మలాదేవి-నారాయణ జీవన సాఫల్య పురస్కారం-2024 ప్రదానోత్సవం, మన కల నిజం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లలో వివిధ పత్రికలకు రాసిన నా వ్యాసాలను 'మన కలం నిజం' పేరుతో పుస్తకంగా తీసుకొచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. తనను సాహిత్యం వైపు నడిపించిన వారిలో బలరాం ఒకరన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, తెలంగాణ రిసోర్స్ సెంటర్ వ్యవస్థాపకులు, చైర్మన్ మణికొండ వేదకుమార్, సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి జుర్రు చెన్నయ్య, కాళోజీ అవార్డు గ్రహీత కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి, చింతలపల్లి భాస్కర్‌రావు, ప్రొఫెసర్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.


మన కల నిజం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి తదితరులు

తలసాని శంకర్‌యాదవ్‌కు ప్రముఖుల నివాళి


శంకర్‌యాదవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేటీఆర్, హరీశ్‌రావు, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు


శంకర్‌యాదవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు

రెజిమెంటల్‌బజార్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు, మోండా మార్కెట్ అధ్యక్షుడు శంకర్‌యాదవ్ దశదిన కర్మకు పలువురు ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. గురువారం సికింద్రాబాద్ ఎస్‌వీఐటీ ఆడిటోరియంలో శంకర్‌యాదవ్ దశదిన కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, లక్ష్మణ్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, జోగు రామన్న, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, కాలేరు వెంకటేష్, సుధీర్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్, మాగంటి గోపీనాథ్, బండారి లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్‌రావు, బల్మూరి వెంకట్, సురభివాణిదేవి, మధుసూదనాచారి, ఎగ్గె మల్లేశం, బండ ప్రకాశ్‌ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హన్మంతరావు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్‌లు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు బోయిన్‌పల్లి, మోండా మార్కెట్‌లకు చెందిన వర్తకులు, హమాలీ కార్మికులు హాజరై శంకర్ యాదవ్ చిత్రపటంవద్ద నివాళులర్పించారు.

అవగాహన లేక పింఛన్‌కు దూరం

- 19 ఏళ్ల తర్వాత మంజూరైన సైనిక్ పెన్షన్

అల్వాల్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తూ చనిపోతే అందుకునే కుటుంబ పెన్షన్ ఏకంగా పందొమ్మిదేళ్లకు మంజూరైన ఉదంతమిది. సరైన అవగాహన లేని బాధితురాలి పక్షాన ఓ సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ నిలబడి కుటుంబ పెన్షన్ కోసం పట్టుదలతో పోరాడి ఎట్టకేలకు ఆమెకు విజయం చేకూర్చారు. 2005 నుంచి పోరాడగా ఈ ఏడాది జూన్‌లో బాధితురాలు పెన్షన్‌ను అందుకుంది. వివరాలిలా ఉన్నాయి.

నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం, కమలాపూర్ గ్రామానికి చెందిన గన్నర్ రమణారెడ్డి 1991లో ఆర్మీ నుంచి పదవీ విరమణ చేశారు. అనంతరం సెంట్రల్ ఎక్సైజ్ విభాగంలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం పొంది 2005లో అనారోగ్యంతో మరణించారు. ఆయన భార్య లావణ్య రమణారెడ్డి అనారోగ్యం బారిన పడటం, సరైన అవగాహన లేకపోవడం, ఇతర సమస్యల కారణంగా కుటుంబ పెన్షన్‌కు సంబంధించిన ఫార్మాలిటీలను సకాలంలో పూర్తి చేయలేకపోయింది. దాంతో కుటుంబ పెన్షన్ మంజూరు కాలేదు. ఈ క్రమంలో కారుణ్య నియామకం ప్రాతిపదికన సెంట్రల్ ఎక్సైజ్ జీఎస్‌టీ విభాగంలో ఆమెకు ఉద్యోగం వచ్చింది.

ఆమె కుటుంబ పెన్షన్ పొందడం లేదని తెలుసుకున్న సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కల్నల్ రమేశ్ కుమార్ బాధితురాలి పక్షాన నిలబడి నిరంతరం ఫాలోఅప్ చేశారు. దీంతో 2021లో కుటుంబ పెన్షన్ మంజూరయింది. లావణ్య పొరపాటున తన సేవింగ్స్ అకౌంట్‌ను అప్పటికే మూసివేశారు. దీంతో బ్యాంక్‌లో పెన్షన్ జమకాలేదు. దీంతో కల్నల్ మరోసారి ఫాలో అప్ చేసి అదే బ్యాంక్‌లో మరోఖాతాను తెరిపించారు. ఆ ఖాతాలో పెన్షన్ జమ అయ్యేలా 2023లో అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో ఆమె కష్టాలు తీరాయని అందరూ భావించారు. ఈ క్రమంలో సదరు బ్యాంక్ సెంట్రల్ పెన్షన్ ప్రాసెసింగ్ సెంటర్‌ను మార్చడంతో ఆమె పత్రాలు గల్లంతయ్యాయి. సైనిక సంక్షేమశాఖ అధికారులు సుదీర్ఘ పోరాటం చేసిన తర్వాత ఈ ఏడాది జూన్‌లో ఆమె కుటుంబ పెన్షన్‌ను అందుకున్నారు. పెన్షన్ రూ. 12వేలతోపాటు బకాయిలు రూ. 19 లక్షలు ఆమె ఖాతాలో జమ అయ్యాయి.

ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ.. కల్నల్ రమేష్‌కుమార్ ప్రత్యేక చొరవ కారణంగానే తనకు పెన్షన్ వచ్చిందని కృతజ్ఞతలు తెలిపారు. 19 ఏళ్ల పోరాటం తరువాత కుటుంబ పింఛన్ పొందుతున్నానంటే నమ్మలేకపోతున్నానని ఆమె అన్నారు. కల్నల్ రమేష్ కుమార్ మాట్లాడుతూ.. పెన్షన్‌దారులకు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన లేకపోవడం వల్ల తరుచూ ఇలాంటి పరిస్థితులు పలువురికి ఎదురవుతుంటాయన్నారు. ధైర్యంగా పోరాడి వాటిని పరిష్కరించుకోవాలన్నారు.


గన్నర్ రమణారెడ్డి భార్య లావణ్య (ఫైల్)

మత్తులో ఉన్న ఇద్దరు యువకుల అరెస్ట్

- సిరంజిలు, మత్తు పదార్థాలు స్వాధీనం

బంజారాహిల్స్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): మత్తుకు అలవాటు పడ్డారు.. ఉన్న ఊర్లో పనిచేస్తే వచ్చే డబ్బు సరిపోక నగరానికి వలసొచ్చారు. ఉద్యోగం చేజారిపోయింది. దీంతో ఇద్దరూ నాలుగు రోజులుగా కేబీఆర్ పార్క్ వాక్ వేలో బండ రాయి కింద తలదాచుకుని మత్తు తీసుకుంటూ ఇంటర్‌సెప్టర్ పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి మత్తు పదార్థాలు, సిరంజీలను స్వాధీనం చేసుకున్నారు. త్రిపురకు చెందిన బుబాక్‌సింగ్(23), మణిపూర్‌కు చెందిన వికాస్(25) మత్తుకు బానిసయ్యారు. ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టేకడానికి నగరానికి వలస వచ్చి ఫిలింనగర్‌లో ఓ కంపెనీలో సెక్యూరిటీ గార్డ్‌లుగా చేరారు. వారు మత్తుకు అలవాటు పడడంతో యాజమాన్యం వారం క్రితం తొలగించింది. దీంతో ఇద్దరూ జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45 వైపు పార్క్ బండ కింద నాలుగు రోజులుగా తలదాచుకున్నారు. అన్నపానీయాలు లేకుండా అక్కడే పడుకుంటున్నారు. గురువారం సాయంత్రం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ శ్రీనాథ్, దినేష్ వీరిని గమనించారు. మత్తులో నడవడానికి వీలు లేకుండా ఉన్నారు. అక్కడ వెతకగా కొని ఇంజెక్షన్లు, సిరంజిలు, తెల్లటి పొడి, కొన్ని మత్తు మాత్రలు కనిపించాయి. చేతులపై ఇంజెక్షన్‌లు తీసుకున్నట్టు ఆనవాళ్లున్నాయి. ఇద్దరినీ బంజారాహిల్స్ శాంతి భద్రతల పోలీసులకు అప్పగించారు. మత్తు కలిగించే మాత్రలను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసినట్టు తేలింది. ఓ వ్యక్తి రోజూ వచ్చి సిరంజి, కొన్ని కవర్‌లు ఇచ్చేవాడని తెలిసింది. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైన్‌షాపుల పర్మిట్ రూముల్లో

తనిఖీలు నిర్వహించాలి

- బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్

బర్కత్‌పుర, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తున్న వైన్‌షాపుల పర్మిట్ రూముల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించాలని రాష్ట్ర బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హోటళ్లు, బార్లు, పబ్‌లలో నాణ్యమైన ఆహారాన్ని సప్లయ్ చేస్తున్నామన్నారు. వైన్‌షాపుల పర్మిట్ రూమ్‌ల్లో అపరిశుభ్రత నెలకొంటుందని, కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తుండడం వల్ల రోగాలబారిన పడుతున్నారని ఆరోపించారు.

పర్మిట్ రూమ్‌ల్లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు రమ్యకృష్ణ, రాజుగౌడ్, నర్సింహగౌడ్, వెంకన్నగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శులు పల్లె నర్సింహారావు, తిరుపతియ్యగౌడ్, మోహన్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు నులిపురుగుల మాత్రలు వేయించాలి

అఫ్జల్‌గంజ్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలకు నులిపురుగుల మాత్రలను వేయించాలని జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ అన్నారు. నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నాంపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పిల్లలకు నులిపురుగుల మాత్రలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమైరా, శ్రీనివాస్ యాదవ్, అమర్ సింగ్, రామకృష్ణ, రేణు తదితరులు పాల్గొన్నారు.

దారుల్‌షిఫాలో..

చార్మినార్ జూన్ 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని బీఆర్‌ఎస్ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి సలావుద్దీన్ లోధి, డాక్టర్ తబస్సుమ్ నౌషీన్ సూచించారు. గురువారం దారుల్‌షిఫాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల మందు పంపిణీ చేశారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లను అందజేస్తున్నారన్నారు. గురువారం నుంచి 27వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మసుదుద్దీన్ అహ్మద్, వహీద్, సాబెర్ పాషా, జహీరుద్దీన్, మల్లమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.




నాంపల్లి, దారుల్‌షిఫా, మైలార్‌దేవుపల్లిలో విద్యార్థులకు నులిపురుగుల మందు వేస్తున్న కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్, బీఆర్‌ఎస్ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి సలావుద్దీన్ లోధి, బీజేపీ నాయకుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/R5IEVIO లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

నాటక కళాకారుల సమస్యలను పరిష్కరించాలి


మంత్రి జూపల్లి కృష్ణారావును సన్మానిస్తున్న రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య కమిటీ సభ్యులు

రవీంద్రభారతి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): నాటక కళాకారుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య కమిటీ సభ్యులు మంత్రి జూపల్లి కృష్ణారావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రిని సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు రాంచందర్‌రావు, అధ్యక్షుడు ఆకుల సదానందం, ప్రధాన కార్యదర్శి సాధు శ్యాంప్రసాద్ తదితరులు సత్కరించారు. అనంతరం సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్, సూర్యవర్ధన్‌రెడ్డి, సోమా అంజిరెడ్డి, రామాచారి, సుదర్శన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏనుగు నర్సింహారెడ్డి తదితరులు

ఆచార్య అనుమాండ్ల భూమయ్య

'సాహిత్యావలోకనం' ఆవిష్కరణ

రవీంద్రభారతి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): సాహిత్యరంగంలో ఆచార్య అనుమాండ్ల భూమయ్య పాత్ర గొప్పదని ప్రముక సాహితీవేత్త డా. ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. గురువారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ధూళిపాళ అరుణ రచించిన ఆచార్య అనుమాండ్ల భూమయ్య సాహిత్యావలోకనం పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నర్సింహారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించి అనుమాండ్ల భూమయ్యకు తొలి ప్రతిని అందజేసి సత్కరించారు. అనుమాండ్ల భూమయ్యపై పుస్తకం రాసి ఆయనకే అంకితమివ్వడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఆచార్య సాగి కమలాకర శర్మ, కసిరెడ్డి వెంకటరెడ్డి, నెల్లుట్ల రమాదేవి, మద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు

రాజేంద్రనగర్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): లక్ష్యే లక్ష్యం కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ రాజేంద్రనగర్ డిపోలో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలకు మేలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. కేటగిరి-1లో ప్రథమ బహుమతి పట్నంశెట్టి సాయికళ్యాణ్, ద్వితీయ బహుమతి కె భానుతేజ, తృతీయ బహుమతి మాధ్యా సాధించారు. కేటగిరి-2లో ప్రథమబహుమతి రాథోడ్ పవన్‌కుమార్, ద్వితీయ బహుమతి డి. పావని, తృతీయ బహుమతి వి. రక్షిత గెలుచుకున్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సన్మానం


టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన మారం జగదీశ్, డాక్టర్ ఎస్ఎం హుస్సేనీ ముజీబ్‌ను ఉద్యాన విశ్వవిద్యాలయం బోధనేతర సిబ్బంది సంఘం రాష్ట్ర అద్యక్షుడు పోతురాజు యాదయ్య ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.
- రాజేంద్రనగర్, ఆంధ్రజ్యోతి

పెళ్లి చేసుకుంటానని మోసం

- యువకుడిపై కేసు

బర్కత్‌పుర, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫలక్‌నుమాకు చెందిన ఓ యువతి చిక్కడపల్లిలో హాస్టల్‌లో ఉంటోంది. లక్డీకాపూల్‌లో ఉంటున్న విశాల్(27) ప్రైవేట్ ఉద్యోగి. వీరిద్దరూ కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. విశాల్ పెళ్లి చేసుకుంటానని మోసం చేసి మరొక యువతిని పెళ్లి చేసుకున్నాడని, తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలు కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


'ఒప్పో ఎఫ్27 ప్రో ప్లస్ 5జీ' ఫోన్‌ను చూపుతున్న నటి అషురెడ్డి

మూసాపేట్‌లో నటి అషురెడ్డి సందడి

కూకట్‌పల్లి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): మూసాపేట్‌లో నటి అషురెడ్డి గురువారం సందడి చేశారు. స్థానిక సంగీత మొబైల్ షోరూంలో 'ఒప్పో ఎఫ్27 ప్రో ప్లస్ 5జీ' ఫోన్‌ను అషురెడ్డి ఆవిష్కరించారు. సంగీత మొబైల్స్ సేల్స్ తెలంగాణ స్టేట్ హెడ్ శ్రీధర్ పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించాలి



రాష్ట్రంలోని 11 యూనివర్సిటీలలో గత 25 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సర్వీసును క్రమబద్ధీకరించాలని యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్(సీ) తెలంగాణ శాఖ కోరింది. ఈ మేరకు గురువారం ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించినట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఏ.పరశురామ్, కోశాధికారి బాలకోటి తదితరులు తెలిపారు.

- బర్కత్‌పుర, జూన్ 20 (ఆంధ్రజ్యోతి)

నెలకు రూ.2.5 కోట్లు ఆదా..!

- ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌తో తగ్గిన వేతనాల చెల్లింపు
- పదేళ్లలో రూ.200 కోట్లకుపైగా కాజేసిన వైనం
- ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'
- బాధ్యులపై చర్యలుంటాయా.?

హైదరాబాద్ సిటీ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య, ఎంటమాలజీ, వెటర్నరీ కార్మికుల హాజరుకు ఫేస్ రికగ్నైజేషన్ యాప్ వినియోగంతో వేతనాల చెల్లింపులో రూ.2.5 కోట్లు ఆదా అవుతున్నదని జీహెచ్ఎంసీ అధికారికంగా ప్రకటించింది. దీంతో గతంలో బోగస్ కార్మికులకు వేతనాల చెల్లింపు జరిగిందని అంగీకరించినట్టయింది. అంతకుముందు ఆధార్ బయోమెట్రిక్ అమలు సమయంలో నెలకు రూ.33.5 కోట్లు వేతనాల చెల్లింపు జరిగేదని.. గత రెండు నెలలుగా రూ.31 కోట్లు చెల్లిస్తున్నట్టు ఐటీ విభాగం అదనపు కమిషనర్ స్నేహ శబరీష్ తెలిపారు. కొత్త హాజరు విధానంతో రెండు నెలలుగా నెలకు రూ.2.5 కోట్లు ఆదా అవుతున్నది. 'లేని కార్మికులకు రూ.200 కోట్ల వేతనాలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 13న కథనం ప్రచురితమైంది. ఇదే విషయాన్ని అధికారులూ నిర్ధారించారు. పదేళ్లకుపైగా ఆధార్ బయోమెట్రిక్ హాజరు అమలులో ఉన్న నేపథ్యంలో ఇన్నాళ్ల బోగస్ కార్మికుల వేతనాలు ఎవరి జేబుల్లోకి వెళ్లాయన్నది తేలాల్సి ఉంది. దీనిపై విచారణ జరిపి ప్రజాధనం కాజేసిన వారిపై చర్యలు తీసుకుంటారా..? ఇప్పటి నుంచి ఆదా అవుతుందన్న ఆనందంతో గత అక్రమార్కులను వదిలేస్తారా..? అన్నది చూడాలి. అయితే, ఆధార్ బయోమెట్రిక్ సేవలందించిన ఏజెన్సీకి యేటా రూ.1.92 కోట్లు చెల్లించామని, ప్రస్తుతం ఆ మొత్తం రూ.67లక్షలు మాత్రమే అని స్నేహ శబరీష్ తెలిపారు.


ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌తో హాజరు వేస్తున్న అధికారి

ఫొటోలతో హాజరు..

సింథటిక్ వేలి ముద్రలతో బయోమెట్రిక్ యంత్రాలను బురిడీ కొట్టించిన కొందరు ఎస్ఎఫ్ఏలు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్నీ అక్రమాల కోసం వినియోగించాలని భావించారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌తో పని చేసే కొత్త విధానంలోనూ ఎస్ఎఫ్ఏలు టాంపరింగ్ ప్రయత్నం చేశారు. మొబైల్ గ్యాలరీలోని కార్మికుల ఫొటోల ద్వారా హాజరు వేశారు. ముషీరాబాద్, అంబర్‌పేట తదితర సర్కిళ్ల పరిధిలో 87 మంది కార్మికుల హాజరు ఫొటోల ద్వారా వేసేందుకు ప్రయత్నించగా.. దాదాపు 15 మందికి హాజరు పడిందని అధికారులు గుర్తించారు. దీంతో వెంటనే దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టారు. ఫొటోల ద్వారా హాజరు పడకుండా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసినట్టు స్నేహ తెలిపారు. గురువారం ఆమె దోమలగూడలోని ఏవీ కళాశాల సమీపంలో కార్మికుల హాజరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈనెల 14, 15 తేదీల్లో సాంకేతిక సమస్యలతో యాప్ పని చేయలేదని, దీంతో ఫొటోల ద్వారా హాజరు వేసేందుకు కొందరు ప్రయత్నించారని చెప్పారు. ఆ ఎస్ఎఫ్ఏలను గుర్తించామని, వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

మాదిగలకు కాంగ్రెస్ వెన్నుపోటు

- జూలై 7న వరంగల్‌లో మాదిగల ఆత్మగౌరవ కవాతు
- మంద కృష్ణమాదిగ

పంజాగుట్ట, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): మాదిగ సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు పొడిచిందని, రేవంత్‌రెడ్డి వల్ల మాదిగలను, బీసీలను కాంగ్రెస్ పార్టీ దూరం చేసుకున్నదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ జరిగి, రిజర్వేషన్లు పెంచిన తరువాతే ఉద్యోగ నియామకాలను చేపట్టాలని, స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేయాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ చేపట్టిన ఎస్సీ వర్గీకరణ ఉద్యమం 30 ఏళ్ల ప్రస్థానానికి చేరుతున్న సందర్భంగా జూలై 7న వరంగల్‌లో మాదిగల ఆత్మగౌరవ కవాతును నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ మద్దతు వల్లే బీజేపీ ఓటు శాతం 21 శాతానికి పెరిగిందని, బీజేపీ ఓటు బ్యాంక్ పెరగడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించింది రేవంత్‌రెడ్డేనని అన్నారు. తెలంగాణలో ఒక్క మాదిగ ఎంపీ లేకుండా చేసిన రేవంత్‌రెడ్డి కచ్చితంగా గుణపాఠం నేర్చుకునేలా చేస్తామని అన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు పెంచే వరకు ఏ నియామకాలను కూడా చేపట్టవద్దని, స్థానిక ఎన్నికలను కూడా వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేష్ మాదిగ, ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, బి.విజయ్ మాదిగ, నరసింహ మాదిగ, లక్ష్మణ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

శుభాకాంక్షలు..


ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పుట్టిన రోజు సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో గురువారం కేక్ కట్ చేస్తున్న తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకులు


క్రాస్‌రోడ్‌లో నిరసన తెలియజేస్తున్న సీపీఎం శ్రేణులు

'నీట్' లీకేజీపై సీపీఎం నిరసన

- నినాదాలతో దద్దరిల్లిన క్రాస్‌రోడ్

చిక్కడపల్లి, జూన్ 20(ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్ష పత్రాల లీకేజీపై న్యాయ విచారణ జరపాలని సీపీఎం నగర కమిటీ కేంద్రాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో గురువారం కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తల నినాదాలతో క్రాస్‌రోడ్ దద్దరిల్లింది. సీపీఎం నగర కమిటీ కార్యదర్శి ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంబీబీఎస్ ప్రవేశాల కోసం నిర్వహించే ప్రతిష్ఠాత్మకమైన నీట్ పరీక్షను నిర్వహించడంలో కేంద్రం విఫలమైందని దుయ్యబట్టారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పేపర్ లీకేజీ జరిగిందని, నలభై, యాభై లక్షలకు పేపర్ అమ్ముకున్నారని ఆరోపించారు. 24 లక్షల మంది ఈ నీట్ ఎగ్జామ్ రాశారని, ప్రస్తుతం వీరు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం అక్రమాలకు పాల్పడిందని, అందుకు నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మెడికల్ ఎగ్జామ్‌లు ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం నిర్వహించుకునే విధానాన్ని తిరిగి కొనసాగించేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు డీజీ నరసింహారావు, ఎం.శ్రీనివాసరావు, దశరథ్, మహేందర్, కె.నాగలక్ష్మి, రాజన్న, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

'నీట్'పై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి

- కిషన్‌రెడ్డికి విద్యార్థి, యువజన సంఘాల బహిరంగ లేఖ

హైదరాబాద్ సిటీ, జూన్20 (ఆంధ్రజ్యోతి): దేశంలో వైద్య, విద్య కోసం జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న నీట్(అండర్ గ్రాడ్యుయేషన్) పరీక్షలో అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని, కేంద్రం స్పందించేలా ఒత్తిడి చేయాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి విద్యార్థి యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ బహిరంగ లేఖ రాసింది. నీట్ పరీక్ష నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్.టి.ఎ) వ్యవహరించిన తీరు కూడా పలు అనుమానాలకు తావిస్తున్నదని లేఖలో పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పందించేలా ఒత్తిడి తీసుకురావాలని కోరారు. లేఖ రాసిన వారిలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పి.రామకృష్ణ, పి.మహేష్, వీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.అరుణ్‌కుమార్, ఏపీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎం.కుమార్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కేఎస్ ప్రదీప్, వైజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌కె సలీం పాషా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజీవ్ రెడ్డిలున్నారు.

యూపీఎస్సీ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

హైదరాబాద్ సిటీ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): జూన్ 21 నుంచి 23 వరకు యూపీఎస్సీ నిర్వహిస్తున్న ఇండియన్ ఎకనామిక్ సర్వీస్-2024 పరీక్షను ప్రశాంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరీక్షల నిర్వహణపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మెహదీపట్నంలోని శ్రీఅరబిందో జూనియర్ కళాశాల, దిల్‌సుఖ్‌నగర్‌లోని మెట్రో పిల్లర్ 1517 వద్ద ఉన్న సాయి చైతన్య జూనియర్ కళాశాల, హిమాయత్‌నగర్‌లోని న్యూ చైతన్య జూనియర్ కాలేజీ, దిల్‌సుఖ్‌నగర్‌లోని ఐడియల్ డిగ్రీ మహిళా కాలేజీలో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. యూపీఎస్సీ జారీచేసిన సూచనలను తప్పకుండా పాటించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, కళాశాల ప్రిన్సిపల్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీజీ పాలిసెట్ కౌన్సెలింగ్ షురూ..

- రేపటి నుంచి అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

హైదరాబాద్ సిటీ, జూన్ 20(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్‌లో ర్యాంకులు పొందిన అభ్యర్థులకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. గురువారం నుంచి ఈనెల 24వరకు అర్హత పొందిన అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్ చేసుకునేందుకు సాంకేతిక విద్యాశాఖ వీలు కల్పించింది. ఈనెల 22(శనివారం) నుంచి 25వ తేదీవరకు ధ్రువపత్రాల పరిశీలన జరగనుంది. ఇందుకుగాను రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో 32 హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేయగా, హైదరాబాద్ నగరంలో ఆరు కేంద్రాలున్నట్లు అధికారులు తెలిపారు. వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు ఈనెల 22నుంచి 27వరకు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు పెట్టుకోవాల్సి ఉంటుంది. 30న మొదటి విడత సీట్ల కేటాయింపు ఉండనుంది. అయితే, సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు వచ్చే అభ్యర్థులు తమవెంట ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ ప్రతులను తెచ్చుకోవాలని కౌన్సెలింగ్ క్యాంప్ ఆఫీసర్ శ్రీనివాస్ సూచించారు.

జీహెచ్ఎంసీలో రాజకీయ జోక్యం..!

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యే ఇటీవల జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయానికి వచ్చారు. బహుళ అంతస్తుల భవన నిర్మాణాల అనుమతి కోసం కమిటీ సమావేశం జరిగే హాలులో కూర్చుని పలు ఫైళ్లపై అధికారులతో చర్చించడం కనిపించింది.

● ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్న ఓ మాజీ ఎమ్మెల్సీ చర్లపల్లిలో ఓ లే అవుట్ అనుమతి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉందని.. ఆమోదించాలని అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఇందుకోసం పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను స్వయంగా కలిసి సిఫారసు చేసినట్టు సమాచారం.

● జిల్లాలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలూ.. అప్పుడప్పుడూ జీహెచ్ఎంసీ అధికారులను కలుస్తూ ఉంటారు. తాము భాగస్వాములుగా ఉన్న రియల్ ప్రాజెక్టులు, తమ బంధువులు, స్నేహితుల బహుళ అంతస్తుల భవన నిర్మాణ అనుమతుల కోసం వారు ఎక్కువగా సిఫారసు చేస్తుంటారు.

మారేడుపల్లి తహసీల్దార్ సస్పెన్షన్

- మరో ఇద్దరిపై వేటు

అడ్డగుట్ట, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన మారేడుపల్లి తహసీల్దార్ పద్మసుందరితో పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసన్నలక్ష్మి, రికార్డు అసిస్టెంట్ ఎస్.రవిలను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సస్పెండ్ చేశారు. మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ వచ్చే సమయంలో కార్యాలయంలో తహసీల్దార్ లేకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ కార్యాలయంలో చిరు ఉద్యోగులు వసూళ్లకు పాల్పడడంతో పాటు మూడు రోజుల క్రితం మహేంద్రహిల్స్‌లో ఓ ఐఏఎస్ ఇంటికి బోర్ వేస్తుండగా రెవెన్యూ సిబ్బంది బోర్‌ను సీజ్ చేసి అత్యుత్సాహం ప్రదర్శించారు. ఈ క్రమంలో ఐఏఎస్ కలెక్టర్‌కు ఫిర్యాదుచేసినట్లు తెలిసింది. దరఖాస్తు దారులను ఇబ్బంది పెట్టకుండా చూసుకోవాలన్నారు. తనిఖీల్లో భాగంగా మారేడుపల్లి కార్యాలయంలో రికార్డులు సక్రమంగా లేవని ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ తహసీల్దార్‌తో పాటు ఇద్దరిని సస్పెండ్ చేశారు.


మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న కలెక్టర్ అనుదీప్

ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

(5వ పేజీ తరువాయి)

నిర్వాహకులపై కేసు నమోదు చేశామని, దాని ప్రకారం మూడు నెలల జైలు శిక్ష లేదా లక్ష రూపాయల జరిమానా విధించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే, రాజ్ బార్ అండ్ రెస్టారెంట్, సందర్శిని హోటల్‌లో కిచెన్ అపరిశుభ్రంగా ఉండడాన్ని గుర్తించి పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు.

ఎస్‌బీఐ రివార్డు పాయింట్లంటూ..

(5వ పేజీ తరువాయి)

ఆటోమేటెడ్ కాల్ వచ్చింది. మీ పేరుతో ముంబై నుంచి ఇరాన్‌కు పంపిన పార్సిల్‌ను తిరస్కరించారని, మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు మొబైల్‌లో 1 నొక్కండి అని చెప్పారు. ఇలాంటి మోసాలపై అవగాహన ఉండటంతో బాధితుడు పార్సిల్‌కు తనకు ఎలాంటి సంబంధం లేదని తాను స్వయంగా వచ్చి అధికారులతో కలుస్తానని చెప్పాడు. దాంతో సైబర్ నేరగాడు ఆగ్రహం వ్యక్తం చేసి, తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించాడు. కాల్‌ను ముంబై క్రైం బ్రాంచ్ అధికారులకు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాను, వారితో మాట్లాడుకోవాలని సూచించాడు. పోలీస్ దుస్తులతో వీడియో కాల్‌లో పాల్గొన్న వ్యక్తి మీపై కేసు నమోదైందని, కేసు నుంచి తప్పించాలంటే రూ.15.36 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దాంతో భయపడి ఆ యువకుడు నగదును సైబర్ నేరస్తుడి ఖాతాకు బదిలీ చేశాడు. అనంతరం మోసపోయానని సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు.

గతం కంటే ఘనంగా బోనాలు

(5వ పేజీ తరువాయి)

హెల్త్‌క్యాంపులు, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అన్నిశాఖలు సమన్వయంతో పనిచేసి బోనాలు పండుగను విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జీహెచ్ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి, అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్‌మాన్, అడిషనల్ కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, డీఆర్వో వెంకటాచారి, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తోడ్పాటునందించాలి

- ముఖ్యమంత్రికి లాల్‌దర్వాజ ఆలయ కమిటీ ప్రతినిధుల వినతి

చాంద్రాయణగుట్ట/చార్మినార్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోనే ప్రసిద్ధి చెందిన లాల్‌దర్వాజ బోనాల ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి లాల్‌దర్వాజ దేవాలయ కమిటీ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్‌తోపాటు ఆలయకమిటీ మాజీ చైర్మన్ కె.వెంకటేశ్, కన్వీనర్ జి.అరవింద్‌కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎ.వినోద్‌కుమార్ తదితరులు జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. సీఎంను శాలువాతో సన్మానించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ప్రభుత్వం చొరవ తీసుకుని ఆలయ విస్తరణ పనులను త్వరగా చేపట్టాలని కోరారు. అలాగే.. భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసింది. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ఘనంగా సత్కరించారు. ఈసారి జాతరను అత్యంత వైభవంగా జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయ దర్శనం


అలకనంద సంగమ సీమలు
పంచ ప్రయాగలు

ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని చార్‌ధామ్ యాత్రకు ఏడాదిలో సుమారు ఆరు నెలలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ యాత్రలో భక్తులు తప్పనిసరిగా సందర్శించి, పవిత్రస్నానాలు ఆచరించే ప్రదేశాలు... పంచ ప్రయాగలు. 'ప్రయాగ' అంటే 'సంగమం' అని అర్థం. అలకనందలో అయిదు నదులు కలిసి... పవిత్ర గంగానదిగా రూపుదిద్దుకుంటాయి. ఈ పంచ సంగమ స్థలాల్లో చేసే స్నానం మోక్షప్రదాయకమనీ, ఆత్మను శుద్ధి చేస్తుందనీ అనాది విశ్వాసం. పంచ ప్రయాగలు... ఋషీకేశ్ నుంచి బదరీనాథ్ వెళ్ళే మార్గంలో ఉన్నాయి. వాటి విశిష్టత గురించి తెలుసుకుందాం.




దేవప్రయాగ: దేవప్రయాగ ఉత్తరాఖండ్‌లోని టెహ్రీ-గర్వాల్ జిల్లాలోని ఒక పట్టణం. 'దేవ ప్రయాగ' అంటే 'దేవతలు కలిసే' లేదా 'దివ్యత్వం సంగమించే ప్రదేశం' అని అర్థం. కుబేరుని పట్టణంగా పురాణాలు వర్ణించిన అలకాపురి నుంచి ప్రవహించే అలకనంద... గంగోత్రి నుంచి వచ్చే భాగీరథి నదులు ఇక్కడ సంగమిస్తాయి. శ్రీరాముడు అశ్వమేధ యాగం చేసిన ప్రదేశం ఇదేననే విశ్వాసం ఉంది. దానికి ప్రతీకగా ఇక్కడ నెలకొన్న రఘునాథ ఆలయాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో సందర్శిస్తారు.

ఎక్కడుంది?: ఋషీకేశ్ నుంచి 72 కిలోమీటర్ల దూరంలో




రుద్రప్రయాగ: ఇది మందాకినీ, అలకనంద నదుల సంగమ స్థలి. రుద్రప్రయాగ జిల్లాకు కేంద్రం. పురాణాల ప్రకారం... నారదుడికి మహా శివుడు సంగీతాన్ని నేర్పిన చోటు. అలాగే శివుడు రుద్రవీణానాదాన్ని పలికించిన చోటు. రుద్రమూర్తిగా కనిపించిన శివుణ్ణి నారదుడు పూజించగా... అతని కోరిక మేరకు శివుడు ఇక్కడ వెలిశాడట. రుద్రప్రయాగలో రుద్రనాథ మందిరం, చాముండా దేవి ఆలయంతో సహా పలు మందిరాలు ఉన్నాయి. ఇది బదరీనాథ్, కేదార్‌నాథ్ యాత్రికులకు కూడలి.

ఎక్కడుంది?: ఋషీకేశ్ నుంచి 137 కిలోమీటర్ల దూరంలో



కర్ణప్రయాగ: అజేయమైన కవచాన్ని పొందడానికి శివుడి కోసం కర్ణుడు తపస్సు చేసిన చోటుగానూ, కర్ణుడి నగరంగానూ పురాణాలు పేర్కొంటున్న కర్ణప్రయాగ... ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో ఉంది. కర్ణ ప్రయాగ దగ్గర... అలకనంద, పిండారి నదులు సంగమిస్తాయి. జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్, నైనిటాల్, అల్మోరాలకు ఇక్కడి నుంచి మార్గాలు ఉన్నాయి. కర్ణప్రయాగలో పద్దెనిమిది రోజుల పాటు స్వామి వివేకానంద తపస్సు చేశారంటారు. ఇక్కడ ఉమాదేవి ఆలయం ఉంది.

ఎక్కడుంది?: ఋషీకేశ్ నుంచి 168 కిలోమీటర్ల దూరంలో



నందప్రయాగ: శ్రీకృష్ణుణ్ణి పెంచిన నందుడి ఊరు, గోపాలుడు పెరిగిన నంద గోకులం, నందుడు యజ్ఞం ఆచరించిన చోటు, కణ్వాశ్రమం ఉన్న ప్రదేశం, శకుంతలా దుష్యంతుల వివాహ స్థలి... ఇలా నంద ప్రయాగ విశిష్టతను పురాణాలు అనేక విధాలుగా వర్ణించాయి. అలకనంద, నందాకినీ నదులు సంగమించే నందప్రయాగలో పురాతనమైన గోపాల్జీ (నంద గోపాల) మందిరం ఉంది. నందాదేవీ పర్వత పాదాల దగ్గర... చమోలీ జిల్లాలో ఉన్న నందప్రయాగ సంగమంలో స్నానం సకలపాప హరం అని భక్తుల విశ్వాసం.

ఎక్కడుంది?: ఋషీకేశ్ నుంచి 188 కిలోమీటర్ల దూరంలో.



విష్ణుప్రయాగ: అలకనంద, ధౌలిగంగ నదులు ఇక్కడ సంగమిస్తాయి. చమోలీ జిల్లాలో ఉన్న విష్ణుప్రయాగ... కేదార్‌నాథ్‌కు వెళ్ళే మార్గంలోని ఆఖరి సంగమం. మహా విష్ణువు కోసం నారదుడు ఈ ప్రదేశంలో తపస్సు చేశాడని పురాణాలు చెబుతున్నాయి. ఇక్కడ మహా విష్ణువు ఆలయం, సంగమం దగ్గర విష్ణుకుండం ఉన్నాయి. ప్రకృతి సంపదకు నిలయమైన ఈ ప్రాంతం ట్రెక్కింగ్, హైకింగ్‌లకు కూడా ప్రసిద్ధి చెందింది. వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్, హేమకుండ్ లేక్ లాంటివి పర్యాటకులను ఆకట్టుకుంటాయి.

ఎక్కడుంది?: ఋషీకేశ్ నుంచి 255 కిలోమీటర్ల దూరంలో.

ఎలా వెళ్ళాలి: ఋషీకేశ్- బదరీనాథ్‌ల మధ్య దూరం దాదాపు 286 కిలోమీటర్లు. పంచప్రయాగలు ఆ దారిలోనే ఉన్నాయి. ఋషీకేశ్ నుంచి రోడ్డు మార్గంలో ప్రయాణించాల్సి ఉంటుంది. ఋషీకేశ్‌లో రైల్వేస్టేషన్ ఉంది. అక్కడికి విమానాశ్రయం సుమారు 35 కిలోమీటర్ల దూరంలోని డెహ్రాడూన్‌లో ఉంది.

అతిథి

అది తెలుసుకుంటే... మరేవీ అక్కర్లేదు



సామాజికమైన అంతరాలను నిరసిస్తూ ఒడిశాలో ప్రారంభమైన ఒక ఉద్యమం... అలెఖ్ మహిమ ధర్మం. నిరాడంబరమైన, కఠినమైన జీవన విధానాన్ని అనుసరిస్తూ, సర్వసమానత్వాన్ని కాంక్షించే ఆ సంప్రదాయానికి చెందిన **సాధు త్రినాథ్ దాస్**... 'హిందూస్ ఫర్ ప్యూరాలిటీ అండ్ ఈక్వాలిటీ' (హెచ్‌పిఇ) సంస్థకు జాతీయ అధ్యక్షునిగా... మత విద్వేషాలు, అసమానతలపై పోరాడుతున్నారు. ఆయన పలు అంశాలపై తన అభిప్రాయాలను 'నివేదన'తో పంచుకున్నారు...

అలెఖ్ మహిమ సంప్రదాయంలోకి ఎలా వచ్చారు?

ఆ సంప్రదాయంలో నేనొక సాధువును. మాది ఒడిశాలోని కలహండి దగ్గర ఒక గ్రామం. నాకు పదేళ్ళ వయసున్నప్పుడే ఇంటి నుంచి బయటకు వచ్చేశాను. నా మాతృభాష ఒరియా. తరువాత హిందీ, తెలుగు లాంటి భాషలు కొద్దికొద్దిగా నేర్చుకున్నాను. నేను అయిదో తరగతి వరకూ చదువుకున్నాను. ఆ వయసులోనే నాకు సాధు మార్గంలో నడవాలనే ఆలోచన కలిగింది. నేను ఏదైనా నేర్చుకున్నానంటే అది మా గురువుల దగ్గరే. 'ఉన్నది ఒక్కటే... బ్రహ్మమొక్కటే' అనేది వారి నుంచే తెలుసుకున్నాను.

ఈ సంప్రదాయంలో ప్రధానమైన భావన ఏమిటి?

మేము అన్నింటిలోనూ దేవుణ్ణి దర్శిస్తాం. మాకు విగ్రహారాధనలు లేవు. తిలకాలు దిద్దుకోవడం, పూజలు చేయడం లాంటివి లేవు. ప్రతి ఒక్కరిలోనూ దేవుడున్నాడు. వారు ఎవరనేది మాకు అనవసరం. వారిలో ఉన్న దేవుణ్ణి మేము పూజిస్తాం. అలెఖ్ సంప్రదాయంలోని విశేషం అదే. ఈ ప్రపంచంలో మీరు ఏది చేస్తున్నా... అది మీరు ఉపాసన చేస్తున్న దేవుణ్ణే చేరుతుంది.

ఈ సంప్రదాయాన్ని స్థాపించింది ఎవరు?

అలెఖ్ పరబ్రహ్మ మహిమా గోస్వామి. అప్పట్లో మతకలహాలు, మత విభేదాలు ఎక్కువగా ఉండేవి. అలెఖ్ స్వామి ఎక్కడ పుట్టారో, ఎక్కడ పెరిగారో ఎవరికీ తెలీదు. మత విభేదాలు, కులవిభేదాలు వద్దని ఆయన బోధించారు. అన్ని కులాలవారినీ, మతాలవారినీ కలిపి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసేవారు. దీన్ని అగ్రకులాలవారు వ్యతిరేకించారు. అలెఖ్ స్వామి అనే వ్యక్తి ఎవరో వచ్చి కుల కట్టుబాట్లను నాశనం చేస్తున్నారని ఆ ప్రాంతంలోని రాజుకు ఫిర్యాదు చేశారు. ఆ స్వామిని బంధించాలని రాజు ఆదేశించినా... అది సాధ్యం కాలేదు. అలెఖ్ స్వామి ముప్పై అయిదు ఏళ్ళు మాత్రమే జీవించారు. తరువాత ఆయన నెలకొల్పిన సంప్రదాయం కొనసాగుతోంది. అది చాలా ప్రాచుర్యం పొందినదే. ఈ సంప్రదాయం ఒడిశాలో, ఆంధ్రప్రదేశ్‌లో, బిహార్‌లో, ఛత్తీస్‌గఢ్‌లో... ఇలా అనేక రాష్ట్రాలలో ఉంది.

దీనికి ఒక స్థిరమైన వ్యవస్థ ఉందా?

'అలెఖ్ మహిమ సమాజ్' అనే వ్యవస్థ ఉంది. దానికి అధ్యక్షుడు ఉంటారు. పదకొండు మంది సభ్యులతో ఒక కమిటీ ఉంటుంది. వారి నేతృత్వంలో అన్నీ క్రమబద్ధంగా నడుస్తాయి. ఇక మాకు ఆదాయ మార్గాలేవీ లేవు. ప్రత్యేకమైన వ్యాపార వ్యవహారాలేవీ లేవు. రాజకీయ ప్రాపకాల ద్వారా ఆదాయాన్ని మేము కోరుకోం. అలెఖ్ సంప్రదాయంలో ఉన్న వారితో పాటు ఇతర భక్తులు, దాతలు విరాళాలను ఇస్తారు. వాటి మీదనే మా వ్యవస్థ నడుస్తుంది. మేము ఒక రోజు ఒక ఊర్లో ఉంటాం. మరో రోజు ఇంకో ఊరిలో ఉంటాం. ఈ పూట మీ ఇంట్లో భోజనం చేస్తే... ఇక రెండో పూట మీ ఇంట్లో భోజనం చేయం. మా సంప్రదాయంలో అది ముఖ్యమైన నియమం. ఎందుకంటే... మోహం ఉండకూడదు. గాలి, నీరు అనేవి ఎప్పుడూ ప్రయాణిస్తూనే ఉంటాయి. ఎందుకంటే వాటిని బంధించలేం. మా సంప్రదాయం కూడా అలాంటిదే. మేము ఎవరినీ ద్వేషించం. నిరాడంబరంగా ఉంటాం. ఒకే చోట ఉంటే ఆ ప్రదేశం మీద, వ్యక్తుల మీద ప్రేమ, అభిమానం కలుగుతూ ఉంటాయి. ఏదో ఒక బంధంలో చిక్కుకుంటాం. ఈ బంధం ఎలాంటిదంటే... కాలసర్పంలా కాళ్ళకి చుట్టేస్తుంది.

మీ దినచర్య ఎలా ఉంటుంది?

మేము ఎక్కడ ఉన్నా... సాధువులమైనా, భక్తులమైనా... తెల్లవారుజామున మూడు గంటలకు నిద్ర లేస్తాం. కాలకృత్యాలు తీర్చుకొని, స్నానం చేస్తాం. ప్రార్థనలు చేస్తాం. వాటిలో వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీతల్లోంచి తీసుకున్నవి, మా సంప్రదాయానికి చెందినవీ ఉంటాయి. అనంతరం ధ్యానం, ప్రాణాయామం చేస్తాం. విమల్ భాయీ అనే మహాకవి అలెఖ్ మహిమ సమాజ్‌కు చెందిన వ్యక్తి. ఆయన ఒరియాలో రాసిన భజనలను మేము గానం చేస్తాం. ఆ తరువాత అల్పాహారంగా భక్తులు ఏది పెడితే అది తీసుకుంటాం. ఉదయం తొమ్మిది... పది గంటల లోపు భోజనం చేసి... మరో ఊరుకు వెళ్ళిపోతాం. ఒక రోజు రాత్రి ఉన్న ఊర్లో... రెండో రాత్రి ఉండం. అదీ ప్రధానంగా మా దినచర్య.

చాలా ప్రాంతాల్లో మీకు ఆశ్రమాలు ఉన్నాయా?

ఉన్నాయి. వాటి నిర్వహణ భక్తులు చూసుకుంటారు. అయితే సాధువులకు ప్రత్యేకంగా ఆశ్రమాలేవీ ఉండవు. మేము ఒక ఊరి నుంచి మరో ఊరికి వెళ్ళినప్పుడు... అక్కడ ఆశ్రమం లేకపోతే... జనసమ్మర్దం లేని ప్రదేశాల్లో... పాఠశాలల్లాంటి వాటిలో రాత్రి బస చేస్తాం. అలెఖ్ స్వాములు త్యాగానికి ప్రతిరూపాలు. అత్యున్నత స్థితికి చేరుకున్నవారు కేవలం కౌపీనం (గోచీ) మాత్రమే ధరిస్తారు. మేము కూడా ఆశ్రమాల్లో ఉన్నప్పుడు కౌపీనంతోనే ఉంటాం. సాధు సమ్మేళనాల్లాంటి వాటికి హాజరైనప్పుడు... పరిస్థితులను బట్టి వస్త్రాలు ధరిస్తాం.

కొత్తవారిని చేర్చుకోవడానికి నిబంధనలు ఏవైనా ఉన్నాయా?

ఎవరైనా శిష్యరికం చెయ్యాలంటే... మా జీవన విధానాన్ని వాళ్ళు తెలుసుకోవాలి. మా లక్ష్యాన్నీ, ఉద్దేశాలనూ అర్థం చేసుకోవాలి. ఎవరినీ మేము బలవంతం చెయ్యం. ఎందుకంటే ప్రతి ఒక్కరూ ఉండవచ్చు. వాళ్ళందరినీ మార్చాలనే ఉద్దేశాలు మాకు ఉండవు. 'ఏకమేవ అద్వితీయం'... 'ఉన్నది ఒక్కటే' అనేది తెలుసుకుంటే... ఇవన్నీ అక్కర్లేదు.

గృహస్థ ధర్మం పాటిస్తున్న వారున్నారా...

ఉన్నారు. వారు వివాహం చేసుకుంటారు. రోజువారీ కార్యక్రమాలు చేసుకుంటారు. కానీ మా సంప్రదాయంలోని నియమాలను పాటిస్తారు. గురువు ఏది చేస్తే అదే చేయాలి.

సమాజంలో అసహనం పెరిగిపోతోందని చెబుతున్నారు. 'హిందూస్ ఫర్ ప్యూరాలిటీ అండ్ ఈక్వాలిటీ' (హెచ్‌పిఇ) సంస్థకు జాతీయ అధ్యక్షుడిగా ఉన్నారు. మరి మీ ధర్మం దీని గురించి ఏం చెబుతోంది?

ఈ ద్వేషాన్నీ, అసహనాన్నీ నిరోధించాలి.. వేల సంవత్సరాల కిందట సింధునదికి ఇవతలివారిని 'సింధువాసులు' అని పిలిచేవారు. 'సింధు' కాస్తా 'హిందు' అయింది. మన ధర్మాన్ని అలా పిలుచుకోవడంలో తప్పులేదు. కానీ అప్పుడు ఎలా ఉన్నామో ఇప్పుడూ అలాగే ఉండాలి. ఎవరు ఏ సంప్రదాయంలో ఉన్నారు, ఏ మతంలో ఉన్నారు అనేది మనకి అవసరం లేదు. అన్ని ప్రాణుల పట్ల గౌరవం ఉండాలి. ప్రకృతి పట్ల మర్యాద ఉండాలి. ప్రకృతి బాగుంటే మనం బాగుంటాం. ఎవరి మీదా కక్ష కానీ, ద్వేషం కానీ లేని దేశం మనది. మతం వేరు, మత విద్వేషం వేరు. మా భావాలకు సన్నిహితంగా, అనుగుణంగా ఉన్న సంస్థలతో కలిసి పోరాటం చేస్తున్నాం. తద్వారా ప్రపంచానికి ఎంతో కొంత మేలు జరుగుతుందనేది మా ఉద్దేశం. ఇప్పటికే ఈ దిశగా పని చేస్తున్నాం. కానీ సంఘటితంగా పని చేస్తే... లక్ష్యాన్ని తొందరగా సాధించగలమని అనుకుంటున్నాం.

సమాజంలో మీరు ఎలాంటి మార్పును కోరుకుంటున్నారు?

మనది బహుళత్వంతో... పలు విశ్వాసాలతో కూడిన జీవన విధానం మీరు ఏ సంప్రదాయానికి చెందిన వ్యక్తో నాకు తెలీదు. మీరు ఏ దేవుడికి ఆరాధన చేస్తున్నారో నాకు తెలీదు. మీ పక్కన ఉన్న వ్యక్తి, నేను... మేము ఏ దేవుణ్ణి ఆరాధిస్తున్నామో మీకు తెలీదు. ఇక్కడ మనం వందల, వేల సంవత్సరాలనుంచి కలిసి మెలిసి ఉన్నాం. దీన్ని భంగపరచడానికి సంప్రదాయం ముసుగులో కొందరు దాడులు చేస్తున్నారు. మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. దాన్ని ఆపడానికి మేము ప్రయత్నిస్తున్నాం. మనం ముందు నుంచీ ఇలాగే ఉన్నాం, ఇప్పుడూ అలాగే ఉన్నాం, భవిష్యత్తులోనూ ఇలాగే ఉంటాం. ఇలాగే ఉండాలనేదే నా తపన. జ్ఞాన దృష్టితో చూసినప్పుడు... నువ్వూ ఈశ్వరుడివే, నేనూ ఈశ్వరుణ్ణే. చెట్టు, పుట్ట, గాలి, నీరు... ఇవన్నీ ఈశ్వరుడే. సమస్తం ఈశ్వరుడే. ఇక్కడ ఈశ్వరుడు తప్ప మరేదీ లేదు. మరి ఎవరిని నొప్పిద్దాం? ఎవరిని ద్వేషిద్దాం? ఇతనిది అగ్రకులం, అతనిది నిమ్నకులం, నేను సాధువుని, నువ్వు గృహస్తువి... ఇవన్నీ మనం చూసే దృష్టిలో ఉన్న లోపాలు. దీన్ని దాటి మనం వెళ్ళగలిగితే... 'ఏకమేవ అద్వితీయం'... 'ఉన్నది ఒక్కటే. రెండోది ఏది లేదు' అనేది అర్థం అవుతుంది.

మీరు సాకార ఆరాధన చేస్తారా?

మాకు ఆ పద్ధతి లేదు. అయితే... సాకార ఆరాధన, నిరాకార ఆరాధన అనే అభ్యంతరాలేవీ మాకు లేవు.

మీ శిష్యులు సాకార ఆరాధన చేసినా అభ్యంతరం ఉండదా?

ఈ సంప్రదాయాన్ని ఎవరైతే అనుసరిస్తారో... వారు విగ్రహారాధన చేయరు. అలెఖ్ సంప్రదాయాన్ని స్వీకరించిన వారి కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు విగ్రహారాధన చేస్తూ ఏదో ఆరాధన చేస్తూనే ఉంటారు. దుర్మార్గాలకు పాల్పడకుండా ఏది చేసినా మేము ఆమోదిస్తాం. చంపడం, దోచుకోవడం, హాని చేయడం లాంటి వాటికి పాల్పడకుండా... మీరు ఏ దేవుణ్ణి ఆరాధించినా, ఏ దేవుణ్ణీ ఆరాధించకపోయినా మాకు అభ్యంతరం లేదు. కానీ అలాంటి పనులు చేస్తే మాత్రం మేము కచ్చితంగా అభ్యంతరం చెబుతాం.

చైతన్యం రావాలంటున్నారు, ఎక్కడినుంచి...? ప్రజల నుంచా? ప్రభుత్వాల నుంచా?

ప్రభుత్వాలకూ, దీనికీ సంబంధం లేదు. చైతన్యం ప్రజల్లోనే రావాలి. మీరు రాముడి భక్తుడు, మీ అబ్బాయి కృష్ణ భక్తుడు, మీ భార్య లక్ష్మీదేవి భక్తురాలు అనుకోండి. అలాగని మీరు ఇంట్లో ఘర్షణ పడతారా? కొట్టుకుంటారా? సమాజంలో కూడా అంతే కదా! ఎవరు ఏ మతం పాటిస్తే ఇబ్బంది ఏమిటి? ఎవరు ఎవరిని పూజిస్తే మనకు సమస్యేమిటి?

సంభాషణ: కృష్ణశర్మ



విశేషం

పతంజలి మహర్షి గొప్ప శాస్త్రవేత్త. మనిషి మనస్సును ఆయన అర్థం చేసుకున్నట్టుగా ఎవరూ అర్థం చేసుకోలేదు. తాను రచించిన ప్రధాన గ్రంథమైన 'యోగ సూత్రాల'లో... యోగ మార్గంలో ఎదురయ్యే తొమ్మిది అడ్డంకుల గురించి ఆయన చర్చించారు. అవి: వ్యాధి (శారీరక అనారోగ్యం), స్థాన్య (మానసిక అనారోగ్యం లేదా విషయాలను అర్థం చేసుకోలేకపోవడం), సంశయ (సందేహం), ప్రమాద (అజాగ్రత్త), ఆలస్య (సోమరితనం), అవిరతి (ఇంద్రియాల పట్ల అనుబంధం), భ్రాంతి దర్శన (భ్రాంతి, ఊహాలోకంలో ఉండిపోవడం) అలబ్ధ భూమికత్వం (ఏ స్థితినీ

ఆ అడ్డంకులు తొలగాలంటే..

పొందలేకపోవడం), అనవస్థితత్వం (స్థిరత్వం లేకపోవడం). సాధనా మార్గంలో ఏయే అడ్డంకులు వచ్చే అవకాశం ఉందో వాటన్నిటినీ ఈ తొమ్మిదింటిలో మహర్షి చెప్పేశాడు. ఇంతకుమించి మరే అడ్డంకీ ఉండే అవకాశం లేదు. మరి వాటిని తొలగించుకోవడం ఎలా? ఒకసారి ఒక పనిని మాత్రమే ఎంచుకొని చేయడమే. దీనికే 'ఏకతత్వాభ్యాసం' అని పేరు. ఒకే సూత్రానికి కట్టుబడి సాధన చేయడం. ఆ సూత్రం దైవం కావచ్చు, ఏదైనా పదార్థం కావచ్చు, గురువు కావచ్చు లేదు నీకు నీవే కావచ్చు. ఆ విషయం ఏదైనా సరే... ఒకే దానిమీద సాధన చేసినట్టయితే... తొమ్మిది అడ్డంకులూ తొలగిపోతాయి. ఇదంతా మీలో కొంత ప్రశాంతత ఉన్నప్పుడే సాధ్యమవుతుంది. ఏకతత్వాభ్యాసానికి కొంత ప్రశాంతత అవసరం. అంటే అది లేకపోతే ఇది సాధ్యపడదు. ఏకతత్వాభాసం గురించి మరింత వివరంగా చెప్పుకోవాలంటే.. ఒకే సూత్రాన్ని అంటిపెట్టుకొని ఉండడం. అంటే తనను, భగవంతుణ్ణి లేదా గురువును... అందరిలోనూ చూడ డం. ఒకే సూత్రాన్ని ప్రతి ఒక్కరిలో, ప్రతి వస్తువులో చూడడం. 'నేనే ప్రతి ఒక్కరిలో ఉన్నాను. లేదా నా గురువే అంతటా ప్రత్యక్షమై ఉన్నాడు. నా గురువు తప్ప వేరే ఎవ్వరూ లేరు. ఆయనే నాకు సర్వస్వం లేదా భగవంతుడే నా సర్వస్వం. అంతా నేను మాత్రమే ఉన్నాను' అని భావించడం. అదే జీవన నైపుణ్యం.

అడ్డంకులు, అవరోధాలు ఎదురైనప్పుడు... మనల్ని దారి తప్పించే పరిణామాలు కొన్ని కలుగుతాయి. వాటిలో కొన్ని: దుఃఖ- బాధలు పడడం, దౌర్మనస్య - మానసిక దుర్బలత, అంగమేజయత్వ - శరీరం మీ మాట వినకపోవడం. అంటే శరీరానికి, మనస్సుకు సమన్వయం కుదరకపోవడం, చివరకు శరీరమే గెలవడం. ఎక్కువ మద్యం సేవించిన వ్యక్తి ఎడమవైపు వెళ్ళాలనుకొని కుడివైపు వెళ్తూ ఉంటాడు. తిన్నగా వెళదామని అనుకుంటాడు. కానీ శరీరం సహకరించదు. అలాగే శ్వాస ప్రశ్వాస - ఒక క్రమం లేకుండా, వణుకుతూ... అసౌకర్యంగా ఉండే శ్వాస. మీరు గమనించినట్టయితే... మీరు ఆనందంగా, ఉత్సాహంతో ఉన్నప్పుడు లోపలికి పీల్చుకొనే గాలి ఎక్కువగా ఉంటుంది. బాధలో ఉన్నప్పుడు... బయటికి వదిలే శ్వాస దీర్ఘంగా ఉంటుంది. శ్వాస సక్రమంగా, స్థిరంగా ఉండదు. మరి వీటిని వదిలించుకోవాలంటే ఏం చెయ్యాలి? "ఏకతత్వాభ్యాస... ఒక సూత్రాన్ని లేదా మార్గాన్ని ఎంచుకొని దాన్నే సాధన చెయ్యండి" అని పతంజలి మహర్షి చెబుతున్నాడు.

- గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

సహజయోగ

వారే అసలైన యోగులు...

మనిషి తాను ఎదుర్కొంటున్న సమస్యలకు సమాధానాలు వెతుకుతూ ఉంటాడు. సరైన దిశా నిర్దేశం లేక ఒత్తిడికి గురవుతూ ఉంటాడు. జీవితం అంటే మనిషి నిరంతరం తనతో తాను చేసే యుద్ధమే. మనిషి ఆనందంగా జీవితాన్ని కొనసాగించడానికీ, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికీ... ముఖ్యంగా ఆధ్యాత్మికతవైపు పయనించడానికీ, సమాజంలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పరచడానికి కృషి చేసిన వ్యక్తి శ్రీమాతాజీ నిర్మలాదేవి. మనుషులు తమలో ఉన్న దైవిక శక్తిని గుర్తించి, కుండలినీ జాగృతి ద్వారా ఆత్మసాక్షాత్కారాన్ని పొందే ప్రక్రియకు ఆమె శ్రీకారం చుట్టారు. ఆమె అందించిన యోగమే సహజయోగం. "అందరూ సహజ యోగంలోకి రండి. మిమ్మల్ని మీరు తెలుసుకోండి. జీవితాన్ని సాఫల్యం చేసుకోండి. జన్మను ధన్యం చేసుకోండి. మోక్ష ప్రాప్తిని పొందండి" అంటూ ఆమె ప్రపంచ మానవాళికి సందేశాన్ని అందించారు. ఈ ప్రక్రియ ప్రస్తుతం నూట నలభైకి పైగా దేశాల్లో కొనసాగుతోంది.

సహజయోగ ధ్యాన ఆవశ్యకత మనిషి జీవితంలో చాలా ఉంది. ఎందుకంటే మనతో పాటు జన్మించి, మనలోనే నిద్రాణమై ఉన్న శక్తిని, సృష్టి యావత్తూ వ్యాపించిన శక్తిని, భగవంతుడు ప్రసాదించిన శక్తిని... మళ్ళీ భగవంతుడితోనే కలపడం ఒక అద్భుత ప్రక్రియ. సహజయోగ ధ్యానంలో మనిషి మొదటగా తనలోని అంతర్గత శక్తి అయిన కుండలినీ శక్తి గురించి తెలుసుకుంటాడు. నిద్రాణ స్థితిలో ఉన్న ఆ కుండలినీ శక్తిని... మేల్కొలపడం ద్వారా ఆత్మసాక్షాత్కారం పొందవచ్చు. దాన్ని పొందిన సాధకుడు...



భూత, భవిష్యత్, వర్తమాన కాలాల గురించి తన ఆలోచనలు తగ్గించుకొని... మధ్యేమార్గంలోకి వస్తాడు. ప్రస్తుత క్షణాన్ని ఆనందించే స్థితికి వస్తాడు. ఆ ఆనందకర స్థితి ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఒత్తిడి దూరమవుతుంది. ఆలోచనా విధానం మారుతుంది. సత్యంవైపు అడుగులు పడతాయి. తన ఆధ్యాత్మిక ప్రయాణాన్ని ప్రారంభిస్తాడు. ఆ ప్రయాణంలో మొదట తనలోని తమో, రజో గుణాలను వదలి... సత్వ గుణాన్ని అలవరచుకుంటాడు. సుషుమ్న మార్గంలో తన ప్రయాణాన్ని కుండలినీ శక్తి సాగించే సమయంలో... మనిషిలోని అవలక్షణాలను రుగ్మతలనూ తొలగిస్తుంది, అతని సూక్ష్మ శరీరంలో చైతన్యాన్ని నింపుతూ సహస్రారాన్ని చేరుతుంది. మనిషి ఆత్మ ప్రకాశాన్ని పొందుతాడు. భగవంతుడికి ప్రతిరూపమైన ఆత్మ తనలోనే కొలువై ఉందనే సత్యాన్ని గ్రహిస్తాడు. ఆత్మ, పరమాత్మ వేరు కాదనీ, రెండూ ఒక్కటేనని గుర్తిస్తాడు.

అయితే అంతా భగవంతుడే చేస్తున్నాడనే విషయాన్ని ఆత్మసాక్షాత్కారం ద్వారా తెలుకున్నప్పటికీ... మళ్ళీ మనిషి మాయలో పడుతూనే ఉంటాడు. అన్నీ తానే చేస్తున్నానని అనుకుంటాడు. అతనిలో తమో, రజో గుణ ప్రభావం ఉంటుంది. కాబట్టి ఆధ్యాత్మిక సాధన చేసే వ్యక్తి... ప్రతిరోజూ ధ్యానం ద్వారా... భూత, భవిష్యత్ ఆలోచనలను వదిలిపెట్టి, వర్తమానంలోకి రావడం కోసం సాధన చేయాలి. మాయ మనిషి వెన్నంటే ఉంటుంది. అందుకనే... ప్రతిక్షణం 'నేను ఆత్మను, ఆత్మ పరమాత్మ వేరు కాదు' అని గుర్తు చేసుకుంటూ ఉండాలి చిత్తాన్ని ఎప్పుడూ సహస్రారంపై ఉండేలా చూసుకోవాలి. ఈ సాధన ద్వారా మనిషి వివేకాన్ని, శుద్ధ విద్యను, సంతృప్తిని, ధైర్యాన్ని, క్షమాగుణాన్ని పొంది... సత్వ గుణంలో స్థిరపడతాడు. ఆత్మ సాక్షాత్కారం పొందిన వ్యక్తిని 'యోగి' అంటారు. ఆత్మను భగవంతుడిపై లగ్నం చేసి, మాయకు అతీతంగా... ఎవరైతే భగవంతునితో అనుసంధానమై జీవిస్తూ ఉంటారో... వారే అసలైన యోగులు. సహజయోగ సాధన ద్వారా మానసిక, శారీరక, భావనాత్మక, ఆధ్యాత్మిక అభివృద్ధిని మనిషి పొందగలడు. ఆధ్యాత్మికతకు మొదటి మెట్టు ఆత్మసాక్షాత్కారం. ఆ ప్రక్రియను సులభతరం చేసి మానవాళికి అందించిన మహనీయురాలు శ్రీమాతాజీ నిర్మలాదేవి.

డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



సీఐటీడీలో మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్

హైదరాబాద్-బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ)- ఫుల్ టైం మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్(ఎంఈ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సహకారంతో ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. కోర్సు వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. హైదరాబాద్ సీఐటీడీ క్యాంపస్‌లో ప్రతి సోమ, మంగళ, బుధ వారాల్లో ఉదయం తొమ్మిదిన్నర నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు; ఓయూ ఇంజనీరింగ్ కాలేజ్(మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్) క్యాంపస్‌లో ప్రతి గురు, శుక్ర, శని వారాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం అయిదున్నర వరకు తరగతులు నిర్వహిస్తారు. ఉస్మానియా యూనివర్సిటీ మాస్టర్స్ డిగ్రీని ప్రదానం చేస్తుంది.

స్పెషలైజేషన్‌లు
- మెకానికల్ క్యాడ్/క్యామ్
- టూల్ డిజైన్
- డిజైన్ ఫర్ మాన్యుఫాక్చర్
- మెకట్రానిక్స్

అర్హత: ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కళాశాల నుంచి మెకానికల్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ ఇంజనీరింగ్/ మెకట్రానిక్స్ ఇంజనీరింగ్/ఆటోమొబైల్ ఇంజనీరింగ్/ఏరోనాటికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రెగ్యులర్ అభ్యర్థులు సెమిస్టర్‌కు రూ.41,000; స్పాన్సర్డ్ అభ్యర్థులు సెమిస్టర్‌కు రూ.51,000 చెల్లించాల్సి ఉంటుంది. అటానమస్ ఫీజు కింద రూ.9,770; కాషన్ డిపాజిట్ కింద రూ.1,000 చెల్లించాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 12
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 14
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** citdindia.org

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/MDGs4n6లో చదవండి.

దిక్సూచి
DIKSUCHI

నల్సార్‌లో సర్టిఫికేషన్ కోర్సు

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లాకు చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీఓఈ)- షార్ట్ టర్మ్ సర్టిఫికేషన్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇందులో ప్రధానాంశం 'సైబర్ క్రైమ్స్ ఇన్వెస్టిగేషన్ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్ యూజింగ్ ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్(ఓసింట్) టూల్స్ అండ్ టెక్నిక్స్'. ఈ కోర్సుకి సెంటర్ ఫర్ సైబర్ లాస్ అండ్ ఫోరెన్సిక్ సైన్సెస్ సహకారం అందిస్తోంది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 70 సీట్లు ఉన్నాయి. నల్సార్ విద్యార్థుల కోసం 10 సీట్లు ప్రత్యేకించారు.

కోర్సు ఫీజు: రూ.6000
ప్రోగ్రామ్ సెషన్స్: జూలై 5 నుంచి 7 వరకు
దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 4
వెబ్‌సైట్: nalsar.ac.in



ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ గురువారం 'విశ్వంభర' చిత్రం సెట్స్‌లో చిరంజీవితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దుర్గేశ్‌ను చిరంజీవి శాలువా కప్పి సత్కరించారు. మంత్రిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నెరవేర్చడంలో దుర్గేశ్ విజయం సాధించాలని చిరంజీవి ఆకాంక్షించారు.



యాభై ఏళ్లుగా తెలుగు చిత్రపరిశ్రమకు ఎనలేని సేవ చేస్తూ, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి అధ్యక్షుడిగా సేవలు అందిస్తూ, హిందూపురం నుంచి మూడోసారి శాసనసభ్యుడిగా ఎన్నికైన నందమూరి బాలకృష్ణను తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి, తెలుగు నిర్మాతల మండలి, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలసి అభినందించారు.

మూడు ప్రపంచాల మధ్య జరిగే కథ



ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ వంటి టాప్ స్టార్స్ నటించిన సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ' ప్రమోషనల్ కంటెంట్ ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తికలిగిస్తోంది. అలాగే దర్శకుడు నాగ్ అశ్విన్ పాల్గొన్న 'ఎపిక్ జర్నీ ఎపిసోడ్ వన్' కుతూహలాన్ని మరింత పెంచింది. తాజాగా గురువారం రెండో ఎపిసోడ్‌ను విడుదల చేశారు. ఇందులో దర్శకుడు మాట్లాడుతూ 'మూడు ప్రపంచాల మధ్య జరిగే కథ ఇది. ఒక్కో వరల్డ్ నుంచి ఒక్కో థాట్ ప్రాసెస్‌తో ఫ్యూచరిస్టిక్‌గా బిల్డప్ చేశాం. ఇందులో కాశీ మొదటిది. ఈ ప్రపంచంలో కాశీనే చివరి సిటీ అయితే ఎలా ఉంటుందన్న ఆలోచనతో 'కల్కి' స్క్రిప్ట్ మొదలు పెట్టాం. కలియుగం చివరిలో గంగానది ఎండిపోయిన తర్వాత కాశీ ఎలా ఉంటుంది, నాగరికత ఏ విధంగా ఉంటుంది అనే ఊహతో ఆ సిటీని క్రియేట్ చేశాం. ఇండియన్ ఆర్కిటెక్చర్, వెహికిల్స్, కరెన్సీ.. ఇలా అన్ని విషయాల్లో ఫ్యూచరిస్టిక్‌గా ఆ సిటీని రూపొందించాం. కాశీ పైన పిరమిడ్ ఆకారంలో ఉండే స్ట్రక్చర్ ఉంటుంది. దాన్ని మేం కాంప్లెక్స్ అంటాం. భూమిపై లేని నేచర్, యానిమల్స్, ఫుడ్.. అక్కడ ఉంటాయి. ఇదో రకం స్వర్గం అనుకోవచ్చు. మూడో ప్రపంచం శంబల. కాశీకీ, కాంప్లెక్స్‌కూ సంబంధం లేని ప్రపంచం అది. అక్కడ ఉన్న వారు కాంప్లెక్స్‌లో ఉన్నవారిని ఛాలెంజ్ చేస్తుంటారు. కల్కి అవతారం శంబలలో పుడుతుందనే నమ్మకం మన శాస్త్రాల్లో ఉంది. ఈ మూడు ప్రపంచాలు ఒకదానితో మరొకటి కలగలుస్తూ 'కల్కి' కథ నడుస్తుంది' అన్నారు.

థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో...



వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా నటిస్తున్న చిత్రం 'ద కానిస్టేబుల్'. ఆర్యన్‌సుభాన్ ఎస్.కే దర్శకత్వం వహిస్తుండగా, జగదీశ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఇటీవలే పూర్తయింది. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ "త్వరలోనే కానిస్టేబుల్ పాత్రతో.. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో మీ ముందుకు వస్తున్నాను" అని చెప్పారు. "అద్భుతమైన కథ, ఆకట్టుకునే కథనం కుదిరిన సినిమా ఇది" అని నిర్మాత జగదీశ్ అన్నారు. "ఈ సినిమాలో వరుణ్ సందేశ్ నట విశ్వరూపం చూస్తారు" అని దర్శకుడు ఆర్యన్ సుభాన్ ఎస్.కే అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: వరప్రసాద్, కెమెరామెన్: హజరత్ షేక్, సంగీతం: సుభాశ్‌ఆనంద్.



తెలుగు నిర్మాతల హిందీ చిత్రం

టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమయ్యాయి. ఈ రెండు సంస్థలు కలసి సన్నీడియోల్ కథానాయకుడిగా ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, టి.జి విశ్వప్రసాద్ నిర్మాతలు. తెలుగు దర్శకుడు గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్నారు. డైరెక్టర్‌గా హిందీలో ఆయనకు ఇది తొలి చిత్రం. భారీ బడ్జెట్‌తో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని మేకర్స్ గురువారం లాంచ్ చేశారు. ఈ నెల 22 నుంచి రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించనున్నారు. సయామీ ఖేర్, రెజీనా కసాండ్రా కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: ఎస్ థమన్, సినిమాటోగ్రఫీ: రిషి పంజాబీ.

సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నా



దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన 'మగధీర' చిత్రంలో ప్రతినాయకుడిగా అందరినీ మెప్పించిన దేవ్‌గిల్.. ఆ తర్వాత వరుస సినిమాల్లో అవకాశాలు కొట్టేసి, అనేక సార్లు ప్రతినాయకుడి పాత్రలు పోషించారు. ప్రస్తుతం ఆయన లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'అహో విక్రమార్క'. 'మా అబ్బాయి', 'రంగుల రాట్నం' ఫేమ్ చిత్ర శుక్లా హీరోయిన్‌గా నటిస్తున్నారు. పేట త్రికోటి దర్శకత్వంలో ఆర్తి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గురువారం సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దేవ్‌గిల్ మాట్లాడుతూ "నన్ను ఇంతవరకూ మీరందరూ విలన్ పాత్రల్లోనే చూశారు. కానీ మీ అందరికీ ఈ సినిమాతో నేను సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నాను" అని చెప్పారు. "టెక్నికల్‌గా ఈ చిత్రం అద్భుతంగా ఉంటుంది" అని దేవ్‌గిల్ భార్య, నిర్మాత ఆర్తి అన్నారు. "మంచి సినిమా చేశాం. ప్రేక్షకులందరూ ఈ సినిమాను ఆదరించాలి" అని దర్శకుడు పేట త్రికోటి కోరారు.

బంగ్లా, కివీస్‌లతో టెస్టులు

- ఇంగ్లండ్‌తో టీ20, వన్డేలు
- హైదరాబాద్‌లో టీ20
- టీమిండియా బిజీ షెడ్యూల్



న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్ ముగిశాక భారత జట్టు సొంత గడ్డపై సెప్టెంబరు నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు మూడు ఫార్మాట్ల క్రికెట్‌తో బిజీ బిజీగా గడపనుంది. ముందుగా బంగ్లాదేశ్‌తో సెప్టెంబరు 19 నుంచి అక్టోబరు 1 వరకు చెన్నై, కాన్పూర్‌లలో రెండు టెస్టులను.. అలాగే అక్టోబరు 6 నుంచి 12 వరకు ధర్మశాల, న్యూఢిల్లీ, హైదరాబాద్‌లలో మూడు టీ20 మ్యాచ్‌లను ఆడనుంది. ఆ తర్వాత న్యూజిలాండ్ జట్టుతో అక్టోబరు 16 నుంచి నవంబరు 5 వరకు మూడు టెస్టులు (బెంగళూరు, పుణె, ముంబై) ఆడబోతోంది. అనంతరం వచ్చే ఏడాది ఇంగ్లండ్ జట్టు భారత పర్యటనకు రానుంది. వీరితో జనవరి 22 నుంచి ఫిబ్రవరి 2 వరకు ఐదు టీ20ల సిరీస్‌ను చెన్నై, కోల్‌కతా, రాజ్‌కోట్, పుణె, ముంబైలలో ఆడనుండగా.. ఫిబ్రవరి 6-12 మధ్య మూడు వన్డేలను నాగ్‌పూర్, కటక్, అహ్మదాబాద్ వేదికలపై తలపడనుంది.

- బంగ్లాతో: 2 టెస్టులు, 3 టీ20లు
- న్యూజిలాండ్‌తో: 3 టెస్టులు
- ఇంగ్లండ్‌తో: 5 టీ20లు, 3 వన్డేలు

బాదేసిన సాల్ట్, బెయిర్‌స్టో

- ఇంగ్లండ్ శుభారంభం
- 8 వికెట్లతో వెస్టిండీస్ చిత్తు



ఫిల్ సాల్ట్ (47 బంతుల్లో 87 నాటౌట్)

గ్రాస్ ఐస్‌లెట్ (సెయింట్ లూసియా): డిఫెండింగ్ చాంప్ ఇంగ్లండ్ ఎట్టకేలకు టీ20 వరల్డ్‌కప్‌లో జోరందుకొంది. క్లిష్టంగా తొలి రౌండ్‌ను దాటిన బట్లర్ సేన.. సూపర్-8లో మాత్రం ధనాధన్ ఆటతో విరుచుకుపడింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (47 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 87 నాటౌట్) దూకుడైన అర్ధశతకంతో.. గురువారం జరిగిన గ్రూప్-2 మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను 8 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 180/4 స్కోరు చేసింది. ఓపెనర్లు బ్రండన్ కింగ్ (23 రిటైర్డ్ హర్ట్), చార్లెస్ (38)తోపాటు పూరన్ (36), రోవ్‌మన్ పావెల్ (36)కు చక్కని ఆరంభాలు దక్కినా.. భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. రస్సెల్ (1) విఫలం కావడంతో.. డెత్ ఓవర్లలో విండీస్ ఆశించిన స్థాయిలో స్కోరు చేయలేక పోయింది. అయితే, రూథర్‌ఫోర్డ్ (28 నాటౌట్), షెపర్డ్ (5 నాటౌట్) టీమ్ స్కోరును 180 మార్క్‌కు చేర్చారు. ఇంగ్లండ్ బౌలర్లు ఆర్చర్, రషీద్, మొయిన్ అలీ, లివింగ్‌స్టోన్‌లు తలో వికెట్ మాత్రమే పడగొట్టినా.. 51 డాట్ బాల్స్‌తో పరుగులను నియంత్రించారు. అనంతరం ఛేదనలో ఇంగ్లండ్ 17.3 ఓవర్లలో 2 వికెట్లకు 181 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు సాల్ట్, బట్లర్ (25) తొలి వికెట్‌కు 46 బంతుల్లో 67 పరుగులతో అదిరే ఆరంభాన్నిచ్చారు. దీంతో ఇంగ్లండ్ 13 ఓవర్లలో 111/2తో నిలిచింది. విజయానికి 42 బంతుల్లో 70 పరుగులు కావాల్సిన సమయంలో.. సాల్ట్, బెయిర్‌స్టో (26 బంతుల్లో 48 నాటౌట్) పవర్‌హిట్టింగ్‌తో విరుచుకుపడ్డారు. ఈ జోడీ మూడో వికెట్‌కు అజేయంగా 44 బంతుల్లో 97 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో ఇంగ్లండ్ మరో 15 బంతులు మిగిలుండగానే గెలుపు గీత దాటింది.

పాయింట్ల పట్టిక — గ్రూప్-2

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
ఇంగ్లండ్	1	1	0	0	2	1.343
సౌతాఫ్రికా	1	1	0	0	2	0.900
అమెరికా	1	0	1	0	0	-0.900
వెస్టిండీస్	1	0	1	0	0	-1.343

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

సంక్షిప్త స్కోర్లు: **వెస్టిండీస్:** 20 ఓవర్లలో 180/4 (చార్లెస్ 38, పూరన్ 36; రషీద్ 1/21, ఆర్చర్ 1/34). **ఇంగ్లండ్:** 17.3 ఓవర్లలో 181/2 (సాల్ట్ 87 నాటౌట్, బెయిర్‌స్టో 48 నాటౌట్; చేజ్ 1/19).

భారత్ సూపర్ బోణీ

సూర్యకుమార్ అర్ధసెంచరీ

బుమ్రా స్పెల్ అదుర్స్ ● అఫ్ఘానిస్థాన్ చిత్తు ● టీ20 వరల్డ్‌కప్



సూర్యకుమార్ (28 బంతుల్లో 53)

బుమ్రా (4-1-7-3)

బ్రిడ్జిటౌన్: టీ20 వరల్డ్‌కప్‌లో టీమిండియా అజేయ ఆట తీరు కొనసాగుతోంది. ఓటమనేదే లేకుండా గ్రూప్ దశను దాటిన రోహిత్ సేన.. కీలక సూపర్-8లోనూ అదిరే బోణీ చేసింది. సూర్యకుమార్ యాదవ్ మెరుపు అర్ధసెంచరీ (28 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 53)తో ఆకట్టుకోగా.. ఆ తర్వాత స్టార్ పేసర్ బుమ్రా (4-1-7-3) సూపర్ బౌలింగ్‌తో కట్టుదిట్టం చేశాడు. దీంతో గ్రూప్ 1లో భాగంగా గురువారం అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 47 పరుగుల తేడాతో భారత్ ఘనవిజయం సాధించింది. తమ రెండో మ్యాచ్‌ను శనివారం బంగ్లాదేశ్‌తో ఆడనుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 181 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యా (24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 32), విరాట్ (24 బంతుల్లో 1 సిక్స్‌తో 24), పంత్ (11 బంతుల్లో 4 ఫోర్లతో 20) పర్వాలేదనిపించారు. రషీద్, ఫరూఖీలకు మూడేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో అఫ్ఘాన్ 20 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. అజ్మతుల్లా ఒమర్జాయ్ (26), జద్రాన్ (19) మాత్రమే రాణించారు. అర్ష్‌దీప్‌నకు మూడు, కుల్దీప్‌నకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సూర్యకుమార్ నిలిచాడు.

బౌలర్ల కట్టడి: ఈ పిచ్‌పై కష్టసాధ్యమైన ఛేదన కోసం బరిలోకి దిగిన అఫ్ఘాన్ ఏ దశలోనూ విజయం వైపు సాగలేదు. భారత పేసర్లు, స్పిన్నర్ల ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. ముఖ్యంగా బుమ్రా 20 డాట్ బాల్స్‌తో బెంబేలెత్తించాడు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ గుర్బాజ్ (11) 4,6తో దూకుడు చూపినా, తను రెండో ఓవర్‌లోనే బుమ్రా చేతికి చిక్కాడు. ఆ తర్వాత ఇబ్రహీం జద్రాన్ (8)ను అక్షర్.. మరో ఓపెనర్ హజ్రతుల్లా (2)ను బుమ్రానే అవుట్ చేయడంతో పవర్‌ప్లేలో అఫ్ఘాన్ 35/3 స్కోరుతో నిలిచింది. ఈ స్థితిలో అజ్మతుల్లా ఒమర్జాయ్, నయీబ్ (17) నాలుగో వికెట్‌కు 44 పరుగులు జోడించి ఆశలు రేపారు. కానీ ఈ ఇద్దరినీ వరుస ఓవర్లలో కుల్దీప్, జడేజా పెవిలియన్‌కు చేర్చారు. అప్పటికి స్కోరు 71/5. 16వ ఓవర్‌లో బుమ్రా నజీబుల్లాను అవుట్ చేయడంతో ఆరో వికెట్‌కు నబీ (14)తో కలిసి చేసిన 31 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం పేసర్ అర్ష్‌దీప్ ధాటికి టెయిలెండర్లు టపటపా పెవిలియన్‌కు చేరడంతో అఫ్ఘాన్ ఓటమి ఖరారైంది.

సూర్య-హార్దిక్ అండగా..: టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకోగా.. ఆరంభంలో పరుగులు లభించడం కష్టమైంది. అయితే మధ్య ఓవర్లలో సూర్యకుమార్, హార్దిక్ ధాటిగా ఆడడంతో జట్టు సవాల్ విసిరే స్కోరందుకుంది. కానీ డెత్ ఓవర్లలో టపటపా వికెట్లను కోల్పోవడం జట్టు భారీ స్కోరుపై ప్రభావం పడింది. ఓపెనర్లు రోహిత్ (8), విరాట్‌లను అఫ్ఘాన్ బౌలర్లు ఇబ్బందిపెట్టారు. లెఫ్టామ్ పేస్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో రోహిత్ వైఫల్యం ఈసారి కూడా బయటపడింది. మూడో ఓవర్‌లోనే రోహిత్‌ను ఫరూఖి పెవిలియన్‌కు చేర్చి షాకిచ్చాడు. తన చివరి రెండు మ్యాచ్‌ల్లోనూ శర్మ 13, 3తో నిరాశ పరిచాడు. అయితే ఐదో ఓవర్‌లో విరాట్ సిక్సర్.. ఆరో ఓవర్‌లో పంత్ హ్యాట్రిక్ ఫోర్లతో జట్టు పవర్‌ప్లేలో 47/1 స్కోరు సాధించగలిగింది. ఈ ఇద్దరూ కుదురుకుంటే భారీ స్కోరు ఖాయమనిపించినా.. స్పిన్నర్ రషీద్ ఖాన్ వరుస ఓవర్లలో భారత్‌ను వణికించాడు. స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపిస్తున్న పంత్‌ను మొదట ఏడో ఓవర్‌లో అవుట్ చేయగా రెండో వికెట్‌కు 43 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత విరాట్, శివమ్ దూబే (10)ల పనిబట్టడంతో భారత్ 90 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో సూర్యకుమార్, హార్దిక్ అఫ్ఘాన్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. 13వ ఓవర్‌లో సూర్య రెండు ఫోర్లు బాదాడు. ఇందులో తక్కువ ఎత్తులో వేసిన ఓ వైడ్ బంతిని స్క్వేర్ లెగ్ వైపు ఫోర్‌గా మల్చడం అబ్బురపరిచింది. అటు హార్దిక్ 16వ ఓవర్‌లో 4,6తో జోరు చూపాడు. తర్వాతి ఓవర్‌లోనే సూర్య 6,4తో 26 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నప్పటికీ ఆ వెంటనే వెనుదిరిగాడు. దీంతో ఐదో వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు హార్దిక్ సైతం 18వ ఓవర్‌లో సిక్సర్ బాది నవీనుల్ చేతికి చిక్కాడు. జడేజా (7) విఫలం కాగా, ఆఖరి ఓవర్‌లో అక్షర్ (12) రెండు ఫోర్లతో జట్టు స్కోరు 180 దాటింది.

1 — టీ20ల్లో భారత్ తరఫున ఎక్కువ పరుగులు (4066) చేసిన విరాట్, రోహిత్ (4050)ను అధిగమించాడు. ఓవరాల్‌గా బాబర్ ఆజమ్ (4145) టాప్‌లో ఉన్నాడు.

స్కోరుబోర్డు

భారత్: రోహిత్ (సి) రషీద్ (బి) ఫరూఖి 8, కోహ్లీ (సి) నబీ (బి) రషీద్ 24, పంత్ (ఎల్బీ) రషీద్ 20, సూర్యకుమార్ (సి) నబీ (బి) ఫరూఖి 53, శివమ్ దూబే (ఎల్బీ) రషీద్ 10, హార్దిక్ (సి) అజ్మతుల్లా (బి) నవీనుల్ 32, జడేజా (సి) గుల్బదిన్ (బి) ఫరూఖి 7, అక్షర్ (రనౌట్) 12, అర్ష్‌దీప్ (నాటౌట్) 2 ; **ఎక్స్‌ట్రాలు : 13 ; మొత్తం 20 ఓవర్లలో 181/8 ; వికెట్లపతనం :** 1-11, 2-54, 3-62, 4-90, 5-150, 6-159, 7-165, 8-181 ; **బౌలింగ్:** ఫరూఖి 4-0-33-3, మహ్మద్ నబి 3-0-24-0, నవీనుల్ 4-0-40-1, రషీద్ 4-0-26-3, నూర్ అహ్మద్ 3-0-30-0, అజ్మతుల్లా 2-0-23-0.

అఫ్ఘానిస్థాన్: రహ్మనుల్లా (సి) పంత్ (బి) బుమ్రా 11, హజ్రతుల్లా (సి) జడేజా (బి) బుమ్రా 2, ఇబ్రహీం జద్రాన్ (సి) రోహిత్ (బి) అక్షర్ 8, నైబ్ (సి) పంత్ (బి) కుల్దీప్ 17, అజ్మతుల్లా (సి) అక్షర్ (బి) జడేజా 26, నజీబుల్లా (సి) అర్ష్‌దీప్ (బి) బుమ్రా 19, నబీ (సి) జడేజా (బి) కుల్దీప్ 14, రషీద్ (సి) జడేజా (బి) అర్ష్‌దీప్ 2, నూర్ అహ్మద్ (సి) రోహిత్ (బి) అర్ష్‌దీప్ 12, నవీనుల్ (సి) పంత్ (బి) అర్ష్‌దీప్ 0, ఫరూఖి (నాటౌట్) 4 ; **ఎక్స్‌ట్రాలు : 19 ; మొత్తం 20 ఓవర్లలో 134 ఆలౌట్ ; వికెట్లపతనం :** 1-13, 2-23, 3-23, 4-67, 5-71, 6-102, 7-114, 8-121, 9-121 ; **బౌలింగ్ :** అర్ష్‌దీప్ 4-0-36-3, బుమ్రా 4-1-7-3, అక్షర్ 3-1-15-1, హార్దిక్ 2-0- 13-0, కుల్దీప్ 4-0-32-2, జడేజా 3-0-20-1.

నల్ల రిబ్బన్లతో బరిలోకి..

అఫ్ఘాన్‌తో సూపర్-8 మ్యాచ్ సందర్భంగా టీమిండియా ఆటగాళ్లంతా తమ భుజాలకు నల్ల రిబ్బన్లు ధరించి బరిలోకి దిగారు. మాజీ పేసర్ డేవిడ్ జాన్సన్ గురువారం మృతి చెందగా.. అతడికి ఘనంగా నివాళి అర్పించేందుకు టీమ్ మేనేజ్‌మెంట్ ఈ నిర్ణయం తీసుకుంది.

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

ఆస్ట్రేలియా x బంగ్లాదేశ్ (ఉ.6. గం.)

ఇంగ్లండ్ x దక్షిణాఫ్రికా (రా.8. గం.)

భారత జట్టులో షబ్నమ్



విశాఖపట్నం (స్పోర్ట్స్): దక్షిణాఫ్రికాతో ప్రస్తుతం భారత్ వేదికగా జరుగుతున్న పర్యటనలోని మిగిలిన మ్యాచ్‌లకు విశాఖకు చెందిన 17 ఏళ్ల పేస్‌బౌలర్ షబ్నమ్ షకీల్‌కు చోటు దక్కింది. ఈ సిరీస్‌లో ఇప్పటి వరకూ జరిగిన రెండు వన్డేల్లోనూ భారత్ విజయం సాధించింది. సిరీస్‌లో ఇంకా ఒక వన్డే, ఒక టెస్టు, మూడు టీ20లు జరగాల్సివుంది. అయితే షబ్నమ్ ఈ మూడు ఫార్మాట్లకూ ఎంపిక కావడం విశేషం. ఆంధ్రనుంచి ఇలా అరంగేట్రంలోనే మూడు ఫార్మాట్లకూ ఎంపికైన క్రికెటర్ షబ్నమ్ మాత్రమే.

టీమిండియా మాజీ పేసర్ జాన్సన్ అనుమానాస్పద మృతి



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): భారత జట్టు మాజీ పేసర్ డేవిడ్ జాన్సన్ (52) అనుమానాస్పద పరిస్థితుల్లో గురువారం మరణించాడు. కొత్తనూరులోని కనకశ్రీ లేఅవుట్‌లో తాను నివసిస్తున్న అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్తు బాల్కనీనుంచి కిందపడి మృతి చెందినట్టు పోలీసులు వెల్లడించారు. అయితే అతడు ఆత్మహత్య చేసుకొన్నాడనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. జాన్సన్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. జాన్సన్ గతవారం కడుపునొప్పితో ఆసుపత్రిలో చేరినట్టు తెలిసింది. జాన్సన్ తన ఇంటికి సమీపంలో ఓ క్రికెట్ కోచింగ్ సెంటర్ నడుపుతున్నట్టు తెలుస్తోంది. అయితే అది సరిగా నడవకపోవడంతో ఆర్థిక సమస్యలు ఏర్పడినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్న అతడు డీ అడిక్షన్ కేంద్రంలో చికిత్స కూడా తీసుకుంటున్నట్టు ఓ పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. భారత్ తరఫున రెండు టెస్టులాడాడు. 1996లో ఢిల్లీలో ఆస్ట్రేలియాపై టెస్ట్ అరంగేట్రం చేశాడు. అందులో ఓ వికెట్ సాధించాడు. అనంతరం సౌతాఫ్రికాలో ఆ జట్టుపై తన రెండో టెస్ట్ ఆడాడు. ఆ మ్యాచ్‌లో 2 వికెట్లు పడగొట్టాడు. జాన్సన్ మృతికి బీసీసీఐ కార్యదర్శి జైషా, అనిల్ కుంబ్లే, గౌతమ్ గంభీర్ సంతాపం తెలిపారు.

జింబాబ్వే టూర్‌కు కోచ్‌గా లక్ష్మణ్?

న్యూఢిల్లీ: టీమిండియా జింబాబ్వే పర్యటనకు ఎన్‌సీఏ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్ కోచ్‌గా వ్యవహరించే అవకాశముంది. వచ్చే నెల 6 నుంచి హరారేలో జింబాబ్వేతో భారత్ ఐదు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. ఈ నెల 22 లేదా 23న జింబాబ్వే టూర్‌కు జట్టును ఎంపిక చేసే అవకాశం ఉంది. టీ20 వరల్డ్‌కప్‌తో కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ కాంట్రాక్ట్ ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త కోచ్ కోసం బీసీసీఐ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

బిజినెస్



విమానయానంలో భారత్ నంబర్ 3

పదేళ్లలో రెండు స్థానాలు పైకి

న్యూఢిల్లీ: దేశంలో విమానయానం జోరందుకుంది. దేశీయ విమానయానంలో భారత్ ప్రపంచంలో మూడో స్థానానికి చేరింది. పది సంవత్సరాల క్రితం ఐదో స్థానంలో ఉన్న భారత్ రెండు స్థానాలు ఎగబాకింది. ఓఏజీ విశ్లేషణలో ఈ విషయం వెల్లడయింది. 2014 ఏప్రిల్ నుంచి దశాబ్ది కాలంలో దేశీయ విమానయాన సంస్థల సామర్థ్యం రెట్టింపై 79 లక్షల నుంచి 1.55 కోట్లకు చేరింది. భారత్ మూడో స్థానానికి చేరడంతో బ్రెజిల్ 97 లక్షల సామర్థ్యంతో నాలుగో స్థానానికి, ఇండోనేషియా 92 లక్షల సామర్థ్యంతో ఐదో స్థానానికి దిగజారాయి. అయితే 8.61 కోట్ల సామర్థ్యంతో అమెరికా, 6.78 కోట్ల సామర్థ్యంతో చైనా తొలి రెండు స్థానాల్లో చెక్కు చెదరకుండా నిలిచాయి. భారతదేశం సామర్థ్యాల జోడింపులో మాత్రం 6.9 శాతం సగటు వార్షిక వృద్ధితో టాప్ 5 దేశాల్లో అగ్రగామిగా ఉంది. సగటు వార్షిక సామర్థ్యాల జోడింపులో 6.3 శాతంతో చైనా, 2.4 శాతంతో అమెరికా, 1.1 శాతంతో ఇండోనేషియా వెనుకబడి ఉండగా బ్రెజిల్‌లో ఇది 0.8 శాతం క్షీణించింది.

ఇండిగో మార్కెట్ వాటా జూమ్: తక్కువ ధరల విమానయాన సంస్థలకు (ఎల్‌సీసీ) పరివర్తన విషయంలో టాప్ 5 దేశాల్లో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. ఇండిగో ఎల్‌సీసీ వృద్ధికి ఆలంబనగా ఉంది. గత 10 సంవత్సరాల కాలంలో ఇండిగో మార్కెట్ వాటా రెట్టింపై 32 శాతం నుంచి 62 శాతానికి చేరింది. ఇండిగో దేశీయ సామర్థ్యాలు ఇదే కాలంలో 13.9 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేశాయి. ఇండిగో, ఎయిరిండియా విదేశాలకు విస్తరించేందుకు పటిష్ఠమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నాయని ఓఏజీ అంటోంది. ఇండిగో ఆర్డర్ చేసిన 982 విమానాల్లో 96 శాతం, ఎయిరిండియా ఆర్డర్ చేసిన 447 విమానాల్లో 74 శాతం నారో బాడీ విమానాలేనని ఆ నివేదిక తెలిపింది. అయితే ఈ వృద్ధికి ఊతం ఇవ్వగల విమానాశ్రయాలు భారత్‌కు ఉన్నాయా అనేది ప్రశ్నార్థకమని పేర్కొంది. దేశీయ విమానాల రాకపోకలకు అవకాశం ఉన్న విమానాశ్రయాలు అమెరికాలో 656, చైనాలో 250 ఉండగా భారత్‌లో 119 మాత్రమే ఉన్నట్టు తెలిపింది. ప్రస్తుతం దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య 15.5 కోట్లుండగా 2030 నాటికి 35 కోట్లకు పెరుగుతుందని ఇండిగో అంచనా.

యూనికార్న్ ఆశలు గల్లంతు

హురున్ భవిష్యత్ యూనికార్న్‌ల జాబితా నుంచి 25 స్టార్టప్‌లు అవుట్

పెట్టుబడుల కొరత, నియంత్రణ చర్యలే కారణం



ముంబై: యూనికార్న్ హోదా సాధించాలన్న దేశీయ స్టార్టప్‌ల ఆశలు గల్లంతవుతున్నాయి. అంతర్జాతీయ అనిశ్చితుల కారణంగా స్టార్టప్‌ల్లోకి కొత్త పెట్టుబడులు దాదాపుగా నిలిచిపోవడంతో పాటు ఈ రంగంపై ఆర్థిక నియంత్రణ మండలుల చర్యలు, వేల్యువేషన్ పెంపునకు బదులు లాభదాయకతపై దృష్టి సారించాలని ఇన్వెస్టర్లు పట్టుబడుతుండటం ఇందుకు ప్రధాన కారణాలట. గురువారం విడుదలైన 'ఆస్క్ ప్రైవేట్ వెల్త్ హురున్ ఇండియన్ ఫ్యూచర్ యూనికార్న్ ఇండెక్స్ 2024' రిపోర్టు ఈ విషయాన్ని వెల్లడించింది. కనీసం బిలియన్ డాలర్ల (100 కోట్ల డాలర్లు= రూ.8,350 కోట్లు) మార్కెట్ విలువ కలిగిన స్టార్టప్‌లను యూనికార్న్‌లుగా పిలుస్తారు. గత ఏడాది దేశంలో 68 యూనికార్న్‌లు ఉండగా.. ఈ ఏడాదిలో ఆ సంఖ్య 67కు తగ్గింది. అంతేకాదు, భవిష్యత్‌లో యూనికార్న్‌లుగా ఎదిగేందుకు అవకాశాలున్న స్టార్టప్‌ల జాబితాలో ఏకంగా 25 స్టార్టప్‌లు స్థానం కోల్పోయాయి. మూడేళ్లలో యూనికార్న్‌లుగా ఎదిగేందుకు అవకాశాలున్న, 50 కోట్ల డాలర్లకు పైగా విలువైన 5 స్టార్టప్‌లు సైతం అందులో ఉన్నాయని నివేదిక వెల్లడించింది.

ఈ ఏడాది ప్రథమార్ధంలో టెక్ స్టార్టప్‌ల్లోకి 410 కోట్ల డాలర్ల పెట్టుబడులు

ఈ ఏడాది ప్రథమార్ధంలో దేశీయ టెక్నాలజీ స్టార్టప్‌లు మొత్తం 410 కోట్ల డాలర్ల పెట్టుబడులను సమీకరించగలిగాయని మార్కెట్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ ట్రాక్సాన్ తాజా నివేదిక వెల్లడించింది. ప్రపంచవ్యాప్త టెక్ స్టార్టప్‌ల విభాగంలో అత్యధిక ఫండింగ్ లభించిన దేశాల్లో అమెరికా, యూకే, చైనా తర్వాత భారత్ నాలుగో స్థానంలో నిలిచిందని రిపోర్టు తెలిపింది. అయితే, గత ఏడాది ప్రథమార్ధంలో సేకరించిన 480 కోట్ల డాలర్లతో పోలిస్తే ఈ ఏడాది ఆరు నెలల్లో పెట్టుబడులు 13 శాతం తగ్గాయి. 2023 ద్వితీయార్ధంలో (జూలై-డిసెంబరు) సేకరించిన 396 కోట్ల డాలర్ల పెట్టుబడితో పోలిస్తే మాత్రం 4 శాతం పెరిగాయని రిపోర్టు పేర్కొంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,440 ▲	66,400 ▲	97,100 ▲
ముంబై	72,160 ▲	66,100 ▲	90,040 ▲

స్విస్ బ్యాంక్‌ల్లో భారతీయుల సొమ్ము నాలుగేళ్ల కనిష్ఠం

గత ఏడాది 70% తగ్గి రూ.9,771 కోట్లకు పరిమితం

స్విట్జర్లాండ్ సెంట్రల్ బ్యాంక్ వార్షిక నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ/జ్యూరిక్: నల్లధనానికి స్వర్గసీమగా పేరుగాంచిన స్విట్జర్లాండ్ బ్యాంక్‌ల్లోని భారతీయ వ్యక్తులు, సంస్థల సొమ్ము నాలుగేళ్ల కనిష్ఠ స్థాయికి తగ్గింది. స్విస్ నేషనల్ బ్యాంక్ (ఎస్ఎన్‌బీ) గురువారం విడుదల చేసిన డేటా ప్రకారం.. 2023లో స్విస్ బ్యాంక్‌ల్లోని మనోళ్ల సొమ్ము 70 శాతం తగ్గి 104 కోట్ల స్విస్ ఫ్రాంక్‌లకు (సుమారు రూ.9,711 కోట్లు) జారుకుంది. ఈ బ్యాంక్‌ల్లో భారతీయుల సొమ్ము తగ్గడం వరుసగా ఇది రెండో ఏడాది. 2021లో మాత్రం మనోళ్ల నిధులు 14 ఏళ్ల గరిష్ఠ స్థాయి 383 కోట్ల స్విస్ ఫ్రాంక్స్‌కు పెరిగినప్పటికీ.. గడిచిన రెండేళ్లలో బాండ్లు, సెక్యూరిటీలు, ఇతర ఆర్థిక సాధనాల రూపంలో ఉన్న నిధులను పెద్ద ఎత్తున ఉపసంహరించుకోవడం ఇందుకు కారణమైంది. అంతేకాదు, డిపాజిట్ ఖాతాలు, ఇతర బ్యాంక్‌ల శాఖల ద్వారా మళ్లించిన నిధులను సైతం భారీగానే విత్‌డ్రా చేసుకున్నట్లు డేటా తేటతెల్లం చేసింది. స్విట్జర్లాండ్ బ్యాంక్‌లు ఎస్ఎన్‌బీకి సమర్పించిన అధికారిక లెక్కలివి. అంటే, మనోళ్లు అధికారికంగా స్విస్ బ్యాంక్‌ల్లో దాచుకున్న సొమ్మే తప్ప, నల్లధనం లెక్క కాదిది. అంతేకాదు, భారతీయులు, ప్రవాసులు, ఇతరులు ఇతర దేశాల్లోని సంస్థల ద్వారా స్విట్జర్లాండ్‌కు నిధులు మళ్లించి దాచుకున్న సొమ్ము వివరాలు కూడా ఇందులో లేవు.

ఇనోబ్యాట్‌లో అమర రాజాకు మరింత వాటా

4.5% వాటా రూ.180 కోట్లకు కొనుగోలు

న్యూఢిల్లీ: స్లొవేకియాకు చెందిన ఎలక్ట్రిక్ బ్యాటరీల తయారీ సంస్థ ఇనోబ్యాట్ ఏఎస్‌లో మరో 4.5 శాతం వాటాను 2 కోట్ల యూరోలకు (సుమారు రూ.180 కోట్లు) కొనుగోలు చేసినట్లు అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ గురువారం వెల్లడించింది. దాంతో ఇనోబ్యాట్‌లో అమర రాజా మొత్తం వాటా దాదాపు 9.32 శాతానికి పెరిగింది. గతంలో 4.8 శాతం వాటాను అమరరాజా కోటి యూరోలకు కొనుగోలు చేసింది. "ఇనోబ్యాట్‌లో మరింత వాటా కొనుగోలు ఇంధన విప్లవంలో ముందుండాలన్న మా నిబద్ధతను నొక్కి చెబుతుంది. బ్యాటరీ సాంకేతికతలో ఇనోబ్యాట్ వినూత్న విధానం వినియోగదారులకు సహేతుక, ఆధునిక ఇంధన పరిష్కారాలు అందించాలన్న మా లక్ష్యాన్ని పూర్తి చేస్తుంది" అని అమర రాజా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విక్రమాదిత్య గౌరినేని అన్నారు.

ఎలక్ట్రానిక్స్ పవర్ హౌస్‌గా ఏపీ

నారా లోకేశ్ ఆకాంక్ష



హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్ తయారీ హబ్‌గా మార్చాలన్న ఆకాంక్షను ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారని సెల్‌కాన్ గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై గురు తెలిపారు. ఐటీ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన లోకేశ్‌ను తాను అభినందించిన సందర్భంగా రాష్ట్రాన్ని ఎలక్ట్రానిక్ హబ్‌గా తీర్చి దిద్దాలన్న లక్ష్యానికి తాను పూర్తిగా కట్టుబడి ఉన్నట్టు చెప్పారన్నారు. ఇందుకు అవసరమైన వ్యూహాత్మక ప్రణాళిక రూపకల్పన కోసం త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, లోకేశ్‌లతో సమావేశం నిర్వహించాలనుకుంటున్నట్టు తెలిపారు. దేశంలో ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ పరిమాణం 2019 నాటికి 7,500 కోట్ల డాలర్లు కాగా 2024 నాటికి 11,500 కోట్ల డాలర్లకు చేరుతుందని అంచనా అని పేర్కొంటూ ఇందులో భారీ వాటా చేజిక్కించుకోవాలన్నదే తన లక్ష్యమని లోకేశ్ చెప్పారని ఆయన వెల్లడించారు. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టే చర్యలన్నింటికీ తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఇండియన్ సెల్యులార్, ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ఛైర్మన్ పంకజ్ మహీంద్రూ ప్రకటించారు. పరిశ్రమకు చంద్రబాబు పెద్ద స్ఫూర్తి అని, ఎలక్ట్రానిక్స్ తయారీలో ఆంధ్రప్రదేశ్‌కు అద్భుత అవకాశాలున్నాయని ఆయన అన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

21వ తేదీ



హైదరాబాద్	510
వరంగల్	512
చిత్తూరు	563
విజయవాడ	505
గోదావరి	495
విశాఖపట్నం	505

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	124
వరంగల్	124
కరీంనగర్	124
మహబూబ్‌నగర్	124
కర్నూలు	124
విశాఖపట్నం	136
గోదావరి	135
విజయవాడ	135
గుంటూరు	135
ఒంగోలు	135
చిత్తూరు	142
నెల్లూరు	142
అనంతపురం	135

జోయాలుక్కాస్‌లో మజూరీపై 50 శాతం డిస్కౌంట్

హైదరాబాద్: ఆభరణాల రిటైలింగ్‌లోని జోయాలుక్కాస్ తమ కస్టమర్లకు మజూరీపై 50 శాతం డిస్కౌంట్ ఆఫర్‌ను ప్రకటించింది. ఈ నెల 14 నుంచి ప్రారంభమైన ఈ ఆఫర్ జూలై 14 వరకు అందుబాటులో ఉంటుంది. బంగారం, వెండి, వజ్రాభరణాలు, వజ్రాలు అన్నింటికీ ఈ ఆఫర్ వర్తిస్తుంది. 10 లక్షలకు పైగా డిజైన్లతో గల అద్భుత శ్రేణిలో తమకు నచ్చిన ఆభరణాలను కస్టమర్లు ఈ ఆఫర్ ద్వారా కొనుగోలు చేసుకోవచ్చునని కంపెనీ ఛైర్మన్ జోయాలుక్కాస్ అన్నారు. దేశంలోని అన్ని షోరూమ్‌లలోనూ ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని చెప్పారు.

కొనసాగిన రికార్డుల పరంపర

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో రికార్డుల పరంపర కొనసాగుతోంది. సెన్సెక్స్, నిఫ్టీ గురువారం మరో సరికొత్త గరిష్ఠ స్థాయిల వద్ద ముగిశాయి. సెన్సెక్స్ 141.34 పాయింట్ల లాభంతో 77,478.03 వద్ద ముగియగా నిఫ్టీ 51 పాయింట్ల లాభంతో 23,567 వద్ద ముగిసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు వంటి ఇండెక్స్ హెవీ వెయిట్ షేర్లలో భారీ కొనుగోళ్లు ఇందుకు ప్రధానంగా దోహదం చేశాయి. సెన్సెక్స్ గత ఆరు రోజుల్లోనే 1,022.34 పాయింట్లు దూసుకు పోయింది.

ఎఫ్ అండ్ ఓ లాభాలపై అధిక పన్ను పోటు!

న్యూఢిల్లీ: ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) ట్రేడింగ్ చేసే వారికి వచ్చే కేంద్ర బడ్జెట్ షాకివ్వబోతోంది. ఈ లావాదేవీలపై కేంద్ర ఆర్థికమంత్రి పెద్ద మొత్తంలో పన్ను విధించబోతున్నట్టు సమాచారం. నూటికి 90 శాతం మంది ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌తో చేతులు కాల్చుకుంటున్నట్టు సెబీనే చెప్పి, రిటైల్ మదుపరులు దీని జోలికి పోవద్దని సలహా ఇచ్చింది. అయినా పరిస్థితిలో పెద్దగా మార్పు లేదు. దీంతో ఈ ట్రేడింగ్ ద్వారా వచ్చే లాభాలపై అధిక పన్ను విధించాలని ఆర్థిక మంత్రి యోచిస్తున్నట్టు చెబుతున్నారు. ఇందుకు వీలుగా ఎఫ్ అండ్ ఓ ద్వారా లభించే లాభాలను 'వ్యాపార ఆదాయం'గా కాక 'స్పెక్యులేటివ్ ఆదాయం'గా పరిగణించబోతున్నట్టు తెలుస్తోంది. ఇదే జరిగితే రిటైల్ ఇన్వెస్టర్లతో పాటు, ట్రేడర్లూ ఈ ట్రేడింగ్‌లోకి పెద్దగా వెళ్లక పోవచ్చని భావిస్తున్నారు.



గడ్కరీతో కిషన్ రెడ్డి భేటీ..

న్యూఢిల్లీ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి భేటీ అయ్యారు. గురువారం ఢిల్లీలోని గడ్కరీ కార్యాలయానికి వెళ్లి కిషన్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణకు సంబంధించిన పలు ప్రాజెక్టుల గురించి ఆయనతో చర్చించారు. రాష్ట్రంలోని జాతీయ రహదారులు, వివిధ ప్రాజెక్టుల పురోగతి, తదుపరి కార్యాచరణపై మాట్లాడారు.

బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలి

» నిధుల విడుదలపై సీఎం స్పందించాలి: రమణాచారి

హైదరాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి) : బ్రాహ్మణుల సమస్యల పరిష్కారంపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టాలని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ మాజీ చైర్మన్ కేవీ రమణాచారి కోరారు. గత ప్రభుత్వం వివిధ పథకాల కింద బ్రాహ్మణులకు మంజూరు చేసిన నిధులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ స్కీంలో భాగంగా విదేశాలకు వెళ్లి చదువుతున్న బ్రాహ్మణ విద్యార్థులు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు సకాలంలో నిధులు కేటాయించాలని కోరుతూ త్వరలోనే సీఎంను కలిసే ప్రయత్నం చేస్తామన్నారు.

ఎరువుల సరఫరా పారదర్శకంగా జరగాలి: తుమ్మల

హైదరాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎరువుల సరఫరా పారదర్శకంగా జరగాలని, పూర్తిగా ఈ-పాస్ వ్యవస్థ ద్వారా అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఫెర్టిలైజర్ దుకాణాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి నిల్వలను పరిశీలించాలన్నారు. డీలర్లు నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేస్తే వారిపై చర్యలు తీసుకోవాలని, అధికారుల తప్పిదాలున్నా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 'వ్యవసాయశాఖ ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టమ్ (ఫైవ్స్) ఆధారంగా వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించాలి. వానాకాలం సీజన్‌కు సంబంధించి రాష్ట్రానికి 10.40 లక్షల టన్నుల యూరియా, 2.40 లక్షల టన్నుల డీఏపీ, 10 లక్షల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 60 వేల టన్నుల ఎంవోపీని కేంద్రం కేటాయించింది. జూలై చివరినాటికి 5.65 లక్షల టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటికే 8.35 లక్షల టన్నులు, 1.57 లక్షల టన్నుల డీఏపీకిగాను 1.47 లక్షల టన్నులు, 1.30 లక్షల టన్నుల కాంప్లెక్స్ ఎరువులకుగాను 5.30 లక్షల టన్నులు, 38 వేల ఎంవోపీకిగాను 26 వేల టన్నులు అందుబాటులోకి తెచ్చాం' అని మంత్రి తెలిపారు. కాగా రాష్ట్రానికి ఆగస్టు నెల వరకు రావాల్సిన ఎరువుల కోటాను ఇప్పుడే విడుదల చేయాలని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకు మంత్రి తుమ్మల లేఖ రాశారు.

ఎర్రబెల్లి.. కాంగ్రెస్‌లోకి?

కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నాలు.. గతాన్ని మరిచి కలిసిపోదామని రాయబారం?



» సీఎం సానుకూలంగా స్పందించినట్లు ప్రచారం

» ఎర్రబెల్లిని చేర్చుకోవద్దని.. పలువురి ఒత్తిడి

వరంగల్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి వరంగల్ జిల్లా సీనియర్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు చేరికకు సీఎం రేవంత్ ఓకే చెప్పారా? బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేయాలన్న లక్ష్యాన్ని చేరుకునేందుకు గతాన్ని మరిచి అంగీకరించారా? అంటే అవుననే సమాధానం వస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లో ఇది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గతంలో టీడీపీలో కలిసి పని చేసిన ఎర్రబెల్లి దయాకర్‌రావు, రేవంత్‌రెడ్డి మధ్య నోటుకు ఓటు కేసు సమయంలో విభేదాలు తలెత్తాయి. నాటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఎర్రబెల్లి టీడీపీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరి, ఐదేళ్లు మంత్రిగా పని చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. రాష్ట్రాన్ని కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎర్రబెల్లి ప్రమేయం ఉందనే ప్రచారం జరిగింది. ఇక వరుస ఓటములతో బీఆర్‌ఎస్ కేడర్ నైరాశ్యంలో ఉండగా.. కీలక నేతలు తలోదారి చూసుకుంటున్నారు. కాంగ్రెస్ కూడా ఇదే అదనుగా బీఆర్‌ఎస్‌లోని కీలక నేతలను చేర్చుకునేందుకు పావులు కదుపుతోంది. ఈ నేపథ్యంలో తొలుత ఇద్దరు మంత్రులతోపాటు ఐదారుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి ఎర్రబెల్లిని తీసుకొచ్చేందుకు సంప్రదింపులు జరిపినా.. సీఎం రేవంత్ వ్యతిరేకించారని సమాచారం. ఇటీవల స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరటమే కాకుండా తన కూతురు కడియం కావ్యను వరంగల్ ఎంపీగా గెలిపించుకున్నారు. కడియం పార్టీని వీడటంతో ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఎర్రబెల్లి దయాకర్‌రావు జిల్లాలో బీఆర్‌ఎస్‌కు పెద్ద దిక్కుగా నిలిచారు. అలాంటి దయాకర్‌రావును పార్టీలో చేర్చుకుంటే ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేయవచ్చన్న ఆలోచనతో కాంగ్రెస్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డి వద్ద ఎర్రబెల్లి చేరిక విషయాన్ని ప్రస్తావించారని తెలిసింది. అయితే, అప్పటికే ఎర్రబెల్లి.. కొందరు నేతల ద్వారా సీఎం రేవంత్ రెడ్డికి రాయబారం పంపినట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో జరిగింది వదిలేయాలని, అప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో అలా జరిగిందని, భవిష్యత్తులో ఎర్రబెల్లి ఉపయోగపడుతారని సదరు నేతలు పేర్కొనగా.. రేవంత్ కూడా సమ్మతించినట్లు తెలుస్తోంది. కాగా, వరంగల్‌లోని ఇద్దరు, ముగ్గురు నేతలు మాత్రం ఎర్రబెల్లిని పార్టీలో చేర్చుకోవద్దని సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. మంత్రి కొండా సురేఖ, మురళి దంపతులతో ఎర్రబెల్లికి దీర్ఘకాలంగా రాజకీయ వైరం ఉంది. వారితో పాటు ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేలు కూడా ఆయన చేరికను వ్యతిరేకిస్తున్నట్టు చర్చ జరుగుతోంది. మరోవైపు.. ఎర్రబెల్లిని కాంగ్రెస్‌లోకి తీసుకొచ్చేందుకు కీలక నేతలే ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

బీఆర్‌ఎస్‌ను వీడను: ఎర్రబెల్లి

వరంగల్ జిల్లా పర్వతగిరిలో బుధవారం రాత్రి దయాకర్‌రావు ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించగా.. ఆయన పార్టీ మారేందుకే సమావేశం పెట్టారని ప్రచారం జరిగింది. అయితే, తాను కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. కొందరు కాంగ్రెస్ నేతలు కావాలనే తనను బద్నాం చేయాలని చూస్తున్నారని, ఆ పార్టీలో చేరు ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. 2028లో తెలంగాణ సీఎం అయ్యేది కేసీఆరే నని, తాను బీఆర్‌ఎస్‌ను వీడేది లేదన్నారు. పర్వతగిరిలో నిర్వహించిన సమావేశంలో లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీకి పోలైన ఓట్లపై సమీక్షించామని, మరే ఇతర అంశాలు చర్చకు రాలేదని వెల్లడించారు.

టమాటా కిలో 100

(మొదటిపేజీ తరువాయి)



రెండున్నర కిలోలు! పచ్చిమిర్చి రూ.60, కాకర రూ.65! సూపర్ మార్కెట్లలో టమాటనైతే రూ.100-110.. పచ్చిమిర్చి అయితే రూ.100-120.. ఉల్లిగడ్డ రూ.50! తాజా బీరకాయలు, క్యాప్సికమ్, పచ్చిమిర్చి, క్యారెట్‌ను సంచీలో వేసుకోవాలని మనసుకు అనిపించినా జేబు సహకరించనంటోంది! హైదరాబాద్‌లో కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. వారం క్రితం కిలో రూ40గా ఉంటే మిగతా కూరగాయలు దాదాపు రూ.40-50లోపే దొరికాయి! వారం క్రితం ధరలతో పోల్చితే రెండున్నర రెట్లు పెరిగాయి. ఎప్పుడూ అగ్గవకు దొరికే వంకాయ కూడా రూ.50కి చేరువై బాబోయ్ అనిపిస్తోంది! ఫలితంగా సామాన్య, మధ్య తరగతి ప్రజలు సరిపడా కూరగాయలు కొనలేకపోతున్నారు. కొన్నాళ్లు ఈ కూర 'గాయాల' బెడద తప్పేందుకు అటకమీదుంచిన కొత్త పచ్చళ్ల జాడీలను దించుతున్నారు. కొందరేమో వండటంలోనే జాగ్రత్తపడుతున్నారు. ఉదయం వండిన కూరలతోనే రాత్రి భోజనం కానిచ్చేస్తున్నారు! వారం లోపే కూరగాయల ధరలు ఈ స్థాయిలో ఎందుకు పెరిగినట్లు? అంటే.. ఇటీవల కురిసిన అకాలవర్షాల కారణంగా చేలల్లోని కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఫలితంగా దిగుబడి తగ్గిందని, ఆ ప్రభావంతోనే ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. ఏపీలోని మదనపల్లి నుంచి నగరానికి వచ్చే టమాటా దిగుమతి 60 శాతం తగ్గిపోయిందని రేట్లు అనివార్యంగా పెరిగాయని మార్కెట్ అధికారులు చెబుతున్నారు. కాగా కూరగాయల ధరల పెరుగుల ప్రభావం హోటళ్లపై పడింది. వివిధ టిఫిన్ రేట్లను రూ.5 చొప్పున.. మీల్స్‌ను రూ.10 పెంచినట్లు తెలుస్తోంది. పానీపూరీ బండీల్లో, రెస్టారెంట్లలో నాన్‌వెజ్ ఫుడ్‌కు అదనంగా ఉల్లి ముక్కలు అడిగితే ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. మళ్లీ కొత్త పంటలు వచ్చేదాకా అంటే.. జూలై చివరి వరకు లేదంటే ఆగస్టు రెండో వారం వరకు కూరగాయల ధరలు ఇదే స్థాయిలో ఉంటాయని చెబుతున్నారు.

సరూర్‌నగర్ రైతుబజార్‌లో రేట్లు (కిలో చొప్పున)

రకం	13న	20న	బయటి మార్కెట్‌లో
	(రూపాయలలో)		
టమాట	39	71	100-110
పచ్చి మిర్చి	60	80	100-120
వంకాయ	23	35	40-45
కాకరకాయ	45	65	70-75
ఉల్లిగడ్డ	39	39	50-60
క్యాప్సికమ్	65	80	85-100

వర్షాల ప్రభావంతోనే



అకాల వర్షాలతో దిగుబడి తగ్గడం, రవాణా చార్జీలు పెరగడమూ కూరగాయల ధరల పెరుగదలకు కారణం! కొత్త పంటలు వేసే సీజన్ కావడంతో రైతుబజార్‌కు వచ్చే కూరగాయల దిగుమతి తగ్గింది. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలను తెప్పించి పేదలను ఆదుకోవాలి.

మహ్మద్ షబ్బీర్, ఏతేబార్ చౌక్

ధరలను నియంత్రించాలి



కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోవడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ధరలను నియంత్రించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. తక్కువకు కూరగాయలు అందించేలా కృషి చేయాలి.

-రజిని, సనత్‌నగర్

దిగుబడి తగ్గడంతోనే



ప్రస్తుతం గ్రామాల్లో కూరగాయల దిగుమతి బాగా పడిపోయింది. ఎండాకాలంలో వేసిన పంటలు చివరి దశకొచ్చాయి. గతంలో ఎర్రగడ్డ రైతుబజార్‌కు 1400 నుంచి 1500 క్వింటాళ్ల వరకు కూరగాయలు దిగుమతి అయ్యేవి. ఇప్పుడు 1100 నుంచి 1200 క్వింటాళ్ల వరకే వస్తున్నాయి. జూలై నెలాఖరు వరకు కూరగాయల ధరలు సాధారణ స్థితికి వస్తాయి.

- రమేశ్. ఎస్టేట్ అధికారి, ఎర్రగడ్డ రైతుబజార్



సీఎం రేవంత్, మంత్రి పొన్నంలకు వేదపండితుల ఆశీర్వచనం

తెలంగాణ ప్రజల గుండెల్లో

జయశంకర్..

» రాష్ట్ర సాధనే లక్ష్యంగా బతికిన మహానుభావుడు: సీఎం రేవంత్

హైదరాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): చివరివరకు తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా బతికిన మహానుభావుడు ప్రొఫెసర్ జయశంకర్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. శుక్రవారం ఆయన వర్ధంతి సందర్భంగా రాష్ట్ర సాధన కోసం చేసిన కృషిని స్మరించుకున్నారు. సమైక్య పాలనలో తెలంగాణ జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటడంతో పాటు ప్రజలను జాగృతం చేయడంలో కీలకపాత్ర పోషించారని, తుది శ్వాస వరకు తెలంగాణ కోసమే పరితపించారని.. అందుకే ఆయన రాష్ట్ర ప్రజల గుండెల్లో నిలిచిపోయారని పేర్కొన్నారు. తన జీవితం మొత్తం తెలంగాణకు ధారపోసి, రాష్ట్ర ఏర్పాటుకు ముందే అన్ని రంగాల్లో మనకున్న ఉజ్వల భవిష్యత్తును వీక్షించిన స్వాప్నికుడని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తొలి రోజుల్లోనే ప్రొఫెసర్ జయశంకర్ సొంతూరు అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు.

బోనాలకు రండి..

ఆషాఢ మాసంలో హైదరాబాద్‌లో నిర్వహించే గోల్కొండ, సికింద్రాబాద్, లాల్‌దర్వాజ బోనాలకు హాజరవ్వాలని కోరుతూ ఆయా దేవాలయాల కమిటీల ప్రతినిధులు, అర్చకులు సీఎం రేవంత్‌కు ఆహ్వానం అందజేశారు.

చొప్పదండి ఎమ్మెల్యే

మేడిపల్లి సత్యం భార్య ఆత్మహత్య

అల్వాల్‌లోని ఇంట్లో ఉరి వేసుకున్న రూపాదేవి

కరీంనగర్, జూన్ 20: కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భార్య రూపాదేవి ఆత్మహత్య చేసుకున్నారు. హైదరాబాద్ అల్వాల్ పంచశీల కాలనీలోని వాళ్లింట్లో గురువారం రాత్రి ఆమె ఉరి వేసుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. రూపాదేవి ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. విషయం తెలిసిన ఎమ్మెల్యే సత్యం హుటాహుటిన హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

ఉపాధ్యాయ పోస్టులకు కొత్తగా లక్ష దరఖాస్తులు!

హైదరాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి డీఎస్సీ-2024 దరఖాస్తుకు గడువు గురువారంతో ముగిసింది. సుమారు 11,062 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా 2.80 లక్షల దరఖాస్తులు వచ్చాయి. గతంలో వచ్చిన దరఖాస్తులకు అదనంగా లక్ష మందికి పైగా అభ్యర్థులు కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. నిజానికి, ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గత ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ నోటిఫికేషన్ ప్రకారం 1.77 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం, రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత పోస్టుల సంఖ్యను పెంచి మళ్లీ డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ లోగా జూన్ 12 టెట్ ఫలితాలు విడుదల అయ్యాయి. ఉత్తీర్ణులైన అందరూ డీఎస్సీకి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో మొత్తం దరఖాస్తుల సంఖ్య 2.80 లక్షలకు పెరిగింది. కాగా, డీఎస్సీ-2024 పరీక్షలను జూలై 17 నుంచి 31 వరకు నిర్వహించాలని నిర్ణయించారు.

టీచర్ బదిలీలకు దరఖాస్తు చేసుకునే అవకాశం

ప్రస్తుతం కొనసాగుతున్న ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియలో భాగంగా మల్టీ జోన్-2లోని ఉపాధ్యాయులు బదిలీకి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఒకే చోట కనీసం రెండేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం రెండ్రోజులు అవకాశం ఇచ్చింది. కాగా, మల్టీ జోన్-2 పరిధిలోని 14 జిల్లాల్లో ఉపాధ్యాయ సీనియారిటీ జాబితాను శుక్రవారం విడుదల చేసే అవకాశం ఉంది.

నంబర్ 161ఏఏ

ప్రాంతీయ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి కేటాయింపు!



హైదరాబాద్, జూన్ 20(ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణంలో ఒక్కో అడుగు ముందుకుపడుతోంది. రెండు నెలల్లో టెండర్లకు వెళ్లనుండగా.. అక్టోబరులో ఉత్తర భాగం పనులు మొదలుకానున్నాయి. నిర్మాణం ప్రారంభించేందుకు అనువుగా రహదారికి సాంకేతికంగా ఒక నంబరు (వర్కింగ్ టైటిల్) ఇవ్వాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ).. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి నేషనల్ 'హైవే-161ఏఏ' సంఖ్యను కేటాయించింది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకూ సమాచారం ఇచ్చింది. ప్రస్తుతానికే కాక.. నిర్మాణం అనంతరం సైతం ఇదే నంబరు ఖరారు కావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి జాతీయ రహదారి నంబరును ఇస్తున్నామని కేంద్రం గతంలోనే చెప్పినా అమలుకు నోచుకోలేదు. దీనికి మార్గ మధ్యంలోని విద్యుత్తు, టెలిఫోన్, నీటి పైప్‌లైన్ల (యుటిలిటీస్) తదితరాల తరలింపునకు చెల్లించాల్సిన రూ.363 కోట్లు, భూసేకరణ వాటా మంజూరు జాప్యం అడ్డంకిగా మారాయి. అయితే, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆర్ఆర్ఆర్ నిర్మాణంలో అపరిష్కృత అంశాలపై దృష్టిపెట్టింది. కేంద్రంతోనూ పలుసార్లు చర్చలు జరిపింది. అనంతరం యుటిలిటీ చార్జీలను కేంద్రమే భరిస్తామని హామీ ఇచ్చింది. భూసేకరణ వాటాను ఎప్పటికప్పుడు చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. దీనిపై సంతృప్తి వ్యక్తం చేసిన కేంద్రం.. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి నంబరు ఇస్తామని ప్రకటించింది. ఈలోగా లోక్‌సభ ఎన్నికలు రావడంతో జాప్యం జరిగింది. కాగా, ఆర్ఆర్ఆర్‌కు ఆగస్టులో టెండర్లు పిలిచే అవకాశం ఉందని మే నెలలోనే 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది.

మార్పులు చేర్పులుండొచ్చు..

కేంద్రం సంసిద్ధంగా ఉన్న నేపథ్యంలో.. ఆర్ఆర్ఆర్‌కు ఉత్తర భాగానికి రాష్ట్రంలోని ఎన్‌హెచ్‌ఏఐ సంస్థ 161ఏఏ నంబరును తాత్కాలికంగా కేటాయించింది. తుది అనుమతి రానందున వర్కింగ్ టైటిల్ నంబరుగానే పరిగణించనున్నారు. నిర్మాణం పూర్తయ్యేలోగా మార్పుచేర్పులకూ అవకాశం లేకపోలేదని సమాచారం. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, జగదేవపూర్, ప్రజ్ఞాపూర్, గజ్వేల్, భువనగిరి మీదుగా చౌటుప్పల్ వరకు ఆరు ప్యాకేజీల్లో 161 కిలోమీటర్ల మేర సాగనుంది. దక్షిణ భాగం చౌటుప్పల్ నుంచి ఆమనగల్, షాద్‌నగర్, చేవెళ్ల మీదుగా సంగారెడ్డి వరకు (189 కిలోమీటర్లు) నిర్మాణం కానుంది. ముందుగా.. కేంద్రం ఉత్తర భాగానికి అనుమతిచ్చింది. ఇందులో 11 టోల్‌ప్లాజాలు, 11 ఇంటర్ చేంజ్‌లు, ఆరుచోట్ల విశ్రాంత ప్రదేశాలు ఏర్పాటు కానున్నాయి. దాదాపు 187 చిన్న, మధ్య, భారీ అండర్ పాస్‌లు, నాలుగు రోడ్ ఓవర్ బ్రిడ్జి, 27 పెద్ద, 80 చిన్న వారధులు, 404 బాక్స్ కల్వర్టులను నిర్మించాల్సి ఉంది.

అదే అలైన్‌మెంట్

ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం అలైన్‌మెంట్‌లో మార్పులుంటాయని గతంలో ప్రచారం జరిగింది. అయితే, అదేమీ లేదని స్పష్టమైంది. వాస్తవానికి సంగారెడ్డి-చౌటుప్పల్ వరకు రహదారి మ్యాప్ గతంలోనే సిద్ధమైంది. 90 శాతం భూసేకరణ జరిగింది. నర్సాపూర్ దగ్గర అటవీ భూములు ఉండగా, యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి ప్రాంత ప్రజలు భూములు ఇచ్చేందుకు నిరాకరించారు. ఈ రెండుచోట్ల సేకరణ జాప్యమైంది. అదే సమయంలో కేంద్రం నిబంధనల మేరకు అలైన్‌మెంట్ మార్పునకూ అవకాశం లేదు. దీంతో రాయగిరి ప్రజలను ఒప్పించేందుకు అధికారులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. మరోవైపు ప్రాంతీయ రింగు రోడ్డు రెండు భాగాలు ఒకేలా నిర్మాణం కానున్నాయి. ఉత్తర భాగం పనులు మొదలుపెట్టే సమయానికి దక్షిణం వైపు అలైన్‌మెంట్, డీపీఆర్‌లను సిద్ధం చేసేలా అధికారులు కసరత్తు సాగిస్తున్నారు. మొత్తంగా మూడేళ్లలో అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో రాష్ట్రం ప్రభుత్వం ముందుకెళ్తోంది.

తెలంగాణలో.. వచ్చే ఎన్నికల్లో మాదే అధికారం

(మొదటిపేజీ తరువాయి)

హోదాలో కిషన్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ మాట్లాడుతూ కార్యకర్తల కృషి, పట్టుదల, దశాబ్దాల పోరాటాల ఫలితంగా రాష్ట్రంలో 8 మంది ఎంపీలు, మరో 8 మంది ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారని.. నమ్మిన సిద్ధాంతం, దేశ సమగ్రత కోసం ప్రాణత్యాగం చేసిన నందరాజ్‌గౌడ్, బాలరాజ్‌యాదవ్, పాపయ్యగౌడ్, చంద్రారెడ్డి, జయానంద్, జితేందర్‌రెడ్డి, మైసయ్యగౌడ్ వంటివారికి ఈ విజయాలను అంకితమిస్తున్నట్లు ప్రకటించారు. "కేంద్ర మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన కిషన్‌రెడ్డి, బండిసంజయ్ ఒకప్పుడు సాధారణ కార్యకర్తలే. రాష్ట్ర పార్టీ కార్యాలయంలో రాజకీయ ఓనమాలు దిద్దుకున్న కిషన్‌రెడ్డి వరుసగా రెండోసారి కేంద్ర మంత్రి అయ్యారు. సాధారణ కార్యకర్తగా ప్రస్థానాన్ని ప్రారంభించిన బండి సంజయ్ ఢిల్లీలోని జాతీయ పార్టీ కార్యాలయంలో రాజకీయ ఓనమాలు నేర్చుకున్నారు. కార్పొరేటర్ స్థాయి నుంచి కేంద్ర మంత్రి అయ్యారు" అని వివరించారు. పార్టీ ఒంటరిగా ఎదగలేదని, ఐదేళ్ల క్రితం విమర్శలను ఎదుర్కొని.. ఒంటరిగా 4 ఎంపీ స్థానాలను సాధించి, సత్తా చాటిందన్నారు. బండి సంజయ్ నేతృత్వంలో ఉప ఎన్నికలతోపాటు.. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 48 స్థానాలను సాధించి, బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదిగిందని గుర్తుచేశారు. కిషన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో బీజేపీకి ఎనిమిదేసి ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు వచ్చాయన్నారు. "రాబోయే ఐదేళ్లు మనకు విషమ పరీక్ష. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలకు పెద్దపీట వేయాలి. పాత-కొత్త కలయికలతో పార్టీని విస్తరించాలి. బీఆర్‌ఎస్ పనైపోయింది. ఇక కాంగ్రెస్‌ను ఎదుర్కొందాం" అని పిలుపునిచ్చారు.



బేగంపేట విమానాశ్రయం వద్ద ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలకు అభివాదం చేస్తున్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్

కేంద్ర మంత్రులకు ఘన స్వాగతం

అంతకు ముందు బేగంపేట విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో చేరుకున్న కిషన్‌రెడ్డి, ఆయన సతీమణి కావ్య, బండి సంజయ్‌కి రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్ తదితర ముఖ్యనేతలు ఘనస్వాగతం పలికారు. బేగంపేట విమానాశ్రయం నుంచి నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కిషన్‌రెడ్డి, సంజయ్‌ని గజమాలలతో సత్కరించారు. అనంతరం కిషన్‌రెడ్డి, బండి సంజయ్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భాగ్యలక్ష్మి ఆలయాన్ని.. 'గోల్డెన్ టెంపుల్'గా మారుస్తాం: బండి

చార్మినార్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పాతనగరంలోని భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయాన్ని 'గోల్డెన్ టెంపుల్'గా మారుస్తామని ప్రకటించారు. భాగ్యలక్ష్మి అమ్మవారి దయవల్లే బీజేపీ తెలంగాణలో 8 ఎంపీ సీట్లను గెలిచిందన్నారు. అమ్మవారి దయవల్లే ఆనాడు ప్రజాసంగ్రామ యాత్ర విజయవంతమైందని గుర్తుచేశారు. "కార్పొరేటర్ కేంద్ర మంత్రి కావొచ్చని.. చాయ్‌వాలా ప్రధాని కావొచ్చని చాటిన ఏకైక పార్టీ బీజేపీనే. ఇంత గొప్ప అవకాశాలను కల్పించే బీజేపీ తెలంగాణలో తిరుగులేని శక్తిగా మారి, అధికారంలోకి వచ్చేదాకా పోరాడతా. నా చివరి రక్తపు బొట్టు వరకు పార్టీ కోసం పనిచేస్తా" అని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

నేడు రాష్ట్ర క్యాబినెట్ భేటీ

హైదరాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్యాబినెట్ సమావేశం శుక్రవారం జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సాయంత్రం 4 గంటలకు సచివాలయంలోని ఆరో అంతస్తులో ఈ సమావేశం జరుగుతుంది. రూ.2 లక్షలలోపు పంట రుణాల మాఫీ, రైతు భరోసా అమలు, నిధుల సేకరణపై చర్చించనున్నట్లు సమాచారం. అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, విద్యా, వ్యవసాయ కమిషన్ల ఏర్పాటు, నామినేటెడ్ పోస్టులపైనా చర్చించవచ్చని తెలిసింది.

ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి: దామోదర

హైదరాబాద్ సిటీ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా గురువారం నగరంలోని రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ నులిపురుగుల నిర్మూలనతోనే పిల్లల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తెలిపారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ.. జూన్ 20 నుంచి 27 వరకు హైదరాబాద్ జిల్లాలో ఉన్న 11,78,118 మంది పిల్లలకు నులిపురుగుల నివారణ కార్యక్రమం ద్వారా మాత్రలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

7.5 టీఎంసీల క్యారీ ఓవర్‌కు అనుమతివ్వాలి

» కృష్ణా బోర్డుకు తెలంగాణ లేఖ

హైదరాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నిల్వ ఉన్న జలాల్లో తెలంగాణ గత నీటి సంవత్సరంలో వాడుకోని 7.50 టీఎంసీలున్నాయని, వాటిని ప్రస్తుత నీటి సంవత్సరానికి (2024-25) క్యారీ ఓవర్‌కు అనుమతించాలని కోరుతూ కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ)కి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా లేఖ రాసింది. బచావత్ ట్రైబ్యునల్ అవార్డు ప్రకారం ఒక నీటి సంవత్సరంలో వాడుకోలేని జలాలను తదుపరి నీటి సంవత్సరానికి బదిలీ చేసే వీలుందని పేర్కొంది. ఈమేరకు సాగర్‌లో రాష్ట్రానికి చెందిన గత కోటాకు సంబంధించిన 7.50 టీఎంసీలను క్యారీ ఓవర్ చేయాలని నివేదించింది.

జూలైలోనే 'లా' కౌన్సెలింగ్ పూర్తి చేయాలని పిల్

హైదరాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం వంటి లా కోర్సుల కౌన్సెలింగ్ జూలైలోనే పూర్తిచేసేలా ఆదేశాలు ఇవ్వాలని హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది భాస్కర్‌రెడ్డి పిల్ దాఖలు చేశారు. అకడమిక్ క్యాలెండర్‌ను పాటించడం లేదని, తరగతులు ప్రారంభమయ్యేసరికి డిసెంబర్ వస్తోందని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం.. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర ఉన్నత విద్యామండలి, ఉస్మానియా యూనివర్సిటీ తదితరులకు నోటీసులు జారీచేసింది. విచారణను ఈనెల 27వ తేదీకి వాయిదా వేసింది.

బౌరంపేట భూములపై వివరణ ఇవ్వండి

» రెవెన్యూ అధికారులకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): పది ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేటు పార్టీల పేరిట మార్చినట్లు వచ్చిన ఆరోపణలపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. మేడ్చల్ జిల్లా దుండిగల్ గండిమైసమ్మ మండలం, బౌరంపేట సర్వే నంబర్ 166 సబ్ డివిజన్ 2, 3, 4, 5, 6, 7లో వజ్ర బిల్డర్స్, పీ రాఘరావు లీగల్ హెయిర్స్‌కు భూమి ఉండగా రెవెన్యూ అధికారులు వారితో కుమ్మక్కై సబ్ డివిజన్ సర్వే నంబర్లు మార్చడం ద్వారా ఓఆర్ఆర్ పక్కన విలువైన ప్రభుత్వ భూమిని తారుమారు చేశారని పిటిషనర్ గడీల రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. కౌంటర్ దాఖలు చేయడానికి సమయం ఇవ్వాలని ప్రభుత్వం తరఫున ఏఏజీ కోరడంతో విచారణ జూలై 2కు వాయిదా పడింది.

కమిషన్ పరిసరాల్లోకి మీడియాకు నో ఎంట్రీ

» నర్సింహారెడ్డి కమిషన్‌పై కేసీఆర్ లేఖ ప్రభావం

హైదరాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందంపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్‌కు మాజీ సీఎం కేసీఆర్ రాసిన లేఖ ప్రభావం ఆ కమిషన్‌పై తీవ్రంగానే పడినట్లు కనిపిస్తోంది. అందుకే మీడియాకు దూరంగా ఉండాలని కమిషన్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మూడు రోజులుగా కమిషన్ వైపు మీడియాను అనుమతించకుండా నిషేధాజ్ఞలు విధించారు. విద్యుత్ వ్యవహారం విచారణ వివాదాస్పదంగా మారడంతో మీడియాకు దూరంగా ఉండాలని జస్టిస్ నర్సింహారెడ్డి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

11 చోట్ల ఈవీఎంల తనిఖీలకు దరఖాస్తులు

» తెలుగు రాష్ట్రాల్లో 2 అసెంబ్లీ, 2 లోక్‌సభ స్థానాలకు: ఈసీ

న్యూఢిల్లీ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 8 పార్లమెంట్ నియోజకవర్గాల్లోని 92 పోలింగ్ కేంద్రాలు, 3 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 26 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంల వెరిఫికేషన్ కోసం దరఖాస్తులు వచ్చాయని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి నాలుగు దరఖాస్తులు అందాయని పేర్కొంది. తెలంగాణలోని జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 20 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి వెరిఫికేషన్ చేపట్టాలని బీజేపీ కోరినట్లు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం లోక్‌సభ స్థానం పరిధిలో 2 పోలింగ్ కేంద్రాల్లో వెరిఫికేషన్ కోసం వైఎస్సార్‌సీపీ దరఖాస్తు చేసినట్లు తెలిపింది. అలాగే, ఒంగోలు అసెంబ్లీ స్థానంలోని 12, గజపతినగరం అసెంబ్లీ స్థానంలోని ఒక పోలింగ్ కేంద్రంలో వెరిఫికేషన్ కోసం దరఖాస్తులు అందినట్లు వివరించింది. అలాగే, ఒడిశాలోని ఝుర్సుగూడ అసెంబ్లీ స్థానం పరిధిలో ఉన్న 13 పోలింగ్ కేంద్రాలు, ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ పరిధిలోని 4 పోలింగ్ కేంద్రాలు, హరియాణాలోని కర్నల్, ఫరిదాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో 6, మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో 40 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి దరఖాస్తులు అందినట్లు వెల్లడించింది. తమిళనాడులోని వెల్లూర్ లోక్‌సభ నియోజకవర్గంలోని 8, విరుధ్‌నగర్ లోక్‌సభ స్థానం పరిధిలోని 14 పోలింగ్ కేంద్రాలకు దరఖాస్తులు అందినట్లు ఈసీ వెల్లడించింది. దరఖాస్తు చేసిన నాలుగు వారాల్లో తనిఖీలు చేపడతామని ఈసీ తెలిపింది.

ప్రాధాన్యం లేని పోస్టులోకి ఏపీ మాజీ డీజీపీ

» ప్రింటింగ్-స్టేషనరీ కమిషనర్‌గా రాజేంద్రనాథ్‌రెడ్డి

అమరావతి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డితో అంటకాగి.. చంద్రబాబు, లోకేశ్ సహా ప్రతిపక్ష నేతలను, శ్రేణులను వేధించిన పోలీసు అధికారులపై టీడీపీ కూటమి ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. ఎన్నికల వేళ ఈసీ ఆగ్రహానికి గురైన డీజీపీ పదవి కోల్పోయిన కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డికి, నాటి సీఐడీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్‌కు, ఎస్పీ రిశాంత్‌రెడ్డికి గట్టి షాకిచ్చింది. ప్రస్తుతం ఏసీబీ డీజీగా ఉన్న రాజేంద్రనాథ్‌రెడ్డిని ఏ మాత్రం ప్రాధాన్యం లేని ప్రింటింగ్-స్టేషనరీ విభాగం కమిషనర్‌గా బదిలీచేసింది. ఏపీఎస్పీ అదనపు డీజీ అతుల్ సింగ్‌కు అదనంగా ఏసీబీ బాధ్యతలు అప్పగించింది. సీఐడీ మాజీ చీఫ్, ప్రస్తుతం అగ్నిమాపక సర్వీసుల డీజీగా ఉన్న పీవీ సునీల్‌కుమార్‌కు ఏ పోస్టూ ఇవ్వకుండా జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. ఫైర్ విభాగం అదనపు బాధ్యతలను శాంతిభద్రతల అదనపు డీజీ శంఖబ్రత బాగ్చీకి అప్పగించారు. గతంలో చిత్తూరు ఎస్పీగా పని చేసిన.. కౌంటర్ ఇంటెలిజెన్స్ ఎస్పీ రిశాంత్‌రెడ్డిని జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

ఇక ముద్రగడ పద్మనాభ రెడ్డి!

» పేరు మార్చుకున్న కాపు ఉద్యమ నేత.. గెజిట్ విడుదల

కిర్లంపూడి, జూన్ 20: కాపు ఉద్యమ నేత, వైసీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం తన పేరును ముద్రగడ పద్మనాభ రెడ్డిగా మార్చుకున్నారు. కొన్నిరోజుల క్రితం ఆయన చేసిన దరఖాస్తు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ముద్రగడ పద్మనాభ రెడ్డిగా పేరు మార్చుతూ బుధవారం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ విషయాన్ని కిర్లంపూడిలో ఆయన వెల్లడించారు. పవన్ కల్యాణ్ పిఠాపురంలో గెలిస్తే తాను పేరు మార్చుకుంటానని ఆయన సవాల్ చేసిన సంగతి తెలిసిందే.

కేజ్రీవాల్‌కు బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి గురువారం ఉదయం తీర్పును రిజర్వు చేసిన జడ్జి నియాయ్ బిందు.. సాయంత్రానికి బెయిల్ ఇచ్చారు. బెయిల్ బాండ్ పత్రాలపై సంతకం చేసేందుకు 48 గంటల పాటు బెయిల్ ఆర్డర్‌ను నిలిపివేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విజ్ఞప్తి చేసింది. తీర్పును పై కోర్టులో సవాల్ చేసుకునే వీలు కలుగుతుందని పేర్కొంది. ఈ వాదనను జడ్జి తిరస్కరించారు. కాగా, దాదాపు రెండు రోజుల పాటు ఈడీ, కేజ్రీవాల్ తరఫు న్యాయవాదుల వాదనలు విన్న తర్వాత బెయిల్ మంజూరు చేయాలని ప్రత్యేక కోర్టు నిర్ణయించింది. కేజ్రీ తరఫు న్యాయవాదులు శుక్రవారం బెయిల్ బాండ్ పత్రాలను కోర్టుకు సమర్పించనున్నారు. అనంతరం ఆయన తిహాడ్ జైలు నుంచి విడుదల కానున్నారు. మరోవైపు కేజ్రీకి బెయిల్ మంజూరును ఈడీ ఎగువ కోర్టులో సవాల్ చేసే వీలుంది.



సరిగ్గా మూడు నెలల కిందట

మద్యం కుంభకోణంలో కేజ్రీని మార్చి 21న ఈడీ అరెస్టు చేసింది. లిక్కర్ వ్యాపారుల నుంచి పొందిన ముడుపులను గోవాలో పార్టీ ఎన్నికల ప్రచారానికి వినియోగించారని అభియోగాలు మోపింది. మనీ ల్యాండరింగ్ ద్వారా ఈ నిధులను మళ్లించారని, ఆప్ కన్వీనర్‌గా కేజ్రీవాల్ ఇందుకు బాధ్యులని పేర్కొంది. దీనికిముందు గత ఏడాది అక్టోబరు-ఈ ఏడాది మార్చి మధ్య 9 సార్లు సమన్లు జారీ చేసింది. సమన్లకు ఆయన స్పందించడం లేదంటూ మెజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు చేసింది. దీనిపై కోర్టు.. కేజ్రీకి సమన్లు ఇచ్చింది. మార్చి 15న.. సమన్లను దాటవేయడంపై కేజ్రీ మీద విచారణను నిలిపివేసేందుకు సెషన్స్ కోర్టు నిరాకరించింది. ఇక అరెస్టు నుంచి రక్షణ కల్పించేందుకు మార్చి 21న ఢిల్లీ హైకోర్టు నిరాకరించడంతో.. అదే రోజు కేజ్రీని ఈడీ అదుపులోకి తీసుకుంది. కస్టడీ అనంతరం తిహాడ్ జైలుకు తరలించగా, లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం కేజ్రీకి మే 10న సుప్రీంకోర్టు మూడు వారాల మధ్యంతర బెయిల్ ఇచ్చింది. ఈ నెల 1తో దీని గడువు ముగిసింది. జూన్ 2న ఆయన తిహాడ్ జైలు అధికారుల ముందు లొంగిపోయారు. పలు కారణాలతో ఢిల్లీ కోర్టును మధ్యంతర బెయిల్ కోరగా, 5వ తేదీన తిరస్కరించింది. కింది కోర్టులో రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకుని ఎట్టకేలకు ఫలితాన్ని సాధించారు. కాగా, కొన్నిసార్లు ఇబ్బందులు ఎదురైనా.. చివరకు సత్యానిదే గెలుపని ఢిల్లీ మంత్రి అతిశీ వ్యాఖ్యానించారు. ఆప్ ఇతర నేతలు సైతం తాజా పరిణామం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మరోవైపు కేజ్రీకి బెయిల్ మంజూరు నేపథ్యంలో ఢిల్లీ మద్యం స్కాంలో మిగతా నిందితులకూ త్వరలో బెయిల్ లభించే అవకాశం ఉందనే అభిప్రాయం న్యాయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

బొగ్గు.. భగ్గు!



(మొదటిపేజీ తరువాయి)

వేలం పాటకు హైదరాబాద్ కేంద్రంగా మారింది. తెలంగాణలో కొత్తగా మూడు బ్లాక్‌లలో బొగ్గు నిల్వలు ఉన్నాయని స్వయంగా సింగరేణి గుర్తించింది. అందులో రెండింటిని బీఆర్‌ఎస్ ప్రభుత్వహయాంలోనే కేంద్ర ప్రభుత్వం వేలం వేసింది. తాజాగా మూడో గనిని వేలం వేస్తున్నారు. 2010లో సుప్రీంకోర్టు తీర్పు వచ్చేవరకు బొగ్గు గనులను ముందు వచ్చిన వాళ్లకు ముందు పద్ధతిలో కేటాయించే వాళ్లు. ప్రభుత్వరంగ సంస్థలకు కూడా అడగగానే గనులను కేటాయించేవారు. ముందు వచ్చిన వారికి ముందు పద్ధతిలో భారీగా అవినీతి జరుగుతోందని, వేలం వేయాలని సుప్రీంకోర్టు చెప్పిన తర్వాత 2014లో కేంద్ర ప్రభుత్వం కొత్త బొగ్గు విధానాన్ని అమల్లోకి తెచ్చింది. దాని ప్రకారం ప్రయివేటు సంస్థలే కాకుండా ప్రభుత్వరంగ సంస్థలు కూడా బొగ్గు బ్లాక్‌లు కావాలంటే వేలంలో పాల్గొనాల్సిందే. ఈ నేపథ్యంలో రెండున్నరేళ్ల క్రితం తెలంగాణలోని రెండు బ్లాక్‌లను కేంద్ర ప్రభుత్వం వేలం వేసినా సింగరేణి నిస్సహాయంగా ఉండిపోవాల్సి వచ్చింది. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం వేలానికి దూరంగా ఉండిపోయింది. దాంతో సత్తుపల్లి బ్లాక్-3, కోయగూడెం బ్లాక్ -3(ఇల్లెందు) గనులను సింగిల్ బిడ్డర్లుగా ప్రైవేట్ సంస్థలు దక్కించుకున్నాయి. అయితే, అవి బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించలేకపోయాయి. బొగ్గును వెలికితీసే సాధనా సంపత్తి ఆ సంస్థలకు లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ రెండు బ్లాక్‌లను తమకు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. వేలంలో దక్కించుకున్న సంస్థలకు విధించిన షరతులన్నీ తాము నెరవేర్చడానికి సిద్ధంగా ఉన్నామని కూడా చెప్పింది. కేంద్రం నుంచి స్పందన లేదు. కిషన్‌రెడ్డి బొగ్గు మంత్రిగా బాధ్యతలను స్వీకరించిన నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్ కేంద్రంగా దేశవ్యాప్తంగా ఉన్న 60 బ్లాక్‌ల వేలం జరుగుతోంది. అందులో సింగరేణి గనుల మధ్యలో ఉన్న శ్రావణపల్లి బ్లాక్(శ్రీరాంపూర్, మందమర్రి) కూడా ఉంది. వేలం ప్రక్రియను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో బొగ్గు శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే, కార్యదర్శి అమృత్ లాల్ మీనా తదితరులు పాల్గొంటారు. వేలాన్ని నిలిపివేయాలని రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్ డిమాండ్ చేసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ కార్యక్రమానికి హాజరై, శ్రావణపల్లి గనిని తమకే కేటాయించాలని కేంద్రాన్ని కోరనున్నారు. ప్రైవేట్ సంస్థలతో పోటీపడి, గనులను దక్కించుకునే ఆర్థిక పరిస్థితులు సింగరేణికి లేవు.

రెండున్నరేళ్ల నుంచి కోరుతున్నా

తెలంగాణలో తలపెట్టిన నాలుగు బొగ్గు బ్లాకుల వేలాన్ని నిలిపివేయాలని 2021 డిసెంబరులో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసింది. బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ 2021 డిసెంబరులో మూడు రోజుల పాటు కార్మిక సంఘాలు సమ్మె కూడా చేపట్టాయి. కేంద్రం నుంచి సానుకూల స్పందన రాలేదు. సింగరేణి మనుగడ ఓపెన్ కాస్ట్ గనుల మీదే ఆధారపడి ఉంది. భూగర్భ గనులు నష్టాల్లో ఉండగా వాటిని ఓపెన్ కాస్టు లాభాలతో సింగరేణి సర్దుబాటు చేసుకుంటోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు విద్యుత్ కేంద్రాల బొగ్గు అవసరాలను తీర్చడంలో సింగరేణి కీలక భూమిక పోషిస్తోంది. ఇప్పటికే వేలం వేసిన రెండు బ్లాక్‌లను దక్కించుకున్న ప్రైవేటు సంస్థలు ఉత్పత్తి ప్రారంభించకపోవడాన్ని, కొత్తగా వేలం వేయడానికి సిద్ధంగా ఉన్న శ్రావణపల్లి బ్లాక్ సింగరేణి గనుల మధ్య ఉన్న విషయాన్ని కేంద్రానికి నివేదించి, ప్రత్యేక అనుమతితో దక్కించుకోవాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది. ఇలాంటి విజ్ఞప్తే చేయగా ఇటీవలే తాడిచర్ల బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడానికి కేంద్రం సానుకూలత వ్యక్తం చేసిన విషయం విదితమే.

వేలానికి దూరంగా సింగరేణి

హైదరాబాద్‌లో శుక్రవారం జరుగనున్న వేలం పాటకు సింగరేణి దూరంగా ఉండబోతోంది. 60 బ్లాకుల్లో అత్యధికంగా ఒడిశాకు చెందిన 16 బ్లాకులు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 15 బ్లాకులు, ఆ తర్వాత జార్ఖండ్‌కు చెందిన 6 బ్లాకులు, బిహార్, పశ్చిమ బెంగాల్‌లకు చెందిన చెరో మూడు బ్లాకులతో పాటు తెలంగాణలోని ఒక బ్లాకు(శ్రావణపల్లి)కూడా ఉంది. ఈ బ్లాకులో 11.99కోట్ల టన్నుల బొగ్గునిల్వలు ఉన్నట్లు గతంలో సింగరేణి నిర్వహించిన అన్వేషణలో తేలింది. సింగరేణి తాజా వేలంపాటకు దూరంగా ఉండి, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రంపై ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తోంది.

అనుమతుల్లో వేగం పెంచండి: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా కేటాయించిన బొగ్గు బ్లాకుల అనుమతుల ప్రక్రియను శరవేగంగా పూర్తి చేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బొగ్గు గనుల నిర్వహణ, కేటాయింపు తదితర అంశాలపై ఢిల్లీలోని తన కార్యాలయంలో అధికారులతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. కేటాయించిన బొగ్గు బ్లాకుల నుంచి వీలైనంత త్వరగా ఉత్పత్తి ప్రారంభం కావాలని సూచించారు. ఈ మేరకు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖలతో సమన్వయంతో వ్యవహరించాలని అన్నారు. దేశంలో బొగ్గు దిగుమతిని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

» ఎస్‌హెచ్‌జీల ఆర్థిక ప్రగతికి కృషి: సీతక్క

హైదరాబాద్, రాజేంద్రనగర్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజా పాలనలో మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని, మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ఆర్థిక ప్రగతి కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళా శక్తి కార్యక్రమంపై కార్యాచరణ రూపొందించేందుకు రాజేంద్రనగర్‌లోని గ్రామీణాభివృద్ధి సంస్థలో డీఆర్‌డీవోలు, అదనపు డీఆర్‌డీవోలతో ఆమె సమావేశమయ్యారు. 'స్థానికంగా లభ్యమయ్యే వస్తువుల ఆధారంగా వ్యాపారం చేస్తూ అద్భుతాలు సాధించేలా.. డిమాండ్ ఉన్న వ్యాపారాల్లో రాణించేలా మహిళా సంఘాలకు ప్రోత్సాహం అందిస్తాం. క్షేత్రస్థాయి పరిస్థితులు, ప్రజల అవసరాలు, వనరుల లభ్యతకు తగినట్లుగా బిజినెస్ మోడల్ రూపొందిస్తాం' అని అన్నారు. రద్దీ ప్రాంతాల్లో మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ క్యాంటీన్లను మోడల్‌గా రూపొందించి ప్రజలకు ఆరోగ్యకరమైన, కల్తీలేని ఆహార పదార్థాలు అందించేలా ఎస్‌హెచ్‌జీ మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వడ్డీ వ్యాపారులు, మైక్రో ఫైనాన్స్ సంస్థల వేధింపుల నుంచి మహిళలకు విముక్తి కల్పించేందుకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తామని, ఈమేరకు వచ్చే ఐదేళ్లలో మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల రుణాలు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. మహిళలకు ఆర్థిక సమస్యను దూరం చేసేలా ఎస్‌హెచ్‌జీలను ప్రోత్సహించడంలో అధికారులు ముందుండాలని సీతక్క సూచించారు.

నేడు మహిళా శక్తి క్యాంటీన్ల ప్రారంభం

రాష్ట్రంలోని ఎస్‌హెచ్‌జీ మహిళల ఆర్థిక పురోగతి కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేసుకునేలా కృషి చేస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. ఇందులో భాగంగానే అంబేద్కర్ తెలంగాణ సచివాలయం వద్ద మోడల్‌గా రూపొందించిన రెండు మహిళా శక్తి క్యాంటీన్లను శుక్రవారం ప్రారంభించనున్నట్లు చెప్పారు.

బొగ్గు గనులను వేలం వేస్తే ఊరుకోం

రాష్ట్రం తరఫున పోరాడి తీరతాం.. అఖిలపక్షంతో ప్రధాని వద్దకు వెళతాం

» కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవ చూపాలి

» డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల

ఖమ్మం, జూన్ 20 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్రంలో సింగరేణి పరిధిలో ఉన్న బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వం వేలం వేస్తే ఊరుకోబోమని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క చెప్పారు. రాష్ట్రం తరఫున పోరాడి తీరతామని స్పష్టం చేశారు. ఖమ్మం కలెక్టరేట్‌లో గురువారం వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బొగ్గు గనులన్నీ వేలం వేసేలా 2015లో కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టానికి ఆనాడు బీజేపీతో పాటు బీఆర్‌ఎస్ కూడా మద్దతు పలికి ఇప్పుడు దొంగాట ఆడుతున్నాయని ఆరోపించారు. తెలంగాణ ప్రాంత భవిష్యత్తుకు విఘాతం కలిగించేలా సింగరేణి సంస్థను దెబ్బతీసేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం ఆనాడు కేంద్ర చట్టానికి మద్దతు పలికిందని ధ్వజమెత్తారు. దీన్ని వ్యతిరేకిస్తూ తాను కాంగ్రెస్ తరఫున లేఖ రాసినట్లు భట్టి గుర్తు చేశారు. గతంలో ఎన్డీయే ప్రభుత్వం సింగరేణి పరిధిలోని కోయగూడెం, సత్తుపల్లి బొగ్గు గనులను కేసీఆర్‌కు సంబంధం ఉన్న కంపెనీలకు అప్పగించిందని ఆరోపించారు. సింగరేణికే ఈ ప్రాంత బొగ్గు గనులను కేటాయించాలంటూ అఖిలపక్షంతో వెళ్లి ప్రధానమంత్రిని కోరతామని తెలిపారు. ఇందుకు కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్రం తరఫున చొరవ తీసుకోవాలని కోరారు. సింగరేణి పరిధిలో ఉన్న అన్ని బొగ్గు బ్లాకులను సంస్థకే కేటాయించాలని శుక్రవారం కిషన్‌రెడ్డిని కోరనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న గనుల్లో 2033 వరకే బొగ్గును తవ్వుకునే అవకాశం ఉందన్నారు. ఆ తర్వాత సింగరేణి మూతపడే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన సింగరేణికి తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బొగ్గు గనులను కేటాయించాలని.. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటు సంస్థలకు అప్పగించవద్దని డిమాండ్ చేశారు. ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తే తాము కేంద్రంతో పోరాడి తీరతామన్నారు. అవసరమైతే గత చట్టంలో మార్పులు చేసుకోవాలని, తెలంగాణ రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇందుకు సహకరించాలని కోరారు. గోదావరి లోయలోని బొగ్గు నిక్షేపాలను సింగరేణికి కేటాయించకుండా గత టీఆర్‌ఎస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ సర్కారు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రైవేటు సంస్థలకు టెండర్లు అప్పగించారని భట్టి ఆరోపించారు. వారికి సన్నిహితమైన ఆరో, అవంతిక, ప్రతిమ ఇన్‌ఫ్రా సంస్థలకు దక్కేలా అప్పటి ప్రభుత్వం వ్యవహరించిందని ధ్వజమెత్తారు. వాస్తవాలను పక్కనపెట్టి ప్రస్తుతం బీఆర్‌ఎస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తూ సింగరేణి కార్మికులను, ప్రజలను పక్కదారి పట్టించేదుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గత పదేళ్లలో సింగరేణి సంస్థను ఎలా దెబ్బతీశారో, కార్మికుల సంఖ్య ఎలా కుదించారో అందరికీ తెలుసన్నారు. సింగరేణి కార్మికులు తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించారన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఉమ్మడి వ్యూహంతోనే 2015లో బొగ్గు గనులన్నింటినీ వేలం వేసేలా చట్టాన్ని రూపొందించాయని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. సిగరేణిని కాపాడుకునే విషయంలో కేంద్ర ప్రభుత్వం సహకరించకపోతే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

గనులతో మాకు సంబంధం లేదు: ప్రతిమ

హైదరాబాద్: సత్తుపల్లి బొగ్గు గనిని తాము దక్కించుకున్నట్లు భట్టి విక్రమార్క చేసిన ఆరోపణలను ప్రతిమ ఇన్‌ఫ్రా తీవ్రంగా ఖండించింది. సింగరేణితో తమకెలాంటి సంబంధాలు లేవని ప్రతిమ ఇన్‌ఫ్రా ఉపాధ్యక్షుడు పి.అనిల్‌కుమార్ తెలిపారు.

బీజేపీ, కాంగ్రెస్‌కు చెరో 8 సీట్లిస్తే సింగరేణిని ఖతం చేస్తారా?

» టీడీపీకి 16 ఎంపీ సీట్లిస్తే.. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణను ఆపింది

» తెలంగాణలో గనుల వేలం ఆపలేరా?

» ఎవరికిచ్చినా మేం వచ్చాక రద్దే

» బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

» గతంలో వేలం వద్దన్న రేవంత్.. ఇప్పుడెలా సమర్థించుకుంటారని ప్రశ్న



హైదరాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): "ఆంధ్రప్రదేశ్ ప్రజలు టీడీపీకి 16 ఎంపీ సీట్లిస్తే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపగలిగింది. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు 8, బీజేపీకి 8 ఎంపీ సీట్లు కట్టబెడితే.. ఆ రెండు పార్టీలు సింగరేణిని ఖతం చేయాలని చూస్తున్నాయి" అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రెండు జాతీయ పార్టీలు సింగరేణిని ప్రైవేటీకరించాలన్న కుట్రను ఆపలేకపోతున్నాయని విమర్శించారు. గురువారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీకి రాష్ట్రంలో 16 ఎంపీ సీట్లిస్తే కేంద్రంలో నిర్ణయాత్మకంగా ఉంటామని కేసీఆర్ చెబితే, రేవంత్ ఎద్దేవా చేశారని.. ఇప్పుడు మన బొగ్గు గనులను దుర్మార్గంగా వేలం వేయాలని చూస్తుంటే అడ్డుకునే వారే లేకపోయారని పేర్కొన్నారు. పార్లమెంటులో బీఆర్‌ఎస్ ఎంపీలు ఉంటే ఈ ప్రయత్నాన్ని అడ్డుకునేవారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బొగ్గు గనులను వేలం వేయొద్దని ప్రధానికి లేఖ రాసిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు అధికారంలో ఉండి కూడా ఆ ప్రయత్నాన్ని అడ్డుకోలేకపోతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రం నుంచి కేంద్ర గనుల శాఖ మంత్రిగా కిషన్‌రెడ్డి నియమితులైతే.. మనకు ఏదైనా ఒక ప్రాజెక్ట్ రావాల్సింది పోయి ఉన్నదాన్ని అమ్మే పరిస్థితికి తెచ్చారని కేటీఆర్ విమర్శించారు. లోక్‌సభలో బీఆర్‌ఎస్ లేనందువల్లే కేంద్రం సింగరేణిని ఖతం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. తెలంగాణలో బీజేపీకి 8 ఎంపీ సీట్లిస్తే ప్రజలకు వారిచ్చే రిటర్న్ గిఫ్ట్ ఇదేనా? అని ఆయన నిలదీశారు. బొగ్గు గనులను ప్రైవేటు వ్యక్తులకు కాకుండా సింగరేణికి అప్పగించేలా చూడాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత ఇనుము గనులు లేకపోవడం వల్లనే నష్టాల్లోకి వెళ్లిందన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బైలదిల్ల గనిని క్యాప్టివ్ మైన్ కింద విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేటాయించమని అడిగితే కేంద్రం ఇవ్వలేదని, దాన్ని వేలంలో అదానీకి అప్పగించిందని చెప్పారు. సొంత గని లేకపోవడం వల్ల నష్టాల్లోకి వెళ్లిన విశాఖ ఉక్కును ప్రైవేటుకు అమ్మాలని చూశారన్నారు. సింగరేణి విషయంలో కూడా అదే వ్యూహం అవలంబించబోతున్నారన్నారని.. దాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమర్థిస్తే, నష్టపోయే ప్రమాదం ఉందని చెప్పారు.

మేం వచ్చాక రద్దు చేస్తాం..

నాలుగున్నరేళ్ల తర్వాత రాష్ట్రంలో అధికారం తమదేనని కేటీఆర్ అన్నారు. కేంద్రం కుట్రలో భాగంగా వేలంలో ఎవరైనా బొగ్గు గనులను దక్కించుకుంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాగానే వాటిని రద్దు చేస్తామని చెప్పారు. సింగరేణికి దక్కాల్సిన బొగ్గు గనులను ఇతరులకు అప్పగించేలా వేలం నిర్వహించాలని బీజేపీ తీసుకున్న నిర్ణయానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఎందుకు వంత పాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. గతంలో ఈ బొగ్గు గనులను వేలం వేయాలని ప్రయత్నిస్తే దాన్ని సమర్థించబోమంటూ అప్పటి సీఎం కేసీఆర్ కేంద్రానికి లేఖ రాయడంతో ఆ నిర్ణయాన్ని విరమించుకున్నారని చెప్పారు. తెలంగాణలోని బొగ్గు గనులను వేలం వేయకుండా ఇప్పటి వరకు బీఆర్‌ఎస్ రక్షణ కవచంలా నిలిచిందని కేటీఆర్ స్పష్టం చేశారు. సింగరేణికి బొగ్గు గనులు కేటాయించాలంటూ ఎంపీ, పీసీసీ అధ్యక్షుడి హోదాలో 2021 డిసెంబరు 11న కేంద్రాన్ని డిమాండ్ చేసిన రేవంత్‌రెడ్డి వైఖరి ఇప్పుడు ఎందుకు మారిపోయిందని ప్రశ్నించారు. సింగరేణి ప్రైవేటీకరణకు పరోక్షంగా ఒప్పుకున్నట్లేనా అని ప్రశ్నించారు. బొగ్గు గనులను వేలం వేసి, సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందన్నారు. ఈ అంశంపై పార్టీ ముఖ్యనేతలతో చర్చించి త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు.

చౌటుప్పల్‌లో ఫ్లైఓవర్

» హైదరాబాద్-విజయవాడ రహదారిపై తీరనున్న ప్రయాణికుల కష్టాలు

» శంకుస్థాపన చేయనున్న కేంద్ర మంత్రి గడ్కరీ

చౌటుప్పల్ టౌన్, జూన్ 20: తెలుగు రాష్ట్రాల మధ్య అత్యంత కీలకమైన హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ప్రయాణికుల కష్టాలు కొంతమేర తీరనున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో భారీ ఫ్లైఓవర్ నిర్మాణం కానుంది. తహసీల్దార్ కార్యాలయం నుంచి పద్మావతి ఫంక్షన్‌హాల్ వరకు రెండు కిలోమీటర్ల పొడవున, రూ.82 కోట్లతో దీనిని చేపట్టనున్నారు. గట్టిదనం పరంగా భూమి కూడా అనుకూలంగా ఉందని తేలింది. దీంతో నిర్మాణం చకచకా జరిగే వీలుంది. కాగా, కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి గడ్కరీ త్వరలో ఫ్లైఓవర్ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం. నిర్మాణ సమయంలో ఇరువైపుల నుంచి వాహనాలు వెళ్లేందుకు వీలుగా.. జాతీయ రహదారుల సంస్థ అధికారులు సర్వీస్ రోడ్ల నిర్మాణం, మరమ్మతులను చేపట్టారు. వలిగొండ అడ్డ రోడ్డు నుంచి పద్మావతి ఫంక్షన్ హాల్ వరకు 500 మీటర్ల మేర పనులు సాగుతున్నాయి. ఇవి వారం, పది రోజుల్లో పూర్తికానున్నాయి. ఒకవైపు కాగానే, రెండోవైపు చేపడతారు. కాగా, జాతీయ రహదారి నిర్మాణ సమయంలో ఈ ప్రాంతాల్లో సర్వీస్ రోడ్డు నిర్మించలేదు. కాగా, ఫ్లైఓవర్ నిర్మాణ కాంట్రాక్ట్‌ను హరియాణాకు చెందిన రాంకుమార్ కన్‌స్ట్రక్షన్స్ దక్కించుకుంది. 15 రోజుల్లో ఈ సంస్థ రంగంలోకి దిగనున్నట్లు తెలుస్తోంది.



చౌటుప్పల్‌లో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై సర్వీస్ రోడ్డు నిర్మాణం

మంత్రి కోమటిరెడ్డి చొరవతో..

జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ఫ్లైఓవర్లను నిర్మించేందుకు రాష్ట్ర రోడ్లు, భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి భువనగిరి ఎంపీగా ఉన్నప్పటి నుంచే చొరవ చూపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారు. ప్రమాదకర ప్రాంతాల (బ్లాక్ స్పాట్)లను గుర్తించి ఫ్లైఓవర్ల నిర్మాణానికి ప్రతిపాదించారు. దీనికి సంతృప్తి చెందిన కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.



రావి ఆకుపై ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి ఎండీ చిత్రం

ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ పుట్టినరోజు సందర్భంగా సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణానికి చెందిన లీఫ్ ఆర్టిస్టు గుండు శివకుమార్ రావి ఆకుపై ఆయన చిత్రాన్ని వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శివకుమార్ వెయ్యి మందికిపైగా ప్రముఖుల చిత్రాలను రావి ఆకులపై చిత్రీకరించారు.

- నారాయణఖేడ్

త్రీడీ ప్రింటింగ్‌తో పాదచారుల వంతెన



ఐఐటీ-హెచ్‌లో త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీతో నిర్మించిన వంతెనను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ సుబ్రమణ్యం

» దేశంలోనే తొలిసారిగా కంది ఐఐటీ-హెచ్‌లో నిర్మాణం

కంది, జూన్ 20 : త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీతో తక్కువ కాంక్రీటును వినియోగించి, అత్యంత వేగంగా దేశంలోనే తొలిసారిగా పాదచారుల వంతెనను ఐఐటీ-హెచ్ శాస్త్రవేత్తలు నిర్మించారు. సంగారెడ్డి జిల్లా కంది సమీపంలోని ఐఐటీ-హెచ్ సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ కేవీఎల్ సుబ్రమణ్యం తన బృందంతో దీన్ని క్యాంపస్ ప్రాంగణంలో నిర్మించారు. మెటీరియల్ ఫాలోస్ ఫోర్స్‌ని అనుసరించి నిర్మించిన ఈ వంతెన పొడవు దాదాపు 7.5 మీటర్లు. గురువారం ప్రొఫెసర్ కేవీఎల్ సుబ్రమణ్యం ఈ వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సింప్లిఫోర్జ్ క్రియేషన్స్ స్టార్టప్ కంపెనీ సహకారంతో దీన్ని నిర్మించామని, నిర్మాణంలో డిజైన్ మెథడాలజీలో అనేక పురోగతుల రూపకల్పన జరిగిందన్నారు. మిగతా వంతెనల కంటే ఇది తక్కువ బరువు ఉంటుందని, అత్యంత వేగంగా ఈ వంతెనను నిర్మించవచ్చన్నారు. అంతేగాక ఈ వంతెన నిర్మాణానికి మానవ వనరుల అవసరం తక్కువగా, యంత్రాల వినియోగం ఎక్కువగా ఉంటుందని వివరించారు. ఐఐటీ-హెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ దేశంలో మౌలిక సదుపాయాల అవసరాలను తీర్చడానికి సాంకేతికతతో కూడిన పరిష్కారాలు ఎంతో అవసరమని అన్నారు.

గాడితప్పుతున్న పోలీసింగ్?

చిన్నారులపై దారుణాలు.. గంజాయి బ్యాచ్ ఆగడాలు

» పోలీసుల తీరుపై నెటిజన్ల ఆగ్రహం
» వరుస పరిణామాలపై సీఎం సీరియస్?
» రంగంలోకి ఉన్నతాధికారులు.. హితబోధ



హైదరాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ గాడితప్పుతోందా? శాంతిభద్రతలపై పట్టు కోల్పోతోందా? ఒక్క ఫోన్‌తో న్యాయం జరుగుతుందనే పేరున్న డయల్-100 ప్రజల విశ్వాసాన్ని కోల్పోతోందా? ఈ ప్రశ్నలకు తాజా పరిణామాలు ఔననే చెబుతున్నాయి. ఉట్నూరు ఘటనలో డయల్-100కు ఫోన్ చేస్తే.. పోలీసులు వచ్చి, కాపాడతారనే విశ్వాసం పోయిందని నెటిజన్లు విమర్శిస్తున్నారు. ఆ ఘటనలో ఎస్సైని సస్పెండ్ చేసినా.. అది కంటితుడుపు చర్యేనని, పోలీసుల ఆలస్యానికి.. పోయిన ప్రాణం తిరిగి రాదు కదా? అని ప్రజలు భావిస్తున్నారు. తల్లిపక్కన నిద్రిస్తున్న ఆరేళ్ల చిన్నారిని ఎత్తుకెళ్లి హత్యాచారానికి పాల్పడ్డ ఘటనపైనా ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇంటిముందు ఆడుకుంటున్న తొమ్మిదేళ్ల చిన్నారిపై మద్యం మత్తులో ఓ వ్యక్తి అఘాయిత్యం వంటి ఘటనలు శాంతిభద్రతల పాలిట ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. రాష్ట్రంలో డీపీడీ గ్యాంగ్‌లు పెట్రేగిపోతున్నాయి. చెడ్డీగ్యాంగ్, చుడీదార్ గ్యాంగ్, థార్ గ్యాంగ్ దొంగల ముఠాలు ఓవైపు.. చిన్నారులను అపహరించే ముఠాల సంచారం ఇంకోవైపు.. వరుస హత్యలు మరోవైపు.. ఇలాంటి దారుణాలు పతాకశీర్షికలకెక్కుతున్నాయి. "దొంగల గ్యాంగ్ తిరుగుతోంది. అప్రమత్తంగా ఉండండి. ఇట్లు.. ఎస్‌హెచ్‌వో" అంటూ వాట్సా‌ప్‌లలో జాగ్రత్తల పేరుతో పోలీసులు సందేశాలను పంపడం తప్పితే.. ఇప్పటికీ ఈ గ్యాంగ్‌ల జాడనైనా కనుక్కొన్న దాఖలాలు లేకపోవడం గమనార్హం..! "రాష్ట్రంలో మాదక ద్రవ్యాలకు తావు ఉండొద్దు".. అంటూ సీఎం రేవంత్ ఆదేశాలు జారీ చేసినా.. హైదరాబాద్‌లో, శివార్లలో గంజాయి బ్యాచ్ ఆగడాలు రోజురోజుకూ శ్రుతిమించుతుండడం నిఘా వైఫల్యమేనని నెటిజన్లు ట్రోలింగ్ చేస్తున్నారు.

బదిలీలపైనే ఫోకస్..!

ఓ వైపు దారుణాలు చోటుచేసుకుంటుంటే.. పోలీసులు ఏం చేస్తున్నారు? మొన్నటి వరకు అసెంబ్లీ ఎన్నికలతో బిజీగా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బదిలీలపై దృష్టి సారించడంతో.. పోలీసులు కంఫర్ట్, ఫోకస్ ఉండే పోస్టులను దక్కించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం కీలకమైన ఒక్కో పోస్టుకు ముగ్గురి కంటే ఎక్కువ మంది అధికారులు పోటీపడుతుండడం గమనార్హం. ఈ తరుణంలో గంటల వ్యవధిలోనే దారుణాలు వెలుగులోకి రావడంతో.. పోలీసు సిబ్బంది కూడా తమ శాఖపై అసంతృప్తిని వ్యక్తం చేస్తుండడాన్ని బట్టి పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

సీసీఎస్‌పై ఆరోపణలు..!

సెటిల్మెంట్లు.. లంచాలతో హైదరాబాద్ సీసీఎస్ కీర్తి రోజురోజుకూ మసకబారుతోంది. ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు ఉదంతంలో ఏకంగా కిడ్నాప్‌లు, బెదిరింపులకు సీసీఎస్‌ను వాడుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఇప్పుడు ఏకంగా ఓ ఇన్‌స్పెక్టర్ రూ.లక్షల మేర లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. హైప్రొఫైల్ కేసులే సీసీఎస్‌కు వస్తుంటాయి. ఈ నేపథ్యంలోనే అధికారులు పక్కదారి పడుతున్నారనే విమర్శలున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన నౌహీరాషేక్ కేసులోనూ సీసీఎస్ అధికారులు పెద్దమొత్తంలో వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. ఇటీవల సీసీఎస్‌పై విమర్శలు వస్తుండడంతో హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి స్వయంగా ఆ కార్యాలయానికి వెళ్లారు. ఒకరిద్దరు అధికారుల పేర్లను బహిరంగానే ప్రస్తావిస్తూ సున్నితంగా మందలించినట్లు తెలిసింది. అటు డీజీపీ రవిగుప్తా కూడా ఎప్పటికప్పుడు సీపీలు, ఎస్పీలతో సమీక్షలు నిర్వహిస్తూ.. సమర్థంగా పనిచేయాలని ఆదేశిస్తున్నారు. సీఎం కూడా పోలీసు శాఖ తీరుపై సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. తాజా బదిలీలపై ఆ ప్రభావం ఉన్నట్లు తెలుస్తోంది.

ఫోన్ ట్యాపింగ్‌తో చీలిక..

పోలీసు శాఖలో ఫోన్ ట్యాపింగ్ కేసు చిచ్చుపెట్టిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత పోలీసుల్లో చీలిక స్పష్టంగా కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన వారిపై మిగతా వారు ఒక రకమైన అభిప్రాయంతో ఉంటున్నారు. గత ప్రభుత్వంలో కొందరు ఐపీఎస్‌లు వ్యవహరించిన తీరు ఆధారాలతోసహా బయటకు రావడంతో.. కింది స్థాయి సిబ్బందిలో ఐపీఎస్ అంటే భయం ఒక్కసారిగా తుడిచిపెట్టుకుపోయింది. ఇన్‌స్పెక్టర్, డీఎస్పీ నుంచి ఏకంగా ఐపీఎస్‌ల వరకు ఈ చీలిక స్పష్టంగా కనిపిస్తోంది.

జైళ్లశాఖలో అపనమ్మకం..

జైళ్లశాఖలోనూ విచిత్ర పరిస్థితి నెలకొంది. అధికారులు అభద్రతా భావంతో ఇతర సిబ్బందిపై అపనమ్మకంతో ఉంటున్నారు. ఒకరిపై మరొకరు నిఘా పెడుతున్నారు. మొదటిసారి జైళ్ల శాఖకు ఓ మహిళ డీజీగా వచ్చారు. అధికారుల తీరుపై సందేహం రావడంతో ఎంపిక చేసిన కొందరిపై నివేదిక ఇవ్వాలంటూ ఇంటెలిజెన్స్‌కు విజ్ఞప్తి చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

పోలీసు విచారణకొచ్చిన మహిళ అనుమానాస్పద మృతి

» నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో ఘటన
» ఫిట్స్ రావడంతో ఆమెను ఆస్పత్రికి తరలించామంటున్న పోలీసులు
» విషం తీసుకుందన్న వైద్యులు
» మెరుగైన చికిత్సకు తరలిస్తుండగా మరణం



లక్ష్మి (ఫైల్)

కొల్లాపూర్, జూన్ 20: దొంగతనం కేసులో విచారణ నిమిత్తం పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మరణించింది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పోలీసుస్టేషన్‌లో గురువారం ఈ ఘటన జరిగింది. కొల్లాపూర్ ఎస్సై రిషికేష్ కథనం ప్రకారం.. జిల్లాలోని చిన్నంబావి మండలం వెంటూరుకు చెందిన లక్ష్మి.. కొల్లాపూర్‌లోని సాయికృప ఆస్పత్రిలోని మందుల దుకాణంలో పని చేసేది. ఆస్పత్రి నిర్వాహకులు ఆరు నెలల క్రితం లక్ష్మిపై దొంగతనం కేసు పెట్టారు. ఈ కేసు విచారణ నిమిత్తం పోలీసుల పిలుపు మేరకు లక్ష్మి గురువారం కొల్లాపూర్ పోలీసు స్టేషన్‌కు వచ్చింది. స్టేషన్‌లోకి వచ్చి కూర్చున్న కాసేపటికే లక్ష్మికి ఫిట్స్ రాగా పోలీసు సిబ్బంది ఆమె చేతిలో తాళం చెవులు పెట్టి అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లక్ష్మిని పరీక్షించిన వైద్యులు ఫిట్స్ కాదని, బాధితురాలు విషం తీసుకుందని అనుమానం వ్యక్తం చేసి జిల్లా ఆస్పత్రికి తరలించాలని సిఫారసు చేశారు. మెరుగైన వైద్యం కోసం నాగర్‌కర్నూల్ తరలిస్తుండగా మార్గమధ్యలోనే లక్ష్మి కన్నుమూసింది. కాగా, లక్ష్మికి భర్త, కుమార్తె ఉన్నారు. ఆస్పత్రి నిర్వాహకులు దొంగతనం కేసులో తనతోపాటు కుటుంబసభ్యుల పేర్లు కూడా చేర్చడంతో లక్ష్మి తీవ్ర మనోవేదనకు గురైందని ఆమె కుటుంబీకులు చెబుతున్నారు.

పాత్రికేయుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

» టీయూడబ్ల్యూజే మహాసభల్లో భట్టి, తుమ్మల



ఖమ్మం సాంస్కృతికం, జూన్ 19: పాత్రికేయుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర తృతీయ మహాసభలు గురువారం ఖమ్మంలో ఘనంగా ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన భట్టి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో మీడియా స్వేచ్ఛకు భంగం కలుగనివ్వబోమన్నారు. గత ప్రభుత్వ హయాంలో మీడియా స్వేచ్ఛకు తీవ్ర విఘాతం కలిగించారన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు తదితర సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని చెప్పారు. తుమ్మల మాట్లాడుతూ జర్నలిస్టులు నిబద్ధతతో వ్యవహరించి ప్రజాహితం కోసం పాటుపడాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ విశాలాంధ్ర పత్రికలో జర్నలిస్టుగా పనిచేసిన రోజులను గుర్తుచేసుకున్నారు.

టీయూడబ్ల్యూజే అధ్యక్షుడిగా విరాహత్ అలీ

టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర నూతన కార్యవర్గం గురువారం ఎన్నికైంది. ఖమ్మంలో నిర్వహిస్తున్న సంఘం రాష్ట్ర మూడో మహాసభల ముగింపు సందర్భంగా మీడియా అకాడమీ అధ్యక్షుడు కె. శ్రీనివాసరెడ్డి సమక్షంలో నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా కె. విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శిగా కట్టెకోల రాంనారాయణను ఎన్నికయ్యారు.

అంధ విద్యార్థినికి ఐఐఎంలో సీటు



అంధ విద్యార్థి శివాని

జహీరాబాద్, జూన్ 20: శారీరక లోపం జీవితంలో ఎదుగుదలకు, లక్ష్య సాధనకు అడ్డంకి కాదని నిరూపించింది ఆ యువతి. కళ్లు లేకపోయినా సంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ యువతి ప్రఖ్యాత ఐఐఎం(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్)లో సీటు సాధించింది. జిల్లాలోని జహీరాబాద్ పట్టణంలోని గడి ప్రాంతానికి చెందిన గోపాల్ రెడ్డి-విజయలక్ష్మి దంపతుల రెండో కూతురు శివాని. అంధురాలైన శివాని.. ఐఐఎం ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి దేశవ్యాప్తంగా ఉన్న 21 ఐఐఎం కళాశాలల్లో 19 చోట్ల సీటు సాధించిందని ఆమె తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఇండోర్ ఐఐఎం కళాశాలలో శివాని చేరనున్నట్లు వారు తెలిపారు.



మంటల్ని ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

'సికింద్రాబాద్ స్టేషన్'లో 2 బోగీలకు మంటలు

» వాషింగ్ సైడ్ వద్ద కొత్త రైలు నిలిపి ఉంచగా ప్రమాదం..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆలుగడ్డ బావి వద్ద ఉన్న రైల్వే వాషింగ్ సైడ్ వద్ద ఆగి ఉన్న ఓ కొత్త రైలు రెండు బోగీలకు మంటలంటుకొని అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరుగలేదు. 15 బోగీలతో కూడిన ఈ రైలు శుక్రవారం ప్రయాణికులకు అందుబాటులోకి రావాల్సి ఉంది. అయితే దీన్ని 15 రోజుల క్రితం వాషింగ్ యార్డులో నిలిపారు. ఏమైందో తెలియదు గానీ.. గురువారం ఉదయం 11.15 గంటల సమయంలో ఆ రైలు వంట గదులున్న (ప్యాంట్రీ) చివరి రెండు బోగీలకు మంటలంటుకున్నాయి. దీంతో రైల్వే సిబ్బంది అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. మంటలు వ్యాపిస్తుండటంతో రైల్వే సిబ్బంది మిగతా బోగీలతో ఆ రెండు బోగీలను వేరు చేశారు. ఇటు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని కష్టపడి మంటలను అదుపు చేశారు.



రిటైర్డు పోలీసు అధికారిఫాం హౌస్‌కు వేసిన రోడ్డు

రైతు పొలం నుంచి అక్రమంగా రోడ్డు

రిటైర్డ్ పోలీసు ఫాంహౌస్ కోసం దారి

తొలగించాలని కోరినా పట్టించుకోని వైనం

వికారాబాద్, జూన్ 20(ఆంధ్రజ్యోతి): ఒక రైతు పొలం మధ్య నుంచి రిటైర్డ్ పోలీసు ఉన్నతాధికారి ఒకరు తన ఫాం హౌస్‌కు రోడ్డు వేసుకున్నాడు. ఆ రోడ్డును తొలగించేందుకు ప్రయత్నించిన ఆ రైతు కొడుకుపై పోలీసులు కేసు నమోదు చేశారు. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం మమ్మదాన్‌పల్లిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ గ్రామానికి చెందిన ఎన్కపల్లి చంద్రమ్మకు సర్వే నంబరు 514/ఆ/1లో 1.36 గుంటల పొలం ఉంది. 2016లో ఆ పొలాన్ని పాలెవారు సాగు చేసేవారు. ఆ సమయంలో ఫాం హౌస్‌కు దారి ఉందని చెప్పి రిటైర్డ్ పోలీసు అధికారితో దళారులు భూమి కొనిపించారు. చంద్రమ్మకు కాకుండా ఆమె దాయాదులకు డబ్బు ఇచ్చి ఆమె పొలం మధ్య నుంచి రోడ్డు వేశారు. ఆస్తి పంపకాల్లో సర్వే నంబరు 514/ఆ/1లోని పొలం చంద్రమ్మకు వచ్చింది. ఆమె కుటుంబీకులు తమ పొలంలోని రోడ్డును తొలగించాలని చెప్పినా సంబంధిత వ్యక్తులు పట్టించుకోలేదు. చంద్రమ్మ కొడుకు అశోక్ ఎక్స్‌కవేటర్‌తో రోడ్డును తవ్వే ప్రయత్నం చేశాడు. దీంతో మధ్యవర్తులు కేసులతో తనను భయపెడుతున్నారని అతను తెలిపాడు. నవాబుపేట స్టేషన్‌లో ఎస్సై కేసు నమోదు చేయడంపై బాధితుడు గతంలో ఎస్పీ కోటిరెడ్డిని కలిసి వివరించాడు. ఇప్పుడు ఆయన బదిలీపై వెళ్లిపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక అశోక్ వేదన చెందుతున్నాడు. కాగా, రోడ్డు తొలగిస్తే తమ సంగతి చూస్తామంటున్నారని అశోక్ చెప్పారు. తనకు ప్రాణహాని ఉందని ఆందోళన చెందుతున్నాడు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఇంట్లో ఈడీ సోదాలు

» మొత్తం 8 చోట్ల ఒకేసారి తనిఖీలు



పటాన్‌చెరు, జూన్ 20: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి నివాసాలు, కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. ఏకకాలంలో బృందాలుగా విడిపోయి పటాన్‌చెరులోని ఆయన నివాసం, పట్టణంలోని శాంతినగర్‌లో ఉండే తమ్ముడు గూడెం మధుసూధన్‌రెడ్డి, నిజాంపేటలో ఉండే అల్లుడి ఇళ్లపై, పటాన్‌చెరు, హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మహిపాల్ రెడ్డి కార్యాలయాలు, జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మొత్తం ఎనిమిది చోట్ల సోదాలు చేపట్టిన ఈడీ.. పలు కీలక డాక్యుమెంట్లు, హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన సోదాలు.. రాత్రి తొమ్మిదిన్నర వరకు కొనసాగాయి. మహిపాల్‌రెడ్డి బీఆర్‌ఎస్ తరఫున మూడోమారు వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. బీఆర్‌ఎస్ హయాంలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఆయన అక్రమార్జనకు తెరతీశారన్న ఆరోపణలు ఉన్నాయి. సంగారెడ్డి మండలం ఆరుట్ల, పటాన్‌చెరు మండలం లక్డారం, చిన్నకంజర్ల గ్రామాల్లో పెద్దఎత్తున స్టోన్‌క్రషర్లు, క్వారీలను మహిపాల్‌రెడ్డి కుటుంబం నిర్వహిస్తోంది. మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారాల ద్వారా కోట్లాది రూపాయలు కూడబెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో లక్డారంలో ఆయన సోదరుడు గూడెం మధుసూధన్ రెడ్డి నిర్వహిస్తున్న సంతోష్ శ్యాండ్‌స్టోన్ సంస్థపై దర్యాప్తు చేపట్టారు. ఆ సంస్థలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని జిల్లా మైనింగ్, రెవెన్యూ అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. మైనింగ్ శాఖకు కట్టాల్సిన సీనరేజ్ సొమ్ము రూ.342 కోట్లు ఎగ్గొట్టారని లెక్కలు తేల్చారు. సదరు సొమ్మును ప్రభుత్వ ఖజానాలో జమ చేయాలని నోటీసులను సైతం జారీ చేశారు. లీజులో లేని భూమిలో అక్రమ మైనింగ్ పాల్పడినందుకు గూడెం మధుసూదన్‌రెడ్డిపై రెవెన్యూ, మైనింగ్ శాఖలు వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదు చేశారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు మధుసూధన్‌రెడ్డిని అరెస్ట్ చేసి జైలుకు సైతం పంపారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కుటుంబసభ్యుల అక్రమార్జనపై ఈడీ దృష్టి కేంద్రీకరించినట్లు తెలిసింది.

రాజకీయ కక్షతోనే సోదాలు: మహిపాల్‌రెడ్డి

ఈడీ సోదాలు కొండను తవ్వి ఎలుకను పట్టిన చందాన ఉందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోదాల అనంతరం ఆయన మాట్లాడారు. ఉదయం నుంచి రాత్రి వరకు తన, తన సోదరుడి ఇళ్లలో సోదాలు చేశారని, ఇదంతా రాజకీయ కక్షతోనే జరిగిందని ఆరోపించారు. తమ వద్ద నుంచి కేవలం జిరాక్స్ పత్రాలు తప్ప చిల్లి గవ్వ, తులం బంగారం సైతం తీసుకెళ్లలేదని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులపై కక్ష పూరితంగా వేధింపులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు.

చెంచు మహిళను వివస్త్రను చేసి.. కళ్లు, మర్మాంగాల్లో పచ్చి కారం!

కౌలుదార్ల దుర్మార్గం.. భూమిని కౌలుకిచ్చి వారి దగ్గరే పనికి వెళుతున్న మహిళ

» భర్తతో గొడవపడి మరో గ్రామానికి.. అక్కడి నుంచి తెచ్చి నిర్బంధించి చిత్రహింసలు
» నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘోరం..

కొల్లాపూర్, జూన్ 20: ఓ చెంచు మహిళను నిర్బంధించిన ఆ కౌలుదార్లు అత్యంత క్రూరంగా హింసించారు. వివస్త్రను చేసి కొట్టారు. ఆపై పచ్చి మిరపకాయలను దంచి ఆమె కళ్లలో, మర్మాంగాల్లో పెట్టారు. మర్మాంగాలపై డీజిల్ పోసి అగ్గిపుల్ల గీసి కాల్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామంలో ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఆమె పొలాన్ని కౌలుకు తీసుకొని.. ఆమెతోనే కూలీ పనులు చేయిస్తూ.. ఇంట్లో గొడవల కారణంగా కొన్ని రోజులుగా ఆమె పనులకు రాకపోవడంతో ఆగ్రహం చెంది వారు ఈ దారుణానికి ఒడిగట్టారు. బాధిత కుటుంబానికి చెందిన భూమిని అదే గ్రామానికి చెందిన బండి శివమ్మ, బండి శివుడు, బండి వెంకటేశ్వర్లు కౌలుకు తీసుకున్నారు. అక్కడే బాధిత మహిళ, భర్తతో కలిసి రోజూ సాగు పనులు చేస్తోంది. పది రోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో ఆమె అలిగి పుట్టిల్లయిన తీర్నాంపల్లికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లోంచి బయటపడింది. అయితే ఆమె ఆ గ్రామానికి కాకుండా పరిచయస్తులు ఉన్న చుక్కాయిపల్లి గ్రామానికి వెళ్లింది. భార్య గురించి అత్తామామలకు భర్త ఫోన్ చేసి అడగ్గా, ఆమె తమ ఇంటికి రాలేదని వారు చెప్పారు. దీంతో భార్య గురించి ఆందోళన చెందుతుండగానే మరోవైపు కౌలుదార్లు అయిన శివమ్మ, వెంకటేశ్వర్లు, శివుడు.. ఆమె ఆచూకీని గుర్తించి చుక్కాయిపల్లికి వెళ్లారు. ఆమెకు మాయమాటలు చెప్పి గ్రామంలోని తమ ఇంటికి తీసుకొచ్చారు. అక్కడ ఆమెను నిర్బంధించి దాష్టీకాలకు పాల్పడ్డారు. మరోవైపు.. కుటుంబ నియంత్రణ గురించి చెంచు నాయకులు మొలచింతపల్లి గ్రామానికొచ్చి ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పిస్తుండగా ఈ ఘోరం వెలుగుచూసింది. చెంచు నాయకులు పోలీసులకు సమాచారమివ్వడంతో వారొచ్చి బాధిత మహిళను కాపాడారు. ఆమె నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమెను చికిత్స నిమిత్తం కొల్లాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పౌర హక్కుల సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. నిందితులు వెంకటేశ్వర్లు, శివుడు, శివమ్మపై కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పౌర హక్కుల సంఘం ప్రతినిధులు కొల్లాపూర్ డీఎస్పీ శ్రీనివాస్‌కు వినతిపత్రమిచ్చారు. చెంచు మహిళను చిత్రహింసలకు గురిచేసిన ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని మంత్రి జూపల్లి ఆదేశించారు. చెంచు మహిళపై దాడి ఘటనలో ముగ్గురు నిందితులతో పాటు బాధితురాలి అక్క, బావ కూడా ఉన్నట్లు డీఎస్పీ చెప్పారు. వీరిలో ఇప్పటికే నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

పార్ట్‌టైమ్ బీటెక్‌కు జేఎన్‌టీయూ పచ్చజెండా

» వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రవేశాలు



హైదరాబాద్ సిటీ, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం పార్ట్‌టైమ్ బీటెక్ ప్రోగ్రామ్‌ల నిర్వహణకు జేఎన్‌టీయూ పచ్చజెండా ఊపింది. పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న ప్రొఫెషనల్స్ తమ ఉద్యోగాలు చేస్తూనే బీటెక్ కోర్సులను అభ్యసించేందుకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) మార్గం సుగమం చేసింది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌తో పాటు మెకానికల్, మెటలర్జికల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో పార్ట్‌టైమ్ బీటెక్ ప్రవేశాల నిమిత్తం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ ప్రతిపాదనలు పంపగా జేఎన్‌టీయూ వీసీ బుర్రా వెంకటేశం ఆమోదం తెలిపారు. దీంతో ఈ విద్యా సంవత్సరం(2024-25)నుంచే జేఎన్‌టీయూలో పార్ట్‌టైమ్ బీటెక్ ప్రవేశాలకు అనుమతిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా కోర్సులకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు. ఒక్కో కోర్సులో గరిష్ఠంగా 30 సీట్ల చొప్పున అనుమతించడంతో మొత్తం మూడు కోర్సుల్లో 90 మంది డిప్లొమా హోల్డర్లు నేరుగా బీటెక్ సెకండియర్‌లో అడ్మిషన్ తీసుకునే అవకాశం ఏర్పడుతోంది. పార్ట్‌టైమ్ బీటెక్‌లో ప్రవేశం కోసం వర్కింగ్ ప్రొఫెషనల్స్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో కనీసం ఏడాది పని చేసిన అనుభవం కలిగి ఉండాలి. మూడేళ్ల డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్, ఒకేషనల్ కోర్సులతో పాటు మూడేళ్ల బీఎస్సీ కోర్సులు పూర్తిచేసిన వారు కూడా అర్హులు. కనీసం 45శాతం మార్కులతో ఆయా కోర్సులను పూర్తి చేసి ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా రెగ్యులర్ బీటెక్ మాదిరిగానే పార్ట్‌టైమ్ బీటెక్ కూడా పూర్తి చేసుకోవచ్చు.

బ్లెండెడ్ విధానంలో బోధన

వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు బీటెక్ ప్రోగ్రామ్‌లను పార్ట్‌టైమ్ మాదిరిగా కాకుండా బ్లెండెడ్ విధానంలో నిర్వహించాలని యోచిస్తున్నాం. ఆచార్యులకు, ప్రొఫెషనల్స్‌కు అనువైన సమయాల్లో ఆయా కోర్సుల బోధన ఉండేలా ప్రణాళిక చేస్తున్నాం. ఏఐసీటీఈ అనుమతి మేరకు 60 శాతం సిలబస్‌ను ఆఫ్‌లైన్/ఆన్‌లైన్ క్లాస్‌వర్క్ ద్వారా, 40శాతం సిలబస్‌ను మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సెస్ (మూక్స్)లతో పూర్తిచేయవచ్చు.

- జి.వి.నర్సింహారెడ్డి, జేఎన్‌టీయూ కాలేజీ ప్రిన్సిపాల్

ఫోన్ ట్యాపింగ్ కేసు.. దర్యాప్తు అధికారులకు చుక్కెదురు..!

» చార్జిషీట్‌ను తిరస్కరించిన కోర్టు
» నిందితుల బెయిల్ పిటిషన్ల డిస్మిస్

హైదరాబాద్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు అధికారులకు కోర్టులో చుక్కెదురైంది. సంచలనం సృష్టించిన ఈ కేసులో ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తుపై అధికారులు ఇటీవల నాంపల్లి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఆ అభియోగపత్రాలను పరిశీలించిన న్యాయమూర్తి అందులో వివరాలు, సమర్పించిన ఆధారాలు సమగ్రంగా లేవని పేర్కొంటూ.. చార్జిషీట్‌ను తిరస్కరించారు. దీంతో అధికారులు న్యాయ నిపుణుల సలహాతో ముందుకు సాగాలని నిర్ణయించారు. చార్జిషీట్ తిరస్కరణకు గురవ్వడం.. తమ రిమాండ్ 90 రోజులు పూర్తవ్వడంతో జైలులో ఉన్న నిందితులు రాధాకిషన్‌రావు, భుజంగరావు, తిరుపతన్న మ్యాండేటరీ బెయిల్ పిటిషన్ వేశారు. 90 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌ను పూర్తిచేసుకున్నామని, దర్యాప్తు అధికారులు చార్జిషీట్‌ను దాఖలు చేయకపోవడంతో తమకు బెయిల్ ఇవ్వాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. అయితే.. కేసు కీలక దశలో ఉందని, ఇప్పుడు నిందితులు బయటకు వస్తే.. దర్యాప్తునకు ఆటంకం కలిగించే ప్రమాదం ఉందంటూ గురువారం జరిగిన విచారణ సందర్భంగా పీపీ వాదనలను వినిపించారు. ఇరుపక్షాల వాదనలను నమోదు చేసుకున్న జడ్జి.. పీపీ వాదనలతో ఏకీభవిస్తూ.. నిందితుల బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు.

మరో రెండు వారాలే..!

ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు భారత్ తిరిగి వచ్చేందుకు మరో రెండు వారాల సమయమే ఉంది. అనారోగ్యం కారణంగా అమెరికా వెళ్లిన ఆయన.. రెండు వారాల్లో తిరిగి రావాలి. ఇప్పటి వరకు ఈ కేసులో అరెస్టయిన నలుగురు నిందితులు "ప్రభాకర్‌రావు చెప్పినట్లు చేశాం" అంటూ వాంగ్మూలమిచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభాకర్‌రావును విచారిస్తే ఈ కేసులో రాజకీయ నేతల పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉంటుందని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. మరోవైపు ఇప్పటికే వెలుగులోకి వచ్చిన పలువురు రాజకీయ నేతలను విచారించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ కేసులో నిందితులైన పోలీసుల ఆస్తులపై ఏసీబీతో విచారణ జరిపించాలంటూ డీజీపీకి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఆదాయపన్ను శాఖ కూడా నిందితుల ఆస్తులపై దృష్టి సారించినట్లు సమాచారం.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శుక్రవారం 21 జూన్ 2024

హైదరాబాద్-బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ)- ఫుల్ టైం మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్(ఎంఈ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సహకారంతో ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. కోర్సు వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. హైదరాబాద్ సీఐటీడీ క్యాంపస్‌లో ప్రతి సోమ, మంగళ, బుధ వారాల్లో ఉదయం తొమ్మిదిన్నర నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు; ఓయూ ఇంజనీరింగ్ కాలేజ్(మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్) క్యాంపస్‌లో ప్రతి గురు, శుక్ర, శని వారాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం అయిదున్నర వరకు తరగతులు నిర్వహిస్తారు. స్కాలర్‌షిప్‌లు ఉండవు. ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి ఉస్మానియా యూనివర్సిటీ మాస్టర్స్ డిగ్రీని ప్రదానం చేస్తుంది.

సీఐటీడీలో మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్

స్పెషలైజేషన్‌లు

- మెకానికల్ క్యాడ్/క్యామ్
- టూల్ డిజైన్
- డిజైన్ ఫర్ మాన్యుఫాక్చర్
- మెకట్రానిక్స్

అర్హత వివరాలు: ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కళాశాల నుంచి మెకానికల్ ఇంజనీరింగ్/ప్రొడక్షన్ ఇంజనీరింగ్/ మెకట్రానిక్స్ ఇంజనీరింగ్/ఆటోమొబైల్ ఇంజనీరింగ్/ఏరోనాటికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. అభ్యర్థుల వయసు 45 ఏళ్లలోపు ఉండాలి. గేట్ స్కోర్ తప్పనిసరి కాదు. అడ్మిషన్ ప్రక్రియలో గేట్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోరు. ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగానే ప్రవేశాలు కల్పిస్తారు.



స్పాన్సర్డ్ అభ్యర్థులకు కనీసం రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఓయూ నిబంధనలను అనుసరిస్తూ సీఐటీడీ ఈ పరీక్షని నిర్వహిస్తుంది. అన్నీ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఇస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు. మొత్తం మార్కులు 150. ఇందులో 50 మార్కులకు కామన్ పేపర్, 100 మార్కులకు కోర్ పేపర్ ఉంటాయి.

- కామన్ పేపర్లో సైకోమెట్రిక్ టెస్ట్ కింద పర్సనాలిటీ అండ్ ఆటిట్యూడ్, ఇంగ్లీష్ యూసేజ్, రీడింగ్ కాంప్రహెన్షన్, క్రిటికల్ రీజనింగ్ అంశాల నుంచి 20 ప్రశ్నలు; టెక్నికల్ నాలెడ్జ్ టెస్ట్ కింద 30 ప్రశ్నలు అడుగుతారు. కోర్ పేపర్ పూర్తిగా ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి ఉంటుంది. అభ్యర్థులు డిగ్రీ స్థాయిలో చదివిన బ్రాంచ్‌కు నిర్దేశించిన సిలబస్‌ను అనుసరించి 100 ప్రశ్నలు ఇస్తారు. ఇంజనీరింగ్ విభాగాల సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ప్రకారం అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రెగ్యులర్ అభ్యర్థులు సెమిస్టర్‌కు రూ.41,000; స్పాన్సర్డ్ అభ్యర్థులు సెమిస్టర్‌కు రూ.51,000 చెల్లించాల్సి ఉంటుంది. అటానమస్ ఫీజు కింద రూ.9,770; కాషన్ డిపాజిట్ కింద రూ.1,000 చెల్లించాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 12
- **జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్/డిప్లొమా, డిగ్రీ సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు; టీసీ, బోనఫైడ్, మైగ్రేషన్ సర్టిఫికెట్; కులం, వైకల్యం, ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలు; సర్వీస్ సర్టిఫికెట్‌లు; స్పాన్సరింగ్ లెటర్(స్పాన్సర్డ్ అభ్యర్థులకు మాత్రమే)
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 14
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** citdindia.org

Central Institute of Tool Design

నల్సార్‌లో సర్టిఫికేషన్ కోర్సు



హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లాకు చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీఓఈ)- షార్ట్ టర్మ్ సర్టిఫికేషన్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇందులో ప్రధానాంశం 'సైబర్ క్రైమ్స్ ఇన్వెస్టిగేషన్ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్ యూజింగ్ ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్(ఓసింట్) టూల్స్ అండ్ టెక్నిక్స్'. ఈ కోర్సుకి సెంటర్ ఫర్ సైబర్ లాస్ అండ్ ఫోరెన్సిక్ సైన్సెస్ సహకారం అందిస్తోంది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు, ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. లా చదువుతున్నవారికి, లీగల్ ప్రొఫెషనల్స్‌కు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్లకు ఈ కోర్సు ఉపయోగపడుతుంది. మొత్తం 70 సీట్లు ఉన్నాయి. నల్సార్ విద్యార్థుల కోసం 10 సీట్లు ప్రత్యేకించారు.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి మూడు రోజులు. దీనిని జూలై 5 నుంచి 7 వరకు నిర్వహిస్తారు. ప్రతి రోజూ ఉదయం తొమ్మిదిన్నర నుంచి సాయంత్రం ఆరు వరకు ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. రోజుకి నాలుగు సెషన్స్ ఉంటాయి. ప్రతి సెషన్ రెండు గంటలు ఉంటుంది. ప్రోగ్రామ్‌నకు సంబంధించిన అన్ని సెషన్స్‌ను ఎల్ఎంఎస్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతారు.

- మొదటి రోజు 'సైబర్ లాస్ అండ్ ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ బేసిక్స్', రెండో రోజు 'టూల్స్ అండ్ ఇంజిన్స్ ఫర్ యూస్ ఇన్ ఓసింట్ సెర్చెస్', మూడో రోజు టెక్నికల్ సినారియోస్ అండ్ యూజ్ కేసెస్' అంశాలు వివరిస్తారు. వీటితో పాటు ల్యాబ్ సెషన్స్ కూడా ఉంటాయి. ప్రోగ్రామ్ చివరలో ఫైనల్ ల్యాబ్ అసెస్‌మెంట్ టెస్ట్ ఉంటుంది. కనీసం 75 శాతం అటెండెన్స్ ఉండి అసెస్‌మెంట్ టెస్ట్‌లో కనీసం 50 శాతం మార్కులు వచ్చినవారికి మాత్రమే సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.

- **కోర్సు ఫీజు:** రూ.6000
- **ప్రోగ్రామ్ సెషన్స్:** జూలై 5 నుంచి 7 వరకు
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 4
- **వెబ్‌సైట్:** https:nalsar.ac.in

నీలిట్‌లో డిప్లొమా, డిగ్రీ, పీజీ

అగర్తలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)- ఇంజనీరింగ్ డిప్లొమా, బీసీఏ, ఎమ్మెస్సీ(ఐటీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

ఇంజనీరింగ్ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కోదానిలో 60 సీట్లు చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 35 శాతం మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

బీసీఏ(బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్): ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో 40 సీట్లు ఉన్నాయి.


అర్హత: మేథ్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టులలో ఏవేని రెండు సబ్జెక్టులతో ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు; మూడేళ్ల వ్యవధి గల ఏదేని ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తి చేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

ఎమ్మెస్సీ(ఐటీ): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఎస్సీ(ఐటీ/సీఎస్)/బీసీఏ/బ్యాచిలర్ డిగ్రీ(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథ్స్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్‌తో పాటు బీఎస్సీ/బీకాం/బీఏ పూర్తిచేసినవారు కూడా అర్హులే.

- దరఖాస్తు ఫీజు లేదు.
- **ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 28
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** జూలై 3న
- **ఎంపికైన అభ్యర్థుల మొదటి లిస్ట్ విడుదల:** జూలై 4న
- **వెబ్‌సైట్:** nielitagtadmission.in

ఐఐఎఫ్‌టీల్లో సర్టిఫికెట్ ప్రోగ్రామ్స్



గాంధీనగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ) క్యాంపస్- ఆన్‌లైన్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ ఏఐ అండ్ ఎంఎల్ ఇన్ ఫైనాన్స్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి 20 గంటలు. వారాంతాల్లో ఆన్‌లైన్ ఇంటరాక్టివ్ సెషన్స్ నిర్వహిస్తారు. ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం పదకొండున్నర వరకు; మధ్యాహ్నం పన్నెండు నుంచి సాయంత్రం ఒకటిన్నర వరకు సెషన్స్ ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా కేస్ స్టడీ అనాలిసిస్, అసైన్‌మెంట్స్, ఆన్‌లైన్ క్విజ్‌లు, అసెస్‌మెంట్స్ ఉంటాయి. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎర్లీ ఏజ్ ఫైనాన్స్ ప్రొఫెషనల్స్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్‌లు, ఫిన్‌టెక్ టెక్నాలజీపై ఆసక్తి ఉన్న విద్యార్థులు, బీఎఫ్ఎస్ఐ ప్రొఫెషనల్స్‌కు ఈ ప్రోగ్రామ్ ఉపకరంగా ఉంటుంది.

ప్రోగ్రామ్‌లోని అంశాలు: బేసిక్స్ ఆఫ్ ఏఐ అండ్ ఎంఎల్, డిజిటల్ బ్యాంకింగ్ అండ్ డిజిటల్ పేమెంట్స్, సైబర్ సెక్యూరిటీ, బిగ్ డేటా, డిజిటల్ ఫిన్‌టెక్, ఫ్రాడ్ డిటెక్షన్, యాంటీ మనీ లాండరింగ్, రోబో అడ్వైజింగ్

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.20,000+ 18 శాతం జీఎస్‌టీ
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 25
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** జూన్ 29 నుంచి
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- 'సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇండస్ట్రీ లీడర్స్, మిడిల్ లెవెల్ ఎగ్జిక్యూటివ్‌లు, ఆంత్రప్రెన్యూర్స్‌కు ఈ ప్రోగ్రామ్ ఉపయుక్తంగా ఉంటుంది. ఫ్రెషర్స్ కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అకడమిక్ ప్రతిభ, అనుభవం ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగు నెలలు. దీనిని ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. వారాంతాల్లో ఉదయం తొమ్మిదిన్నర నుంచి సాయంత్రం అయిదు వరకు క్లాస్‌రూం తరగతులు ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రోగ్రామ్‌లో భాగంగా లెక్చర్స్, కేస్ స్టడీ, జనరల్ డిస్కషన్స్, ఇండివిడ్యువల్/గ్రూప్ అసైన్‌మెంట్స్, ఆన్‌లైన్ అసెస్‌మెంట్స్, ప్రజంటేషన్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, క్విజ్‌లు ఉంటాయి. ఇంటర్నల్ ఎగ్జామ్స్, ఫైనల్ ఎగ్జామ్స్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులందరికీ కోర్సు మెటీరియల్, డాక్యుమెంట్స్‌తో కూడిన లెర్నింగ్ వెబ్ పోర్టల్‌కు లైఫ్ టైం యాక్సెస్ ఇస్తారు.

- ఈ ప్రోగ్రామ్‌లో ఇంటర్నేషనల్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆపరేషన్స్ అండ్ డాక్యుమెంటేషన్, ఇండియాస్ ఫారిన్ ట్రేడ్ అండ్ పాలసీ, ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫైనాన్స్, కస్టమ్ రెగ్యులేషన్స్ అండ్ ఇంపోర్ట్ ప్రొసీజర్స్ ఆఫ్ ఇండియా, ఇంటర్నేషనల్ ట్రేడ్ లాజిస్టిక్స్ అంశాలు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1,10,000+18 శాతం జీఎస్‌టీ; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం రాయితీ లభిస్తుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 20
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

జాబ్ కార్నర్

బెల్‌లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రెయినీలు

మొత్తం ఖాళీలు: 32

హైదరాబాద్‌లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.



1. ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రెయినీ: **12 పోస్టులు**
2. టెక్నీషియన్ 'సి': **17 పోస్టులు**
3. జూనియర్ అసిస్టెంట్: **3 పోస్టులు**

అర్హత: ఐటీఐ, ఇంజనీరింగ్ డిప్లొమా, బీకాం, బీబీఎం ఉత్తీర్ణులై ఉండాలి.

జీతం: ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రెయినీ పోస్టుకు రూ.24,500 - రూ.90,000. టెక్నీషియన్, జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు రూ.21,500 - రూ.82,000

వయోపరిమితి: 28 ఏళ్లు మించకూడదు

దరఖాస్తు ఫీజు: జనరల్/ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.250. ఎస్సీ/ ఎస్టీ/దివ్యాంగులు ఎక్స్ సర్వీస్‌మన్‌లకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: షార్ట్‌లిస్ట్, రాత పరీక్ష తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 11

వెబ్‌సైట్: https://belindia.in/

ఎన్ఎఫ్ఎల్‌లో ఇంజనీర్లు

మొత్తం ఖాళీలు: 97

నోయిడాలోని నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్.. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ఎన్ఎఫ్ఎల్ యూనిట్లు/కార్యాలయాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. ఇంజనీర్(ప్రొడక్షన్): **40 పోస్టులు**
2. ఇంజనీర్(మెకానికల్): **15 పోస్టులు**
3. ఇంజనీర్(ఎలక్ట్రికల్): **12 పోస్టులు**
4. ఇంజనీర్(ఇన్‌స్ట్రుమెంటేషన్): **11 పోస్టులు**
5. ఇంజనీర్(సివిల్): **1 పోస్టు**
6. ఇంజనీర్(ఫైర్ అండ్ సేఫ్టీ): **3 పోస్టులు**
7. సీనియర్ కెమిస్ట్(కెమికల్ ల్యాబ్): **9 పోస్టులు**
8. మెటీరియల్స్ ఆఫీసర్: **6 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, బీఎస్సీ(ఇంజనీరింగ్), ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 18 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉండాలి

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా


దరఖాస్తు రుసుము: రూ.700. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఈఎస్ఎం అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 1

వెబ్‌సైట్: https://www.nationalfertilizers.com/

హెచ్‌పీసీఎల్‌లో ఇంజనీర్లు

మొత్తం ఖాళీలు: 247



ముంబయిలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్).. కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. మెకానికల్ ఇంజనీర్: **93**
2. ఎలక్ట్రికల్ ఇంజనీర్: **43**
3. ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్: **5**
4. సివిల్ ఇంజనీర్: **10**
5. కెమికల్ ఇంజనీర్: **7**
6. సీనియర్ ఆఫీసర్ - సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్: **6**
7. సీనియర్ ఆఫీసర్ - సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్ట్స్: **4**
8. సీనియర్ ఆఫీసర్/అసిస్టెంట్ మేనేజర్ - నాన్ - ఫ్యూయల్ బిజినెస్: **12**
9. సీనియర్ ఆఫీసర్ - నాన్ ఫ్యూయల్ బిజినెస్: **2**
10. మేనేజర్ - టెక్నికల్: **2**
11. మేనేజర్ - సేల్స్ ఆర్అండ్‌డి ప్రొడక్ట్ కమర్షియలైజేషన్: **2**
12. డిప్యూటీ జనరల్ మేనేజర్ క్యాటలిస్ట్ బిజినెస్ డెవలప్‌మెంట్: **1**
13. చార్టర్డ్ అకౌంటెంట్స్: **29**
14. క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్స్: **9**
15. ఐఎస్ ఆఫీసర్: **15**
16. ఐఎస్ సెక్యూరిటీ ఆఫీసర్ - సైబర్ సెక్యూరిటీ స్పెషలిస్ట్: **1**
17. క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్: **6**

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, బీఈ, బీటెక్, సీఏ, ఎంసీఏ, ఎంబీఏ, పీజీడీఎం, ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు రుసుము: యూఆర్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1180. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, గ్రూప్ టాస్క్, పర్సనల్ ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జూన్ 30

వెబ్‌సైట్: www.hindustanpetroleum.com/

లిటిల్స్

నిజమైన మంత్రదండం

అవంతీపురాన్ని పరిపాలించే రాజమహేంద్రవర్మకు చదరంగం అంటే ఇష్టం. దాంతో ఎక్కువ సమయం ఆ ఆట ఆడుతూ గడిపేవాడు. రాజ్యానికి సంబంధించిన విషయాలు పట్టించుకొనేవాడు కాదు. అతని మంత్రి వినయుడు కష్టపడి పనిచేసే స్వభావం కలిగినవాడు. మహేంద్రవర్మ అప్పుడప్పుడు తన మంత్రితో- "మన దగ్గర ఒక మంత్రదండం ఉంటే బావుంటుంది. ఎవరు ఏమి అడిగినా ఇచ్చేయవచ్చు" అంటూ ఉండేవాడు. రాజుకు ఎలాగైనా బుద్ధి చెప్పాలనుకొని మంత్రి వినయుడు ఒక రోజు- "రాజా.. మన రాజ్యంలోకి ఒక మునీంద్రుడు వచ్చాడు. ఆయన దగ్గర ఉన్న మంత్రదండం మహిమ కలిగినది. ఎవరు ఏమి అడిగినా వెంటనే ప్రత్యక్షమవుతుంది. మీరు ఆ ముని మంత్రదండం అడిగి తీసుకోండి" అన్నాడు. వెంటనే



రాజు ముని దగ్గరకు వెళ్లి మంత్రదండం అడిగాడు. అప్పుడు ఆ ముని- "రాజా! ఈ మంత్రదండం వద్దనే ఒక వ్యక్తిని చూపించు.. అప్పుడు నీకు ఈ మంత్రదండం ఇస్తా" అన్నాడు. దాంతో రాజు తన రాజ్యమంతా దండోరా వేయించాడు. అందరు ప్రజలు మంత్రదండం కోసం ఎగబడ్డారు. గూఢచారులు వచ్చి- "రాజా! రాజధాని సమీపంలో కట్టెలు కొట్టుకొని బతికే చిన్నయ్య మాత్రం మంత్రదండంపై ఎలాంటి ఆసక్తి చూపించటం లేదు" అని చెప్పారు. అప్పుడు రాజు అతనిని పిలిపించి- "నీకు మంత్రదండం ఎందుకు వద్దు..? కారణం చెప్పు?" అన్నాడు. అప్పుడు చిన్నయ్య- "నేను గొడ్డలితో చెట్లు నరుకుతాను. సంపాదించుకుంటాను. నా గొడ్డలే నా మంత్రదండం" అన్నాడు. అప్పుడు రాజుకు తాను చేస్తున్న తప్పు అర్థమయింది.

5 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



ఎన్ని శునకాలు?



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 338

8		7				2		
			5				7	
	3			9	4			
	5				7	9		
1				5				8
		8	3				1	
			8	3			4	
	8				9			
		4				6		9

సుడోకు - 337 సమాధానం

3	1	6	4	7	2	5	8	9
4	8	5	9	6	1	7	3	2
7	2	9	3	5	8	1	4	6
5	4	2	1	9	6	3	7	8
8	6	1	7	2	3	9	5	4
9	3	7	8	4	5	2	6	1
6	9	8	2	3	7	4	1	5
2	5	3	6	1	4	8	9	7
1	7	4	5	8	9	6	2	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.